





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 142 | మంగళవారం | 22-04-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


• జోహార్లు



ప్రపంచ గమనం మార్చిన మహాశయుడు

**వి.ఐ లెనిన్ జయంతి నేడు**

22-04-1870 – 21- 01-1924

## స్కూల్ పిల్లలకు నిషేధిత ఇ-సిగరెట్లు, వేపర్స్

- తెలంగాణలో, ఏపిలో రూ.కోటికిపైగా విక్రయాలు
- గుట్టురట్టు చేసిన టిజిఎఎన్‌బి
- రూ.25లక్షల సిగరెట్ల స్వాధీనం

03

## 'ఎసిబి వల'లో అవినీతి అధికారులు

- మణుగూరు, ఆర్మూర్, జనగామ జిల్లా చిల్పూరులో ఎసిబి మెరుపుదాడులు

## తులం బంగారం అక్షరాలా రూ.లక్ష!

05

## ఇస్రో ఖాతాలో మరో ఘనత..

- స్పేడెక్స్ రెండో డాకింగ్ ప్రక్రియ సక్సెస్..

# అద్భుత భవిష్యత్తుకు బాటలు



హైదరాబాద్‌కు రండి...
జపాన్ ఉత్పత్తులు తయారు చేయండి

- జపాన్ వ్యాపారవేత్తలను ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఒసాకా ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

ప్రజాపక్షం / హైదరాబాద్

'తెలంగాణకు జపాన్‌కు మధ్య చక్కటి సంబంధాలున్నాయి. హైదరాబాద్‌కు రండి. జపాన్ కంపెనీలు ఉత్పత్తులు తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి. ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోంది. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తుకు బాటలు వేద్దాం'' అని జపాన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన 'వరల్డ్ ఎక్స్ పోలో' తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం భాగస్వామ్యమైంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది. ఈ సందర్భంగా తరువాయి 2లో

# రూ.1 కోటి రివార్డున్న నక్సల్ హతం



- జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రయాగ్ మాంఝీ సహా ఎనిమిది మంది మృతి
- మృతుల్లో మరో ఇద్దరిపైనా రివార్డులు

**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. లాల్ పానియా ప్రాంతంలోని లుగూ హిల్స్ వద్ద సోమవారం ఉదయం కోబ్రా దళాలతో జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ సహా 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటికే వివేక్ పేరిట రూ.కోటి రివార్డ్‌ను ప్రకటించినట్లు తరువాయి 2లో

# త్వరలోనే పెండింగ్ ధాన్యం బోనస్




- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్‌కు ఎంతో ఉపయోగముండేది
- రూ. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టినా అదనంగా ఒక్క చుక్కా నీరు రాలేదని విమర్శ

**నిజామాబాద్ :** పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో రైతు మహోత్సవం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా.. అదనంగా ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని విమర్శించారు. నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మరిన్ని చెక్ డ్యామ్‌లు మంజూరు చేస్తాం. రైతు పక్షపాతిగా ఈ ప్రభుత్వం సాగుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం నిర్మించారు. బిఆర్ఎస్ తరువాయి 2లో

# భవన నిర్మాణ కార్మికుల పట్ల పాలకులు చిన్నచూపు




ఫలితంగా అందరూ అసంఘటిత కార్మికులుగా మారారు

యూనియన్ రాష్ట్ర మహాసభల బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నేడు అందరూ అసంఘటిత కార్మికులుగా మారిపోయారని, భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఎంత బాగా చూసుకుంటే దేశం అంత వెలుగొందుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ తరువాయి 2లో

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత



రానున్న ఆరు రోజుల్లో అంత్యక్రియలు

ప్రపంచవ్యాప్తంగా సంతాపసందేశాలు

**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ చర్చ్ ప్రధానాధిపతి, వాటికన్‌సిటీ సర్వసార్వభౌమాధికార రాజ్యాధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణించారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. 12 సంవత్సరాలు ఆయన పోప్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మరణ వార్త తెలియగానే సెయింట్ పీటర్స్ స్క్వేర్ వీధుల్లో ప్రజలు పెద్దపెద్ద రాగాలు తీస్తూ ఏడ్చేదృశ్యాలు కనిపించాయి. కడసారిగా ఈస్టర్ సందర్భంగా ఆదివారం నాడు ఆయన ప్రజలను కలిసి సందేశం ఇచ్చారు. ఆయన హయాంలో అనేక కీలక సంస్కరణలు జరిగాయి. మానవతావాదానికి ఆయన పెద్దపీట వేశారు. రోమ్ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలు) బిషప్ తరువాయి 2లో









# ప్రపంచం
WORLD NEWS

## 148కి పెరిగిన కాంగో నదిలో మృతులసంఖ్య



**కిన్షాసా :** కాంగోనదిలో పడవ మునిగిపోయిన ఘటనలో మృతులసంఖ్య సోమవారానాటికి 148కి పెరిగింది. మరో 100 మంది ప్రయాణికుల జాడ తెలియకపోవడంవల్ల ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రమాదం నుండి ఇప్పటివరకూ 150 మంది సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. డి.ఆర్.కాంగోలో గడచిన శుక్రవారంనాడు పడవలో మంటలు చెలరేగడంతో పడవ తలక్రిందులైంది. అప్పటికే పడవలో సామర్థ్యానికి మించిస్థాయిలో ప్రయాణికులు ఉన్నారు. ఇదే ప్రాంతంలో గడచినవారంలో కూడా ఇదేవిధంగా ఒక పడవ తలక్రిందులు కావడంతో 72 మంది ప్రయాణికులు మరణించారు.

## అమెరికా కాంగ్రెస్ సభ్యులు, అధికారులపై చైనా ఆంక్షలు

**వాషింగ్టన్ :** చైనా–అమెరికా మధ్య సుంకాల యుద్ధం పరాకాష్టకు చేరుకున్న తరుణంలో చైనా తీవ్రంగా స్పందిస్తోంది. కొంతమంది అమెరికా కాంగ్రెస్ సభ్యులు, అమెరికా అధికారులు, స్వచ్ఛంధ సంస్థల అధిపతులపై చైనా సోమవారం నాడు ఆంక్షలు విధించింది. హాంకాంగ్‌కు సంబంధించిన సమస్యపై అమెరికా హద్దుమీరి ప్రవర్తిస్తున్నందువల్ల ఈ చర్యలు చేపట్టినట్లు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది. గతనెలలో ఆరుగురు చైనా, హాంగ్‌కాంగ్ అధికారులపై అమెరికా ఆంక్షలు విధించినందుకు ప్రతీకార చర్యగా చైనా ఈ ప్రకటన చేసింది. అదేవిధంగా సుంకాల విషయంలో కూడా ఇప్పటివరకూ హెచ్చరికలతో సరిపెట్టిన చైనా ఆ దశను దాటి చిన్న చిన్న ఆచరణాత్మక చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. చైనాపై 245 శాతం సుంకాలను అమెరికా విధిస్తే, అందుకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా నుండి వచ్చే దిగుమతులపై 125 శాతం సుంకాలను విధించింది. అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా భావసారూప్యతగల



అన్ని దేశాలను తనవెంట కూడగడతామని చైనా ప్రకటించింది.


**చైనా వాణిజ్య ప్రయోజనాలు దెబ్బతీస్తే ఆంక్షలు**

తమ వాణిజ్య ప్రయోజనాలను పణంగాపెట్టి అమెరికాతో సంప్రదింపుల ద్వారా ఒప్పందాలు చేసుకున్న దేశాలపై వాణిజ్య ఆంక్షలు విధిస్తామని చైనా ప్రకటించింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు తలొగ్గదని, ఆ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. అలాంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించింది. తమతో దాదాపు 70 లేదా 80 దేశాలు చర్చలకు సిద్ధపడుతున్నాయని, టారిఫ్‌లు తగ్గించమని అడుగుతున్నాయని డోనాల్డ్ ట్రంప్ కొద్దిరోజులక్రితం ప్రకటించారు. ట్రంప్‌తో టారిఫ్ బేరసారాలు చేస్తూ, తమ దేశ వాణిజ్య ప్రయోజనాలు పణంగా పెడితే అలాంటి దేశాలను ఉపేక్షించేది లేదని ఈ పూర్వరంగంలో చైనా హెచ్చరించింది. ఈ విధమైన ఒప్పందాలను తమదేశం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఒక హెచ్చరిక చేశారు. చైనాతో వాణిజ్య సంబంధాలను పరిమితం చేసేందుకు, ఇతర దేశాలతో తమ వాణిజ్యాన్ని దెబ్బతీసేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోందని ఇలాంటి చర్యలను తాము సమ్మతించబోమని చైనా ప్రతినిధి చెప్పారు. పొరుగుదేశాల వాణిజ్య ప్రయోజనాలు పణంగాపెడితే సహించబోమని పేర్కొన్నారు. టారిఫ్ సంప్రదింపులను ఒక ఒత్తిడి చేసే ఆయుధంగా డజనుపైగా దేశాలపై అమెరికా ప్రయోగిస్తోందని గతవారం వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. అమెరికాతో ప్రధాన వాణిజ్య భాగస్వాములుగా ఉన్న దేశాలు చేసుకునే ఎలాంటి ద్వైపాక్షిక ఒప్పందాలైనా చైనా విదేశీ వాణిజ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రపంచ వాణిజ్య సంస్థ డేటా ఇప్పటికే పేర్కొంది.

## మీరంటే ఎంతో గౌరవం,మాతో కలిసి రండి

### భారత్‌కు ఇజ్రాయెల్ అధ్యక్షుడు విజ్ఞప్తి

**జెరూసలెం :** ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కలిసి పనిచేద్దామని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ భారత్‌కు విజ్ఞప్తి చేశారు. భౌగోళిక, వ్యూహాత్మక సమస్యలపై ప్రత్యేకించి భారత్–మధ్య, తూర్పు యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఇసి) ప్రాజెక్టుపై పనిచేసేందుకు కలిసి రావాలని భారత్‌కు సోమవారం నాడు ఐజాక్ హెర్జోగ్ విజ్ఞప్తి చేశారు. ''భారతదేశంపట్ల తమకు ఎంతో గొప్ప గౌరవం ఉంది, ఆ దేశ నాయకత్వంపై కూడా మాకెంతో గౌరవం ఉంది, ఇజ్రాయెల్ మీ దేశాన్ని ఎంతగానో ప్రేమిస్తోంది, మీ దేశంలో పర్యటన చేసేందుకు నేను ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నాను, అదేవిధంగా భారతదేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతికి ఇజ్రాయెల్‌లో ఆతిథ్యం ఇచ్చేందుకు కూడా ఎంతో కుతూహలంతో ఉన్నాం'' అని హెర్జోగ్




పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో భారత్ కొత్తగా నియమించిన దౌత్యవేత్త జె.పి.సింగ్‌కు హెర్జోగ్ ఈ విషయం చెప్పారు. టెల్‌అవీవ్‌లో దౌత్యవేత్తగా నియమితులైన సింగ్ తన అర్హత పత్రాలను ఇజ్రాయెల్ అధ్యక్షుడికి సమర్పించి సమావేశమైన సందర్భంగా ఐజాక్ హెర్జోగ్ పైవిధంగా స్పందించారు. ''మీ పదవీకాలంలో ఎంతో గొప్ప విజయాలను మీ బృందం సాధించాలన మేం ఆకాంక్షిస్తున్నాం, మనం మరింత ఉన్నతస్థాయిల్లో సంబంధాలను వృద్ధిచేసుకోవాలి'' అంటూ సింగ్‌కు హెర్జోగ్ ఆహ్వానం పలికారు. సింగ్ ఆయనను అధ్యక్షుడి అధికార నివాసంలో కలిశారు. ''ఐఎంఇసి అనేది ప్రపంచ భవిష్యత్తు, కేవలం ఈ ప్రాంతానికి మాత్రమే కాదు, ఇజ్రాయెల్, భారత్‌లతోపాటు యూరప్, అమెరికా భౌగోళిక రాజకీయ సంబంధాలలో కూడా ఈ ఐఎంఇసి ప్రాజెక్టు మార్పులు తీసుకువస్తుంది, ప్రజలమధ్య విశ్వసనీయతను, సంబంధాలను వృద్ధిచేస్తుంది'' అని చెప్పారు. 2023లో న్యూఢిల్లీలో జీ–20 సదస్సు సందర్భంగా ఈ ఐఎంఇసి ప్రాజెక్టును ప్రకటించారు. భారత్ నుండి యూరప్ వరకూ, ఆసియా, మధ్యప్రాచ్యాలను అనుసంధానం చేస్తూ ఈ మౌలిక సదుపాయాలు విస్తరిస్తాయి.

## ఈ వారంలోనే రష్యా–ఉక్రేన్ శాంతి ఒప్పందం : ట్రంప్

**వాషింగ్టన్ :** రష్యా–ఉక్రేన్ మధ్య ఈ వారంలోనే యుద్ధానికి సంబంధించిన ఒక ఒప్పందం జరుగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. పుతిన్‌తో ట్రంప్ మధ్యవర్తిత్వం చేసిన తర్వాత ఉక్రేన్,రష్యామధ్య యుద్ధం మరింత తీవ్రతరమైంది. ఈస్టర్ సందర్భంగా పుతిన్ స్వచ్ఛంధంగా 24 గంటలు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ విమర్శించారు. ఉక్రేన్ దేశమే ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులు చేసిందని పుతిన్ విమర్శించారు. ఈ విధమైన విమర్శలు, ప్రతివిమర్శల మధ్య ట్రంప్ తాజా ప్రకటన చేశారు. ఆదివారం రాత్రితోనే పుతిన్ ప్రకటించిన కాల్పుల విరమణ గడువు పూర్తయిందని, ఈ గడువును పుతిన్ పొడిగించలేదని మాస్కో వర్గాలు ప్రకటించిన తర్వాత మళ్ళీ దాడులు, ప్రతిదాడులు కొనసాగాయి. ఈ వారం



లోనే రెండు దేశాలమధ్య ఒప్పందం జరుగుతుందని, తద్వారా రెండు దేశాలు అమెరికాతో సంబంధాలు, ఒప్పందాలు చేసుకునే అవకాశాలుంటాయని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా నెట్‌వర్క్‌లో ట్రంప్ ఒక పోస్టింగ్ పెట్టారు. ఇదిలా ఉండగా తమ దేశంలోని పలు ప్రాంతాలపై రష్యా డ్రోన్లతో దాడులు చేసిందని ఉక్రేన్ ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటన చేసింది. పుతిన్ 30 గంటలపాటు యుద్ధాన్ని విరమిస్తున్నట్లు ఈస్టర్ సందర్భంగా ప్రకటించారు. ఈ గడువు ముగిసిన వెంటనే దాడులు మొదలయ్యాయని ఉక్రేన్ పేర్కొంది. ఐతే రష్యా ప్రభుత్వ వర్గాలు కూడా తా ము



తిరిగి దాడులు ప్రారంభించినట్లు ధృవీకరించాయి. కీవ్,ఖెర్సాన్, డ్నిప్రోపెట్రోవ్స్క్, ఛెర్కసీ, మైఖొలైవ్, జెపోరిఝియా తదితర ప్రాంతాలలో సైన్యం అప్రమత్తంగా ఉండాలని ఉక్రేన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన రష్యా ప్రస్తుతం 20 శాతం ఉక్రేన్ ప్రాంతాలను తన అధీనంలోకి తెచ్చుకుంది.

## ఇజ్రాయెల్‌పై దాడికి 30 వేలమంది సిద్ధం?

**రియాద్ :** ఏడాదిన్నరకాలంగా గాజాను మృత్యులోయగా మార్చిన ఇజ్రాయెల్‌పై హమాస్ సంస్థ ప్రతీకారంతో రగిలిపోతోంది. పాలస్తినాలో యుద్ధం కారణంగా కకావికలమైన కుటుంబాలలలో 20 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. దేశాలు పట్టిపోయారు. రోజువారీ ప్రాతిపదికపై దాడుల్లో మరణిస్తున్నారు. ఐతే హమాస్ మాత్రం 30 వేలమంది యువకులను, ఎదుగుతున్న పిల్లలను తమ దళంలోకి తీసుకుని శిక్షణ ఇస్తోందని, తదుపరి దాడులకు వారిని సిద్ధం చేస్తోందనీ సౌదీకి చెందిన ''అల్ అరేబియా'' మీడియా పేర్కొంది. హమాస్‌కు చెందిన సాయుధ విభాగం ఇజ్ అద్ అల్ కస్సామ్ బ్రిగేడ్‌లో వీరందరినీ చేర్చి శిక్షణ ఇస్తున్నట్లు పత్రిక పేర్కొంది. వీరికి గెరిల్లా యుద్ధంలో శిక్షణ ఇవ్వడంతో పాటు రాకెట్లను ప్రయోగించడం కూడా నేర్పుతోందని పేర్కొంది. కానీ వాస్తవానికి హమాస్ నాయకత్వం ఇజ్రాయెల్ దాడులకారణంగా క్షీణదశలో ఉంది. కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దే యత్నాలలో దీనిని ఒక భాగంగా భావిస్తున్నారు. వారికి తగిన వనరులు కూడా లేవు. హమాస్ తిరిగి తలెత్తకుండా చేసేందుకు గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రయత్నిస్తుండగా భవిష్యత్ యుద్ధ వ్యూహాలను హమాస్ రచిస్తున్నది. ఐతే వాస్తవిక పరిస్థితుల రీత్యా ఈ కథనం వెనుక విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా మారింది. కానీ ఇటీవలి వారాలలోనే ఈ రిక్రూట్‌మెంట్లు జరిగాయని అల్ అరేబియా మీడియా పేర్కొంది. ఇదిలా ఉండగా గాజాలో నెలరోజులక్రితం 14 మంది రెడ్ క్రిసెంట్ వైద్య సహాయ సిబ్బందిని హతమార్చిన ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని పాలస్తినా సివిల్ డిఫెన్స్, రెడ్ క్రిసెంట్‌లు డిమాండ్ చేశాయి. రాత్రిపూట అతిదారుణంగా



సహాయ వైద్యబృందాలను ఇజ్రాయెల్ దళాలు చంపాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ విషయంలో ఇజ్రాయెల్ తప్పుడు దర్యాప్తు నివేదిక పేరుతో అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించాయి. ఇదిలా ఉండగా హమాస్‌కు లొంగకుండా ఇజ్రాయెల్ బందీలను దేశానికి తీసుకువచ్చే ప్రక్రియ అత్యంత కీలక దశకు చేరిందని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమెన్ నేతన్యాహూ చెప్పారు. అలవికాని హమాస్ డిమాండ్లను అంగీకరించేదిలేదని, వాటిని పక్కకునెట్టి బందీలను జల్లెడపట్టి వెదకి తీసుకువస్తామని అన్నారు.

## ధాన్యం బోనస్ (మొదటి పేజీ తరువాయి)

నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

**రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలు నిలిపివేశారు : మంత్రి తుమ్మల**

పసుపు పంటకు మద్దతు ధర వస్తేనే.. పసుపు రైతు తలెత్తుకుని ఉండగలడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటి వచ్చే రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలను నిలిపివేసింది. అకాల వర్షాలకు పంట నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తాం. భారాస హయాంలో పదేళ్ల పాటు వ్యవసాయ యంత్ర పరికరాలను ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని పునరుద్ధరించింది. ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ సాగు పెరగాల్సి ఉంది. 4 ఎకరాల వరిసాగుతో వచ్చే లాభం ఎకరం ఆయిల్‌పామ్ తోటతో వస్తుంది అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, ఏనుగు రవిందర్ రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## పాలకులు చిన్నచూపు
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి)రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బుజ్జిని రత్నాకర్ రావులతో కలిసి ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఆకాశాన్ని ముద్దాడే భవనాలను నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్మికులను పాలకులు చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు.పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నేడు అందరూ అసంఘటిత కార్మికులుగా మారిపోయారన్నారు. గతంలో కార్మిక రంగంలో సంఘటిత,అసంఘటిత రంగ కార్మికులని వేరువేరుగా ఉండేవారని,ప్రస్తుతం అన్నిచోట్ల పర్మినెంట్ కార్మికులకు బదులుగా నియమించుకునే సందర్భంలోనే తాత్కాలిక ఉద్యోగులు నియమిస్తున్నారని నారాయణ అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు ప్రోత్సహిస్తూ,కార్మికులు పేదలపై భారాలు మోపుతుందన్నారు. అందులో భాగంగానే 29 మంది కార్పొరేట్ శక్తులు 16 లక్షల కోట్లు ఎగ్గొట్టిన పట్టించుకోని ప్రభుత్వం సామాన్యులు వాడు వంద రూపాయల కొనుక్కుని చెప్పులపై జిఎస్టి ఐదు నుండి 18 శాతానికి పెంచి, ధనవంతులు కొనుక్కుని వస్తువులపై జీఎస్టీని 33 శాతం నుండి 18 శాతానికి తగ్గించిందని విమర్శించారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు అది వారేమన్నారు. కార్మిక వర్గ పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో రాష్ట్రంలో నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతుందని ఆయన గుర్తు చేశారు.భవన నిర్మాణ కార్మికుల హక్కులను అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు విమర్శించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం నరసింహ,ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గన్న అరవు రమేష్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కే రామస్వామి,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సామిడి శేఖర్ రెడ్డి,ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎస్ మల్లేష్,హరి సింగ్ నాయక్ ఎం శ్రీను నాయక్,జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే నర్సింహారెడ్డి,జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్,నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుమూత
(మొదటి పేజీ తరువాయి)

మరణించినట్లు ఒక వీడియో సందేశంలో వాటికన్‌సిటీ వర్గాలు తెలియజేశాయి. పోప్ పదవిని అధిష్ఠించిన మొట్టమొదటి లాటిన్ అమెరికన్‌వాసి ఫ్రాన్సిస్. డబుల్ న్యుమోనియా కారణంగా ఇటీవల ఆయన ఐదువారాలపాటు ఆసుపత్రిలో చికిత్సపొంది మరణం అంచులను తాకి వచ్చారు. ఆసుపత్రి నుండి విడుదలయ్యాక మూడోరోజున బ్రిటన్ రాజదంపతులను కలిశారు. వారిని ఆశీర్వదించారు. ఏప్రిల్ ఆరో తేదీన కొద్దిసేపు ప్రజలకు వీల్‌ఛైర్‌లో కనిపించారు. ఏప్రిల్ 10న సెయింట్ పీటర్స్ బాసిల్లికాను సాధారణ దుస్తుల్లో సందర్శించారు. ఈస్టర్ సందర్భంగా గురువారంనాడు రోమ్ జైలును సందర్శించారు. ఏప్రిల్ 20 ఆదివారంనాడు ఈస్టర్ సందర్భంగా ప్రజలను ఆశీర్వదించారు. అదేరోజు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ దంపతులతో అనధికార సమావేశం జరిపారు. ఆ మరునాడే మరణించారు. రాబోయే ఆరు రోజుల లోపు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు జరుగుతాయి. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త వినడంతో ప్రపంచ్యాప్తంగా అనేక దేశాల నాయకులు వాటికన్ సిటీకి వరద ప్రవాహంలా సంతాప సందేశాలు పంపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మంది రోమన్ క్యాథలిక్ ప్రజలకు ఆయన ప్రధాన మార్గదర్శకుడుగా గడచిన 12 సంవత్సరాలుగా బాధ్యతలు నిర్వహించారు. మూడవ పోప్‌పాల్ జెసూట్ ఉత్తర్వు ప్రకారం ఏర్పడిన సొసైటీ ఆఫ్ జీసస్ బృందం నుండి రోమ్ బిషప్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి గురువు పోప్ ఫ్రాన్సిస్.

**జీవిత సంగ్రహం :** లాటిన్ అమెరికాదేశం అర్జెంటైనా రాజధాని బ్యూనోస్ ఐర్స్‌లో 1936 డిసెంబరు 17వ తేదీన పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. 1958లో తీవ్ర అనారోగ్యానికిగురై మరణం అంచులు చూసి తిరిగి వచ్చిన బెర్గోగ్లియో 1969లో నాటి పోప్ ఆశీర్వాదాలతో జెసూట్స్‌లో చేరారు. క్యాథలిక్ మత గురువుల మంత్రివర్గ సభ్యుడయ్యారు. 1973 నుండి 1979 వరకూ అర్జెంటైనాలో ప్రొవెన్షియల్ సుపీరియర్‌గా ఒకరుగా బాధ్యతలు నిర్వహించారు. 1998లో బ్యూనోస్ ఐర్స్ ఆర్చ్ బిషప్ బాధ్యతలు స్వీకరించారు. పోప్ జాన్ పాల్–2 ఆదేశాల ప్రకారం 2001లో ఆయన సలహాదారులలో ఒకరుగా బాధ్యతలు తీసుకున్నారు. 2001లో అర్జెంటైనా బ్యూనోస్‌ఐర్స్‌లో హింసాకాండ చెలరేగినప్పుడు శాంతిసాధనలో చర్చ్ గురువుగా బాధ్యతలు నిర్వహించారు. 2013 ఫిబ్రవరి 28న బెనెడిక్ట్–16 రోమ్ బిషప్ పదవికి రాజీనామా చేయడంతో మార్చి 12,13 తేదీలలో జరిగిన పాపల్ సదస్సులో బెర్గోగ్లియో రోమ్ బిషప్‌గా నియమితులయ్యారు. పేద క్రైస్తవుడుగా జీవితాన్ని అనుష్ఠించి క్రైస్తవ మత బోధకుడుగా జీవించిన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి స్ఫూర్తితో, ఆయన జ్ఞాపకార్థం రోమ్ బిషప్ పదవికోసం బెర్గోగ్లియో తన పేరును ఫ్రాన్సిస్‌గా మార్చుకున్నారు.

వివిధ క్రైస్తవ విభాగాలమధ్య ఐక్యత ఉండాలని ఆయన పిలుపు ఇచ్చారు. 2016లో జరిగిన క్రైస్తవ అష్టమ ఐక్యతా కూటమి సందర్భంగా ఇతర క్రైస్తవులపట్ల రోమన్ క్యాథలిక్స్ అనుసరించిన వైఖరిపట్ల క్షమాపణలు తెలియజేశారు. అదేవిధంగా క్యాథలిక్స్‌ను హింసించినవారిని కూడా క్షమించాలని ఆ దేవుణ్ణి ప్రార్థించారు. క్రైస్తవ మతమే తనకు ప్రధానమని, ఏ మార్గాన్ని అనుసరించినాగానీ అని క్రైస్తవ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు ఇచ్చారు. బాలలను లైంగికంగా దోపిడీ చేస్తున్నారని క్యాథలిక్స్‌పై వచ్చిన తీవ్ర ఆరోపణలు ఆయన పదవీకాలంలో పెద్ద సవాలుగా నిలిచాయి. ఈ ఆరోపణలను ఆయన అధిగమించారు.

## నక్సల్ హతం
(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు వెల్లడించారు. అతడిని పుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అనే పేర్లతో కూడా పిలుస్తారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ, కేంద్ర కమిటీ సభ్యుడు మాంఝీ అలియాస్ వివేక్, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అరవింద్ యాదవ్ అలియాస్, అవినాష్, జోనల్ కమిటీసభ్యుడు సహేబ్రం మాంఝీ అలియాస్ రాహుల్ మాంఝీ, మహేష్ మాంఝీ అలియాసం మోట, టాలు, రంజు మాంఝీ, గంగారం, మహేష్ అనే మావోయిస్టులు ఉన్నట్లు వివరించారు. వివేక్ తలపై రూ.1 కోటి, అరవింద్ యాదవ్ తలపై 25 లక్షలు, సహేబ్రం మాంఝీ తలపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయని చెప్పారు. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి నక్సలైట్లు అడవుల్లోకి పారిపోయారు. అనంతరం మొత్తం 8 మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు. తాజా ఆపరేషన్‌లో ఎస్‌ఎల్‌ఆర్, ఇన్సాస్ వంటి భారీ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 209 కోబ్రా బెటాలియన్, జార్ఖండ్ పోలీసులు ఇందులో పాల్గొన్నారు. ఈ ఏడాది జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 2025 చివరికి రాష్ట్రాన్ని మావో రహిత రాష్ట్రంగా చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకొన్నారు. ఇప్పటికే 244 మంది మావోయిస్టులను రాష్ట్రంలో అరెస్టు చేయగా, పలు దళాల కమాండర్లతో కలిపి 24 మంది లొంగిపోయారు.

**ప్రశాంత్ హిల్స్ అతడి అడ్డా :** కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ, ధనాబాద్ జిల్లా తుండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దల్‌బుద గ్రామంలో పుట్టాడు. జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో జరిగిన దాదాపు 100దాడుల్లో ఇతడి హస్తం ఉంది. ముఖ్యంగా ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా చేసుకుని తన కార్యకలాపాలు నిర్వహించేవాడు. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50కేసులతో పాటు రూ.కోటి రివార్డు ప్రకటించారు. జార్ఖండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు ఇతడేనని పోలీసులు చెప్పారు ఇతడు పరస్నాథ్ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పోలీసులు వేగులను అప్రమత్తం చేసి హతం చేశారు.

**ఏడాది క్రితమే భార్య అరెస్ట్ :**

ప్రయాగ్ మాంఝీ భార్య జయాను గత సంవత్సరం పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలోనే చికిత్స తీసుకోవడానికి బయటకు రాగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ జయా మృతి చెందింది.


**నక్సలిజం నిర్మూలన దిశగా మా అడుగులు ఆగవు :**

నక్సలిజం నిర్మూలనకు తమ ప్రభుత్వ నిబద్ధత కొనసాగుతుందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా సోమవారం స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో భద్రతా దళాలతో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది నక్సలైట్ల వధ నేపథ్యంలో హోమ్ శాఖ మంత్రి ఆ వ్యాఖ్యలు చేశారు. 'నక్సలిజం నిర్మూలన దిశగా మా అడుగులు ఆగకుండా సాగుతున్నాయి. నక్సలిజం నిర్మూలనకు ప్రస్తుతం సాగుతున్న ఆపరేషన్‌లో భద్రతా దళాలు సోమవారం మరొక విశిష్ట విజయం సాధించాయి. జార్ఖండ్ బొకారో జిల్లాలోని లుగు హిల్స్‌లో ఎన్‌కౌంటర్‌లో కోటి రూపాయల రివార్డు ఉన్న అగ్రశ్రేణి నక్సల్ నేత, మరి ఇద్దరు ఘరానా నక్సలైట్లు సహా ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. మన భద్రత దళాలను శ్లాఘించాలి' అని అమిత్ షా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

## వడదెబ్బతో నలుగురు మృతి

**ప్రజాపక్షం/ తొర్రూరు/నిజామాబాద్/ నిర్మల్ :** వడదెబ్బతో నిజామాబాద్, నిర్మల్, మహబూబాబాద్‌లో నలుగురు మృతి చెందారు. వివరాలలోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత వడదెబ్బతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలంలోని వాడి గ్రామానికి చెందిన కర్క పటేండ్ల రాములు (65) అనే రైతు తన వ్యవసాయ పంట పొలంలో పనిచేస్తుండగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్లి వరి కర్రలను నూర్పిడి చేస్తున్నాడని, మధ్యాహ్నం అయినా కూడా ఇంటికి రాకపోవడంతో ఏం జరిగిందో తెలియక రాములు భార్య పొలానికి వెళ్ళి చూడగా తన భర్త రాములు విగతజీవిగా పడి ఉండడం చూసి





కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. నిర్మల్ జిల్లాలోనూ వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. నిర్మల్ పట్టణంలోని కుమన్నపేట్ కాలనీకి చెందిన శంకర్(48), రాజు 42 ఆదివారం పోచమ్మ పండుగ ఉండటంతో డప్పు కొట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన క్రమంలో నీరసంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మృతి చెందినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

## బాటలు (మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటి, బయోటెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని, వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు ఆర్ఆర్ఆర్‌కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్‌వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

**ఒసాకా ఎక్స్‌పోలో ఘనంగా తెలంగాణ పెవిలియన్ ప్రారంభం**

జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ రాష్ట్రం తన ప్రత్యేకమైన పెవిలియన్‌ను ఘనంగా ప్రారంభించింది. కిటాక్యూషు నుంచి ఒసాకా చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం భారత పెవిలియన్‌లో అడుగుపెట్టింది. భారత పెవిలియన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జోన్‌ను సిఎం రేవంత్ రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు.

ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకో ఎక్స్‌పో నిర్వహిస్తారు. ఒసాకో ఎక్స్‌పోలో పాల్గొన్న భారతదేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ కావటం విశేషమని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఒసాకా ఎక్స్‌పో వేదికపై తెలంగాణ తన వైవిధ్యమైన సంస్కృతి, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అనుకూల వాతావరణం, సాంప్రదాయ కళలు, పర్యాటక ఆకర్షణలను ప్రపంచం నలుమూలాల నుంచి వచ్చే సందర్శకులకు చాటిచెప్పనుంది. తెలంగాణ పెవిలియన్‌లో రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సెర్ప్‌లో సాధారణ బదిలీలకు.. మంత్రి సీతక్క ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. మంత్రి సీతక్క ఆదేశాలతో సెర్ప్‌లో పరిపాలనా బదిలీలకు అనుమతులు ఇస్తూ సోమవారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. సెర్ప్‌లో మొత్తం 3,974 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ సంస్థలో సాధారణ బదిలీలు జరిగి దశాబ్దాలు దాటిన నేపథ్యంలో ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం బదిలీలకు ఆమోదం తెలిపింది. చాలా మంది సిబ్బంది ఒకేచోట పాతుకుపోవడంతో పనుల్లో వేగం తగ్గిందని, మళ్లీ పనుల్లో వేగం పెంచేందుకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి చెప్పారు. మహిళా సంఘాలను స్వయం ఉపాధి దిశగా నడిపించి, సంపద సృష్టి దిశలో ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రక్రియ వేగవంతం కోసం బదిలీలు ఉపయోగపడతాయని భావిస్తున్న ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేసింది. కాగా, సెర్ప్ కేంద్ర కార్యాలయంలో ఎంతో మంది ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లాల్లో డిపిఎం, ఏపిఎంలు, సిసిలుగా చాలా మంది ఒకే దగ్గర పాతుకుపోయారు.

# ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



మధిరలో జాబ్ మేళాను ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/మధిర : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం రెడ్డిగార్డెన్స్ కళ్యాణ మండపం నందు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సారధ్యంలో అధికారులు, వివిధ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్ మేళాకు అధికసంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిధిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోరి కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కొద్దిమంది రాజకీయ నాయకులకే ఉద్యోగాలు వచ్చాయే తప్పా గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన ధ్యేయమని సిఎం రెవంత్‌రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ ఒక నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో మూడు అంచెల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. మొదటి సంవత్సరంలోనే 56వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతుందని తెలిపారు. రెండో దశలో ప్రపంచ వ్యాప్తంగా గ్లోబలైజేషన్లో భాగంగా వచ్చిన మార్పుల మేరకు బహుళ జాతి సంస్థలకు రాష్ట్రంలో వనరులు ఏర్పాటు చేసి ఆ సంస్థల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం అన్నారు. మూడవ దశలో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రూ.9వేల కోట్ల పెట్టుబడితో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చామని, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఎంపికైన వారందరికీ రాష్ట్ర వ్యాప్తంగా శాంక్షన్ లెటర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూలేనివిధంగా నిధులు కేటాయించామన్నారు. 5లక్షల మంది యుతవకు ఉపాధి కల్పించేలా మరో నాలెడ్జి సిటి ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. మధిరలో జాబ్ మేళా ద్వారా ఒకే రోజు 5వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. మధిర నియోజకవర్గమంతా వ్యవసాయదారులేనని, భవిష్యత్‌లో వ్యవసాయంతో పాటు పరిశ్రమలు వచ్చేందుకు ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మధిర భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, దేశానికి, ప్రపంచానికి నాయకత్వం వహించేలా మధిర నియోజకవర్గ యువత ఎదగాలని ఆకాంక్షించారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అధిక మొత్తంలో నిధులు కేటాయించామని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను అప్గ్రేడ్ చేసి అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, సింగరేణి జనరల్ మేనేజర్ సాలెం రాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### 44 ఏళ్ల తర్వాత అధికారికంగా
# ఇంద్రవెల్లి అమరవీరుల వార్షికోత్సవం

బాధితుల కుటుంబాలకు సహాయాన్ని అందిస్తాం
అర్హత మేరకు ఉపాధి కల్పిస్తాం : మంత్రి సీతక్క



ఆదిలాబాద్: ఇంద్రవెల్లి అమరవీరుల వార్షికోత్సవాన్ని ఆదివారం 44 సంవత్సరాల తర్వాత తొలిసారిగా అధికారికంగా నిర్వహించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. గిరిజనుల త్యాగాలను మంత్రి గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బాధితుల కుటుంబాలకు సాధ్యమైన అన్ని సహాయాలను అందిస్తుందని చెప్పారు. అర్హత మేరకు ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటిడిఎ) లేదా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా వారికి ఉపాధి కల్పిస్తామని ఆమె ప్రకటించారు. ఇందిరమ్మ పథకం కింద బాధితుల కుటుంబాలలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఐదు ఎకరాల సాగుభూమి, ఇంటి స్థలాలను కేటాయిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. 1981 పోలీసు కాల్పుల్లో మరణించిన వారి కుటుంబాలు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అంచనా వేయడానికి ఐటిడిఎ పరిధిలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. వచ్చే ఏడాది నాటికి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద బాధితుల ఫోటోలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు చెక్కులను పంపిణీ చేసిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఆంక్షలను తొలగించి, స్మారక దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించిందని అన్నారు. స్మారక చిహ్న అభివృద్ధికి ఒక ఎకరం భూమి, రూ.1కోటితో పాటు ఈ ప్రాంతంలో అనేక ఇతర అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. 1981 ఏప్రిల్ 20న అప్పటి అవిభక్త ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి గ్రామంలో పోలీసు కాల్పుల్లో 13 మంది గిరిజనులు మరణించారు. భూ ఆక్రమణలు, దోపిడీకి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించేందుకు ఆదివాసీ గిరిజన రైతు కూలి సంఘం భారీ బహిరంగ సభకు ప్లాన్ చేసింది. పోలీసులు అనుమతి నిరాకరించి, ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించారు. అయితే, సమావేశానికి అప్పటికే వచ్చిన చాలా మంది గ్రామస్తులు, విద్యార్థులకు ఈ వార్త చేరలేదు. ఉద్రిక్తతలు పెరగడంతో, పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అధికారిక రికార్డుల ప్రకారం 13 మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో 1986లో ఆదివాసీలు ఆ స్థలంలో ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు, కానీ అదే సంవత్సరం ప్రభుత్వం దానిని కూల్చివేసింది. నిరసనల తర్వాత, ప్రభుత్వం 1987లో స్మారక చిహ్నాన్ని పునర్నిర్మించింది. 1982 నుండి, గిరిజనులు ప్రతి సంవత్సరం నివాళులు అర్పిస్తూ ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. 1981లో జరిగిన ఈ ఘటన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు గిరిజన సంక్షేమంపై దృష్టి సారించాయి. యువతను ఉగ్రవాదం నుండి దూరం చేయడానికి విద్య, ఉపాధిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. కాగా, ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, పోలీసు సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా, ఇతర అధికారులు, నాయకులు స్మారక చిహ్నాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# ప్రభుత్వ దవాఖానాల్లో సకల సౌకర్యాల కల్పనకు నిరంతర కృషి

పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.1కోటి నిధులతో ఆధునిక థియేటర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/పాల్వంచ : ప్రభుత్వ దవాఖానాల్లో సకల సౌకర్యాల కల్పనకు నిరంతర కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి (సిహెచ్‌సి) లో రూ.1కోటి నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్థోపెడిక్, ఇఎన్‌టి, డెంటల్, కంటి, ఓపిడి, ఆపరేషన్ థియేటర్లను ఎమ్మెల్యే కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. పాల్వంచ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని, విద్య, వైద్యంకు తన మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వివిధ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సరైన వైద్యం అందించి వారి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, పాల్వంచ తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, పాల్వంచ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సోమరాజుదొర, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, కొండ వెంకన్న, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, మనేం వెంకన్న, నరహరి, నాగేశ్వరరావు, బానోత్ రంజిత్, రవి, భూక్యా విజయ్, రాజశేఖర్, దుర్గా మహేష్, కుమార్, రాజు, విజయ్, రాము, శాంత వర్ధన్, సుమ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను దళితులకే పరిమితం చేయడం సరికాదు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : భారతదేశ చరిత్రలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఎదుర్కొన్న అవమానాలు మరెవరూ ఎదుర్కోలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఎన్ని అవమానాలు ఎదురైనా అడుగడుగునా హేళనకు గురైనా వాటినే సోపానాలుగా చేసుకుంటూ అనుకున్న లక్ష్యానికి చేరుకోవడంతో పాటు తన చదువునంతా సమాజ శ్రేయస్సుకు అణగారిన వర్గాల అభ్యున్నతికి ధారపోసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్స్‌లో నిర్వహించిన సెమినార్‌లో బండి సంజయ్ ప్రసంగించారు. చిన్న సమస్య, అవమానాలు ఎదురైతే లక్ష్యసాధన నుంచి పక్కకు తప్పుకుంటున్న నేటి తరానికి అంబేద్కర్ జీవితమే స్ఫూర్తిదాయకమన్నారు. అంబేద్కర్‌ను దళితజాతికే పరిమితం చేయాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. చరిత్ర అంటే డూప్లికేట్ గాంధీ కుటుంబానికే అన్నట్లుగా విపరీతమైన ప్రచారం చేసుకుని అంబేద్కర్‌ను తక్కువ చేసిందన్నారు. ఆర్టికల్ 370 దేశానికి మంచిది కాదని, ఒకే దేశానికి రెండు చట్టాలు కరెక్ట్ కాదని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకిస్తే ఆయనను అవమానిస్తూ ఆ ఆర్టికల్‌ను ఆమోదించిందన్నారు. గాంధీ కుటుంబ సభ్యులైన నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీలకు భారతరత్న ఇచ్చుకున్నారు కానీ అంబేద్కర్ మహనీయుడికి ఇవ్వకుండా ఆయనను ఓడించిన కజ్రోల్కర్‌కు పద్మభూషణ్ అవార్డు ఇచ్చి తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న ఏకైక పార్టీ బిజెపియే నన్నారు. కార్యక్రమంలో బండి సంజయ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్ రెడ్డి, సోమిడి వేణు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా నిలబడతాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/భద్రాచలం : చావు నోట్లో తలపెట్టి, పేగులు తెగేదాకా కొట్లాడి సాధించుకున్న మన తెలంగాణ మన కళ్లముందే ఆగమవుతోందని, తెలంగాణకు బిఆర్ఎస్సే శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బిఆర్ఎస్ కార్యకర్తలు, ఉద్యమకారులతో హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. బిఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకునేందుకు తాను వారధిగా ఉంటానని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే కేసిఆర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. సింగల్ ఎజెండాతో బిఆర్ఎస్ ముందుకు సాగుతుందని, తెలంగాణాను కాపాడుకోవడమే తమ లక్ష్యం అన్నారు. ఇక్కడ బిఆర్ఎస్ టిక్కెట్‌పై గెలిచిన డా.తెల్లం వెంకట్రావు తన స్వార్థం కోసం కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడని, ఉప ఎన్నికలు వస్తే ఇక్కడ గెలిచేది మళ్లీ బిఆర్ఎస్సే అని చెప్పారు. గెలిచిన అతి కొద్దికాలంలోనే రూ.1.60 వేల కోట్లను అప్పులు తెచ్చారని, వాటిని ఎలా ఖర్చుపెట్టారని అడిగితే బుకాయిస్తున్నారని మండిపడ్డారు. రూ.40 వేల కోట్ల విలువైన కంచ గచ్చిబౌలి భూములను రూ.10వేల కోట్లకు తాకట్టుపెట్టారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానం ప్రకారం రైతు రుణ మాఫీ ఇంకా 60 శాతం మందికి చేయలేదని, 50 శాతం మందికి రైతుభరోసా జమ చేయలేదన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా.. అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేసిఆర్ అహర్నిశలు కృషి చేశారని, సీతారామా ప్రాజెక్టు ద్వారా 3.5 లక్షల ఎకరాలకు కేసిఆర్ నీళ్లిచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్ధానాలు ఇస్తుంది మోసపోకండి గోసపడతరు అని కేసిఆర్ అప్పట్లోనే చెప్పారని, ఇప్పుడు అక్షరాల ఈ పాలనలో ప్రజలు గోసపడుతున్నారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధు సూధన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎంఎల్‌ఏ వనమా వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మానె రామకృష్ణ, బానోత్ చంద్రావతి, రావులపల్లి రాంప్రసాద్, తాంద్ర రమణారావు, ప్రభోద్‌కుమార్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లలకు నిషేధిత ఇ-సిగరెట్లు, వేపర్స్

టిజి,ఎపిలో రూ.కోటికిపైగా విక్రయాలు
గుట్టురట్టు చేసిన టిజిఎఎన్‌బి
రూ.25 లక్షల సిగరెట్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రాజధానిలోని విఐపి స్కూల్స్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నిషేధిత ఇ సిగరెట్లతో పాటు డ్రగ్స్ అణువాలు కలిగిన వేపర్స్‌ను విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిజిఎఎన్‌బి) సోమవారం రట్టు చేసింది. ఈ ముఠా ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రూ.కోటి వరకు వీటిని విక్రయాలు జరిపిందని పోలీసుల విచారణలో తేలింది. టిజిఎఎన్‌బిహైదరాబాద్ పోలీసులు ఇటీవల విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిషేధిత ఇ సిగరెట్లు, వేపర్స్ విక్రయాల గురించి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. టిజిఎఎన్‌బి అధికారులు ఆబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజ్, సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్, రోజరీ కాన్వెంట్ హైస్కూల్, సుజాత హైస్కూల్, జూనియర్ కాలేజ్‌లపై నిఘా పెట్టడంతో ఇ సిగరెట్ల రాకెట్ గుట్టు రట్టయ్యింది. ఈ సందర్భంగా సాదిక్ లాల్ అతని సోదరుడు అనిల్ లాల్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువైన ఇ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నిషేధిత ఇ సిగరెట్లను యువతకు, పాఠశాలకు వెళ్లే మైనర్ పిల్లలకు ఎస్ఐడి పేరుతో దాదాపు 500 మందితో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్లోకి కొత్త ఉత్పత్తి ఏదైనా వస్తే దాని గురించి ప్రకటనలు చేస్తూ విక్రయిస్తున్నారు. న్యూఢిల్లీకి చెందిన అమిత్, ముంబైకి చెందిన వసీమ్‌లు వీటిని నిందితులకు సరఫరా చేసినట్లు తేలింది. ఇ సిగరెట్లు 18 ఏళ్లలోపు 13 మంది బాలనేరస్థులను వారి ఫోన్ నంబర్లతో సహా గుర్తించారు. ఈ 13 మంది బాల నేరస్థులు చిన్న వయసులోనే మాదకద్రవ్యాల దుర్వినియోగంలో చిక్కుకునే అవకాశం చాలా ఎక్కువ. స్థానిక పోలీసులు వారి ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

# 'ఎసిబి వల'లో అవినీతి అధికారులు


మణుగూరు, ఆర్మూర్, జనగామ జిల్లా చిల్పూరులో ఎసిబి మెరుపుదాడులు



ప్రజాపక్షం/మణుగూరు/ఆర్మూర్/ జనగామ : తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ అధికారులు లంచావతారం ఎత్తి డబ్బు ఇస్తే తప్ప పనికాదని సతాయిస్తున్నారు. విసిగివేసారిన బాధితులు ఎసిబిని ఆశ్రయించడంతో ఎసిబి అధికారులు మెరుపుదాడులు నిర్వహించి అవినీతి అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు (ఎసిబి) సోమవారం ఈ దాడులు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఇద్దరు, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఒకరు, జనగామ జిల్లా చిల్పూరు మండలంలో నిర్వహించి దాడులలో మరొక అధికారి ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. దీనికి సంబంధించి వివరాలలోకి వెళితే... మణుగూరులో ఎసిబి అధికారులు సోమవారం మధ్యాహ్నం మెరుపుదాడి చేసి సిఐ సతీష్ కుమార్, రిపోర్టర్ గోపిని అదుపులోనికి తీసుకున్నారు. ఖమ్మం డిఎస్‌పి వై.రమేష్ వెల్లడించిన వివరాల ప్రకారం... మణుగూరులో గత కొద్ది రోజుల క్రితం గుట్టమారం పరిధిలో ప్రభుత్వ భూములను కొంత మంది వ్యక్తులు ఆక్రమించి అమ్ముకున్నారని వారిపై మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా ఆ కేసుకు సంబంధించి సిఐ సతీష్ కుమార్ మణుగూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి, అతని అల్లుడుని ఆ కేసులో ఇరికించకుండా ఉండేందుకు గాను రూ.4లక్షల లంచం డిమాండ్ చేశారని, దానికి సంబంధించిన పైకంలో రూ.3లక్షలు వేరొకరికి పంపించగా, మిగిలిన రూ.లక్ష ఓ టీవీ ఛానల్ రిపోర్టర్ గోపి, బేతంచర్ల వెంకటేశ్వరరావు గిన్నెల కొట్టు దగ్గర తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారులు రైడ్‌చేసి అదుపులోకి తీసుకున్నారు. కలర్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చిందని, అతనిని విచారించగా సిఐ సతీష్ కుమార్‌కు అందజేయటానికి తీసుకున్నట్లుగా తెలియజేయడంతో సిఐ సతీష్ కుమార్‌ను, గోపిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవ్వరినైనా లంచం అడిగితే ఎసిబికి తెలియజేయాలని, సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఖమ్మం ఎసిబి డిఎస్‌పి రమేష్ చెప్పారు.

**ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా చిల్పూరు మండల ఆర్ఐ వినీత్...**

జనగామ జిల్లా చిల్పూర్ మండలానికి చెందని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వినీత్‌కుమార్ రూ.26వేల లంచం స్వీకరిస్తూ ఎసిబికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఎసిబి అధికారులు వెల్లడించిన ప్రకారం... మ్యుటేషన్ ఫైల్‌కు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ రిపోర్టు కోసం ఫిర్యాదుదారుడి నుండి రూ.26వేల లంచం ఆశించగా సోమవారం ఎఐ కారు వెనక సీటుపై డబ్బులు పెట్టగా అక్కడికక్కడే పట్టుకున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. మారుతి స్విఫ్ట్ కారు టిఎస్ 03 ఇఎఫ్ 1458 వెనక సీటుపై పెట్టగానే పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి రూ.26వేలను సీజ్ చేయడం జరిగిందని చెప్పారు.



**ఆర్మూర్‌లోనూ.. పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగి..**



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రూ.7 వేలు లంచం తీసుకుంటూ పిఆర్ శాఖ సీనియర్ ఉద్యోగి శ్రీనివాస్ శర్మ సోమవారం ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆర్మూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ శర్మ నందిపేట్ మండలం డొంకేశ్వర్ గ్రామంలోని సిసి రోడ్డు పనుల బిల్లులో మంజూరు విషయంలో ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఎసిబి డిఎస్‌పి శేఖర్ గౌడ్ తెలిపారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించని
# వైద్య కళాశాలలపై కఠిన చర్యలు



అధిక, అడ్వాన్స్ ఫీజులతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: వైద్యవిద్యలో నాణ్యత ప్రమాణాలు పాటించని వైద్య కళాశాలల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలు తగ్గితే ప్రజల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని, ఇలాంటి కళాశాలల పట్ల కఠిన చర్యలు తప్పవని, అదనపు ఫీజులు, అడ్వాన్సు ఫీజులను ఇవ్వాలని విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. వైద్యకళాశాల మేనేజ్‌మెంట్, డీన్స్, ప్రిన్సిపల్స్‌తో హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్య ప్రమాణాలు, ఎన్ఎంసి నిబంధనలు, ఫ్యాకల్టీ, అటెండెన్స్, ఫీజులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయ ఉప సంచాలకులు నందకుమార్ రెడ్డి, డిఎంఇ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ డాక్టర్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు ఉన్నదని, ప్రపంచంలోని ఎన్నో ప్రఖ్యాత వైద్య సంస్థలలో తెలంగాణలో చదువుకున్న డాక్టర్లు లీడ్ చేస్తున్నారని, ఇక్కడి వైద్య విద్య ప్రమాణాల వల్లనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఘోస్ట్ ఫాకల్టీని పెట్టి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని, ఇలాంటి చర్యలతో వైద్య విద్య ప్రమాణాలు దిగజారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు చెల్లించే స్టైఫండ్స్ విషయంలో కొన్ని కళాశాలలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటి రాజీ పడకుండా కచ్చితంగా విద్యార్థులకు స్టైఫండ్‌ను చెల్లించాలని సూచించారు. కాలేజీలకు అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటల్స్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఎన్ఎంసి నిబంధనల విషయంలో కళాశాలలు ప్రస్తావించిన అంశాలను, వారి సమస్యలను ఎన్ఎంసి దృష్టికి తీసుకెళ్లి,వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి రాజనర్సింహ హామీనిచ్చారు.

**సహజపద్ధతిలోనే మామిడికాయలను మక్కపెట్టండి:**

మామిడి కాయలను కృతిమంగా పక్వం చేసేందుకు ఏర్పాటు చేసిన అవగాహన పోస్టర్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ టిజిఎంఎస్ఐడిసి కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. మామిడి పండ్ల వ్యాపారులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సహజ పద్ధతుల్లోనే మామిడికాయలను మక్కబెట్టాలని, కార్బైడ్ వంటి నిషేధిత పదార్థాలను వినియోగించొద్దని మంత్రి సూచించారు. నిషేధిత పదార్థాలను ఉపయోగించినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారభద్రత అధికారులు నిరంతరం తనిఖీలు చే పట్టాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు.


**శ్రీశ్రీశ్రీ ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానము**
భీమారం గ్రామం, హసన్‌పర్తి మండలం, హనుమకొండ జిల్లా.

Lr.No. SSSYVT/ప్రకటన/2025 — నోటిఫికేషన్ — తేది: 21.04.2025

శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్, తెలంగాణ వారి ప్రకారం
నమూనా - ఫారం-1 (నిబంధన 4 (1) చూడగలరు)
నోటీసు ఆర్.సి. నెం. యఫ్5/1749/2025, తేదీ : 17-04-2025 శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ.
ప్రకటన : ఆర్.సి.నెం. 1/937/2025, తేది 17-04-2025 శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా.
శ్రీ యర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానము, భీమారం గ్రామం, హసన్‌పర్తి మండలం, ఇందుమూలముగా తమరికి తెలియజేయునది ఏమనగా, పై దేవాలయమునకు సంబంధించి ఈ నోటీసు ప్రచురింపబడిన 20 రోజుల వరకు వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తలుగా నియామకము కొరకు వారి దరఖాస్తులను శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ / శ్రీయుత సహాయ కమీషనర్, ధర్మాదాయ శాఖ, వరంగల్ ఉమ్మడి జిల్లా వారికి పంపవచ్చును.
సం/- కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్
DIPR R.O. No. : 616-PP/CL/ADVT/1/2025-26, Date: 21-04-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హయత్‌నగర్ సర్కిల్-3**
NIT No. E/5826/02/2025-26/53 — తేది: 21.04.2025
**పని పేరు:** (5 పనులు) జిహెచ్ఎంసి, హయత్‌నగర్ సర్కిల్-3 యొక్క వార్డు నెంబర్ 11-నాగోల్, 13-హయత్‌నగర్ & 14-బిఎన్‌రెడ్డి నగర్‌లో వివిధ ప్రాంతాలలో సిసి రోడ్లు వేయడం మరియు ఫ్లోరింగ్ చేయడం & ప్రహరీ గోడ నిర్మాణం, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడం, **అంచనా విలువ :** రూ.73.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 30.04.2025న మ.3.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి, మొబైల్: 8790374055 & 7331189513. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 641-PP/CL/ADVT/1/2025-26, Date: 21-04-2025

ప్రజాపక్షం
మంగళవారం, ఏప్రిల్ 22

# రూ.లక్ష శిఖరంపై బంగారం

బంగారం 10 గ్రాముల రేటు సోమవారం రూ.1లక్షకు చేరి సరికొత్త శిఖరం అధిరోహించింది. వారం రోజులుగా ఇది ఊహిస్తున్నదే. బంగారం 5–10 ఏళ్ల క్రితమే పెద్దఎత్తున మధ్యతరగతులకు అందుబాటులో లేకుండా పోయింది. అయినా మధ్యతరగతి నుంచి ఉన్నత సంపన్న తరగతుల వారివరకు వారివారి బడ్జెట్‌లకు తగిన డిజైన్లు, పబ్లిసిటీతో బంగారు ఆభరణాల విక్రయశాలలు పోటీపడి పెరుగుతూనే ఉన్నాయి. ఇతర అన్ని వ్యాపారాలవలె గుత్తవ్యాపార ధోరణి బలపడింది. ఇవాళ బంగారం కొనుగోలు సమాజంలోని పై తరగతి 30 శాతానికి సంబంధించిన వ్యాపార క్రీడ. సమాజంలో గత 25–30 ఏళ్లుగా వివిధ తరగతుల మధ్య కొనుగోలు శక్తిలో పెరుగుతున్న అగాధం – అనగా ఆర్థిక అంతరాలను బంగారం మార్కెట్ ప్రస్ఫుటం చేస్తున్నది. పేదలు, మధ్యతరగతులు తమ కుటుంబాల్లో వివాహాది శుభ కార్యాలకు చిన్నమో, ఒకట్రెండు తులాలో కొనటానికి నానా అవస్థలు పడుతుంటే సంపన్నులు ఒంటినిండా దిగేసుకుని వెర్రి వ్యామోహం డిజైన్‌లతో దర్శనమిస్తున్నారు. బంగారం ధర ఇంతగా పెరిగిపోవ టం దేనికి సంకేతం? ఉత్పత్తి పడిపోయిందా? వినియోగం విపరీతంగా పెరిగిందా? రెండూ కాదు. అది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక మాంద్యం భయాలకు సంకేతం. డాలర్‌పై నమ్మకం తగ్గి స్థిరమైన ఆస్తిగా బంగారంవైపు పెరిగిన భరోసాకు సూచన. అన్నిటికీ మించి ప్రభుత్వాల ఆర్థిక సంక్షోభాలను నివారించుకోగల మార్గంగా బంగారం నిల్వ నిమిత్తం కొనుగోలు ముమ్మరం చేయటం. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధం ప్రపంచ వాణిజ్యంలో పెంచిన అస్థిరత ఈ సంక్షోభాన్ని వేగవంతం చేసింది. ఈ పరిస్థితిని ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభంగానూ చూడలేని మీడియా ఛానల్స్ ధర పెరుగుదల పట్ల ప్రజల్లో ఆందోళనను ప్రతిబింబించే కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తున్నాయి.

ప్రపంచంలో అత్యంత విశ్వసనీయమైన రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలర్ ఆకర్షణ సన్నగిల్లటంతో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు పోటీపడి తమ శక్తిమేరకు బంగారం కొనుగోలు చేస్తున్నాయి. మన రిజర్వుబ్యాంక్ కూడా రెండవ అతిపెద్ద కొనుగోలుదారుగా 2025 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో 2.8 టన్నులు కొనుగోలు చేసింది. 2024 లో 72.6 టన్నులు కొన్నది. దీంతో మొత్తం పసిడి నిల్వ 879 టన్నులకు చేరింది. ఇది దేశపు మొత్తం విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో 11.7శాతం. ఏప్రిల్ 11న రిజర్వుబ్యాంక్ ప్రకటించిన డేటా ప్రకారం దాని విలువ 677.8 బిలియన్ డాలర్లు.

భారత్ 879 టన్నుల నిల్వతో బంగారం నిల్వల్లో ప్రపంచంలో ఏడవ స్థానంలో ఉంది. ఇతర దేశాల నిల్వలు : అమెరికా 8,133.46 టన్నులు, జర్మనీ 3351.53 టన్నులు, ఇటలీ 2451.84 టన్నులు, ఫ్రాన్స్ 2436.94టన్నులు, చైనా 2264.32 టన్నులు, స్విట్జర్లాండ్ 1039.94 టన్నులు, జపాన్ 845.97 టన్నులు. భారత్ రిజర్వుబ్యాంక్ 2021లో 77.5 టన్నులు, 2022లో 33.3టన్నులు, 2023లో 16.2 టన్నులు, 2024లో 72.6టన్నులు కొనుగోలు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర 2023లో 15శాతం, 2024లో 22శాతం, 2025లో ఇంతవరకు 28 శాతం పెరిగినప్పటికీ మన రిజర్వుబ్యాంక్ కొనుగోళ్లు జోరుగా సాగించినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గణాంకాలు తెలుపుతున్నాయి.

ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధర పెరుగుదల తీరును నెలవారీ పోల్చిచూదాం. 2021 ఏప్రిల్ ఔన్స్ ధర కేవలం 1725 డాలర్లు, 2022 ఏప్రిల్‌లో 1920డాలర్లు, 2023 ఏప్రిల్‌లో 2000 డాలర్లు, 2024 ఏప్రిల్‌లో 2350 డాలర్లు, 2025 ఏప్రిల్ 16న 3,368డాలర్లు – అంటే కేవలం ఐదు సంవత్సరాల్లో దాదాపు 90శాతం ధర పెరిగింది. ఈ రోజున (21/4) 3410 డాలర్లు. కొద్దిరోజుల్లోనే ఐదేళ్లలో రెట్టింపు ధరతో సరికొత్త ప్రపంచరికార్డు నెలకొల్పుతుంది.

కాబట్టి బంగారం ధర తిరోగమనాన్ని ఆశించటం పేరాశే అవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు స్థిరమైన వృద్ధిరేటులో ప్రవేశించాలి – అందలి ద్రవ్యోల్బణం కనీస స్థాయికి రావాలి, మెజారిటీ ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు పెరగాలి. అది సంపన్న తరగతులకు సంపద పన్ను విధించకుండా ఇది సాధ్యం కాదు. రెండు, యుద్ధాలు, ప్రాంతీయ సంఘర్షణలు, ఉద్రిక్తతలు నివారించాలి. స్థిరత్వాన్ని నెలకొల్పాలి. వ్యాపారదేశాలు హృదయ పరివర్తన ఆశించలేము. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలకు నెలవు అని తెలిసిందే కదా?

# ప్రపంచగమనం మార్చిన మహాశయుడు



నేడు లెనిన్ 155వ జయంతి

నూతన సోషలిస్టు సమాజం నిర్మాణానికి బాట వేసిన రూపశిల్పి వ్లదీమిర్ ఇల్యిచ్ లెనిన్ 1870 ఏప్రిల్ 22న జన్మించారు. చారిత్రక భౌతికవాదం సూత్రాల ప్రకారం, లేదా చరిత్ర పాదార్థిక భావన ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ తదుపరి సోషలిజం వస్తుంది. క్రితం లోని వ్యవస్థస్థానంలోకి వచ్చే సామాజిక–ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ ఉన్నతమైంది అయి వుంటుంది. సోషలిజం కూడా కాపిటలిజం కన్నా ఉన్నతమైంది, ఆధిక్యవంతమైంది అవుతుంది. అది ఎల్లప్పుడు ఉత్పాదక శక్తుల పరిణామం ఫలితంగా ఆవిర్భవిస్తుంది. అది పరివర్తనలో కొత్త మార్గం తీసుకుంటుంది. ఈ పరివర్తన పారిశ్రామిక వ్యవస్థ నుంచి ఉన్నతమైన పారిశ్రామిక సంస్థల వ్యవస్థలోకి జరుగుతుంది. చారిత్రక భౌతికవాదం అదే చెబుతోంది. అయితే ఎలక్ట్రానిక్స్ ద్వారా పరిమాణం విస్ఫోటనంలా జరుగుతుందని అంగీకరించాలి. అది కాలం చెల్లిన ఉత్పత్తి శక్తులను వదిలించుకుంటుంది, నూతన దశలో ప్రవేశిస్తుంది. ఈ దశ కొత్త ఉత్పత్తి రీతిని, తదనుగుణమైన సామాజిక వ్యవస్థను తెస్తుంది. ఆ నూతన సామాజిక నిర్మాణాలను ఆవిష్కరిస్తుంది. వాస్తవానికి, సోషలిజం దిశగా కొత్త బాట గూర్చిన దృక్పథమే మార్పులకు లోనయింది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ ప్రాతిపదికగా ఉన్న నూతన వ్యవస్థ వికసించింది. దీనికి భారీయంత్రాలు, భారీ పారిశ్రామిక సముదాయాలు అవసరంలేదు. ఉత్పత్తి సాధనాలు కూడా భారీ పరివర్తన దశకు చేరుకుంటాయి.

అయినా లెనిన్‌కు ఈనాడు ఎంతో ప్రాసంగికత ఉంది. అరాచకవాదులు, నరోద్నిక్‌లు, అల్ట్రాలెఫ్ట్, సంస్కరణవాదులు, ఆర్థిక పొదుపరులు ఇంకా ఎందరితోనో పోరాటం నుంచి మార్క్సిజం రూపుదిద్దుకుంది. లెనిన్ ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం చూపారు, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. పార్టీ కేడర్లు కేవలం పార్టీకి మద్దతివ్వాలనే లెనిన్ కోరుకోలేదు, దాన్ని నిర్మించటంలో సహాయపడాలన్నారు. లెనిన్ ప్రసిద్ధ గ్రంథం 'వాట్ ఈజ్ టు బి డన్' (ఏమి చేయాలి?) ఈ సందర్భంలోనే రచించారు. పెట్టుబడి–శ్రామికుడి మధ్య సామాజిక – ఆర్థిక విభజన మార్క్స్‌కు కూడా ఊహించటానికి కష్టమైన కోణాలు తీసుకుంది.

సోవియట్ రాజ్యం ఆస్తిని దోచుకునేవారిని గుర్తించటానికి 1990వ దశకంలో సృష్టించబడిన 'ఆలిగార్క్' అనే పదం అటు తర్వాత ప్రపంచవ్యాప్త లక్షణమైంది. ప్రపంచంలోని ఐదుగురు కుబేరులు 869 బిలియన్ డాలర్‌ల సంపద కలిగి ఉన్నారు. 2020 తర్వాత, ప్రపంచ జనాభాలో మెజారిటీ మరింతగా పేదలవగా, వారు తమ సంపదను రెట్టింపు చేసుకున్నారు. పెరుగుతున్న వర్గ ఉద్రిక్తతల ఒత్తిడి కింద బూర్జువా ప్రజాస్వామ్యం విచ్ఛిన్నమవుతున్నది. నిరంకుశ పెత్తందారీ, ఫాసిస్టు తరహా పాలన అనేక దేశాల్లో పెరుగుతున్నది.

మూడవ ప్రపంచ యుద్ధానికి సందర్భం ఇప్పటికే పరిపక్వమవుతున్నది. రష్యా సైనికంగా ఓటమి పొందేవరకు, అది అణుయుద్ధమైనా సరే, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం కొనసాగించాలని సామ్రాజ్యవాద శక్తులకు చెందిన ముఖ్య ప్రతినిధులు పట్టుబట్టుతున్నారు. గాజాలో పాలస్తీనియన్‌ల అమానుష హత్యలు ప్రాంతీయ సంఘర్షణగా విస్తరిస్తున్నాయి. అమెరికా, దాని ఐరోపా మిత్రులు ఆ ఘర్షణకు ఆజ్యం పోస్తున్నారు.

లెనిన్ రచన – "సామ్రాజ్యవాదం : పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ" నేటికీ ఎంతో ప్రాసంగికత కలిగిన రచనల్లో ఒకటి. సామ్రాజ్యవాదం కేవలం ఒక నిర్దిష్టమైన బూర్జువావర్గ విధానం కాదని, పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశకు ప్రాతినిధ్యం వహిస్తుందని లెనిన్ నిరూపించారు. ఆ దశలో ఆ వ్యవస్థ కుళ్లిపోతుంది, పరాన్నభుక్కుగా తయారవుతుంది, అభివృద్ధి నిరోధకమవుతుంది. ఆ దశలో స్వేచ్ఛాయుతమైన పోటీ స్థానంలోకి గుత్తపెట్టుబడి సంస్థలు ప్రవేశిస్తాయి; పారిశ్రామిక పెట్టుబడిపై ద్రవ్యపెట్టుబడి ఆధిక్యం వహిస్తుంది. ఈ దశలో ప్రపంచం సామ్రాజ్యవాద శక్తుల మధ్య పూర్తిగా విభజించబడుతుంది, బలాబలాలు పునర్విభజన కూడా పొందవచ్చు.

ఈ విశ్లేషణ నుంచి లెనిన్ ఎంతో ముందుచూపుతో, సాహసోపేతమైన నిర్ధారణకు వచ్చారు. యుద్ధాన్ని విప్లవాత్మక అంతర్యుద్ధంగా మార్చాలని ప్రబోధించారు; భూముల స్వాధీనాలు లేకుండా శాంతిని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదం సంస్కరించబడదు, కూలద్రోయవలసిందే అని లెనిన్ నిర్ధారించారు. మరింతగా శాంతియుత విధానం అనుసరించాలని సామ్రాజ్యవాదులకు చేసే నైతిక విజ్ఞప్తులు, ఒత్తిడి భ్రమలు మాత్రమే సృష్టిస్తాయి, ప్రజారాశుల విప్లవ శక్తిసామర్థ్యాలను అణచివేస్తాయి.

ప్రపంచ యుద్ధానికి దారితీసిన అవే వస్తుగత క్రమాలు కార్మిక వర్గ విప్లవంకోసం పరిస్థితులను కూడా సృష్టిస్తుందని లెనిన్ అవగాహన చేసుకున్నారు. యుద్ధం, సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ప్రజలను విప్లవంలోకి నడిపిస్తాయన్న నిర్ధారణ ప్రాతిపదికపై ఆనాడు లెనిన్ ఆ నిర్ధారణకు వచ్చారు.

> వర్గపోరాటం తీవ్రతరం కావటమన్నది ఒక వస్తుగత, అయత్నకృత క్రమం. దాని ఫలితం, విప్లవం విజయం లేక ఓటమి అన్నది చైతన్యయుతమైన కార్మికవర్గ నాయకత్వం ఉండటంపై ఆధారపడి ఉంటుంది. ఈ సమస్యను లెనిన్ అంత చురుకుగా మరెవరూ అవగాహన చేసుకోలేదు; ఒక మార్క్సిస్టుగా ఆయన విలక్షణమైన పాత్ర, ఆయన మేధాశక్తి ఇక్కడే ఉంది. ఆయన తన రాజకీయ జీవితంలో తొలి ముప్పదేళ్లు కార్మికవర్గాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా సాయుధం చేయటానికి వెచ్చించారు. బూర్జువా, పెట్టీబూర్జువా ధోరణులకు వ్యతిరేకంగా అవిరామంగా సాగించిన వాదోపవాదాల్లో ఆయన కార్మికవర్గం సైద్ధాంతిక, రాజకీయ, వ్యవస్థాగత నిర్మాణం కోసం పోరాటం చేశారు.

వర్గపోరాటం తీవ్రతరం కావటమన్నది ఒక వస్తుగత, అయత్నకృత క్రమం. దాని ఫలితం, విప్లవం విజయం లేక ఓటమి అన్నది చైతన్యయుతమైన కార్మికవర్గ నాయకత్వం ఉండటంపై ఆధారపడి ఉంటుంది.

ఈ సమస్యను లెనిన్ అంత చురుకుగా మరెవరూ అవగాహన చేసుకోలేదు; ఒక మార్క్సిస్టుగా ఆయన విలక్షణమైన పాత్ర, ఆయన మేధాశక్తి ఇక్కడే ఉంది. ఆయన తన రాజకీయ జీవితంలో తొలి ముప్పదేళ్లు కార్మికవర్గాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా సాయుధం చేయటానికి వెచ్చించారు. బూర్జువా, పెట్టీబూర్జువా ధోరణులకు వ్యతిరేకంగా అవిరామంగా సాగించిన వాదోపవాదాల్లో ఆయన కార్మికవర్గం సైద్ధాంతిక, రాజకీయ, వ్యవస్థాగత నిర్మాణం కోసం పోరాటం చేశారు.

నరోద్నిక్‌లకు వ్యతిరేకంగా తన తొలి రచనల్లోనే లెనిన్, శాస్త్రీయ భౌతికవాదం రక్షణను వక్కాణించారు. సోషలిస్టు ఉద్యమంలో అవకాశవాదంపై పట్టుదలతో, నిలకడగా ఆయన పోరాడారు. అవకాశవాదం కేవలం తప్పు విధానం మాత్రమే కాదని, కార్మికవర్గ వ్యతిరేక వర్గ శక్తుల ప్రభావం దానిపై ఉంటుందని లెనిన్ అవగాహన చేసుకున్నారు.

ఆ విధంగా, లెనిన్ బోల్షివిక్ పార్టీని నిర్మించారు. అది 1917లో రష్యాలో కార్మికవర్గ విప్లవానికి నాయకత్వం వహించింది. బోల్షివిజం అంటే పార్టీ సభ్యత్వంపై నాయకత్వ అధికారం కాదు; కార్యక్రమ స్పష్టత కోసం అవిశ్రాంత పోరాటం. అది పార్టీకి అపూర్వమైన ప్రభావాన్ని, కార్యాచరణలో ఐక్యతను ఇస్తుంది.

లెనిన్ పరిపూర్ణమైన అంతర్జాతీయవాది. కెరెన్స్కీ ప్రభుత్వాన్ని తొలగించి కార్మిక అధికారం నెలకొల్పటం ద్వారా సంపూర్ణ అధికారాన్ని గెలుచుకోవలసిన అవసరాన్ని ఎట్టకేలకు 1917లో తమ ఏప్రిల్ థీసిస్‌లో లెనిన్ ఆమోదించారు.

అక్టోబర్ విప్లవం విజయం పొందిన తర్వాత, ఒక పక్క సమాజంలో అంతర్యుద్ధం, మరోవైపు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ప్రపంచ సోషలిస్టు ఉద్యమం పునర్నిర్మాణం, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణంపై లెనిన్ తన శక్తిని కేంద్రీకరించారు.

పెట్టుబడిదారీ విధానం క్షీణింపు, ప్రపంచ సోషలిస్టు విప్లవానికి వస్తుగతమైన ముందస్తు పరిస్థితులు లెనిన్ కాలంలో కన్నా ఈనాడు మరెంతగానో పురోగమించాయి. ప్రపంచంలో ఇప్పటికీ ఆర్థిక వెనుకబాటుతనం, వ్యవసాయక జీవనం ఉన్న విస్తారమైన భాగాల్లో కోట్లాదిమంది శ్రామికులున్నారు.

ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ విప్లవపోరాటం సఖ్యత, ఐక్యతతో కూడిన ఉద్యమంగా అభివృద్ధి చెందుతున్నది. సామాజిక సదుపాయాల్లో కోతకు, యుద్ధానికి వ్యతిరేకంగా ఆర్థిక కోర్కెలపై సమ్మెలు, సామూహిక నిరసన కార్యక్రమాల్లో ఇది వ్యక్తమవుతున్నది. గాజాలో మానవ ఊచకోతకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా పదుల లక్షల్లో ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు.

ఇదీ లెనిన్ వారసత్వపు కాలానుగుణ్యత, ప్రాముఖ్యత

కృష్ణ ఝా
'న్యూ ఏజ్' డిప్యూటీ ఎడిటర్

# పచ్చదనమే భవిష్యత్తు

*'ప్రపంచాన్ని ఆరోగ్యంగా మార్చాలని చూస్తున్నారా? చెట్టును నాటి ప్రారంభించండి.'*

*మదర్ థెరెసా.*

వరల్డ్ ఎర్త్ డే ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న వసంతకాలపు ప్రారంభంలో జరుపుకుంటారు. ఇది భూమిని కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసుకునే రోజు. 1970లో అమెరికాలో మొదటి సారిగా పాటించబడింది. అమెరికా సెనేటర్ గెలార్డ్ నెల్సన్ తలపెట్టిన ఉద్యమం ఈరోజు ధరిత్రి దినోత్సవంగా రూపొందించబడింది. 20 మిలియన్ల అమెరికన్ల భాగస్వామ్యం ద్వారా ఇది ప్రారంభమైంది. 1969లో జనవరి 28న కాలిఫోర్నియాలోని శాంటా బార్బరాలో జరిగిన ఆయిల్ స్పిల్ వంటి సంఘటనలు ఈ ఉద్యమానికి ప్రేరణగా ఉన్నాయి. ఈ ప్రమాదంలో 10,000కు పైగా సముద్ర జీవరాశులు మరణించాయి. వాతావరణ మార్పు, జీవవైవిధ్య నష్టం మొదలు తీవ్ర సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల ఆవశ్యకతకు ప్రతిస్పందనగా ఈ ధరిత్రి దినోత్సవం ఉద్భవించింది.




ఈ ధరిత్రి ఉద్యమం 1990లో గ్లోబల్ స్థాయికి విస్తరించింది. 1992లో యుఎన్ ఎర్త్ సమ్మిట్‌కు మార్గం సుగమం చేసింది. 2016లో ప్యారిస్ అగ్రిమెంట్‌పై 175 దేశాల మధ్య అంగీకార ఒప్పందం జరిగింది. ఇది క్లైమేట్ చేంజ్ పై ముఖ్యమైన అంగీకారం. 1992 రియో ఎర్త్ సమ్మిట్ వాతావరణ మార్పు, జీవవైవిధ్యం సమస్యలపై మరియు పర్యావరణం అభివృద్ధిపై విస్తృత చర్చ జరిపింది. 1997 క్యోటో ప్రోటోకాల్ యుఎన్‌ఎఫ్‌సిసి ప్రకారం ప్రతి సంవత్సరం గ్రీన్ హౌస్ ఉద్గారాలను తగ్గించేందుకు అంగీకరించింది. 2002 జోహాన్స్ బర్గ్ ప్రపంచ సదస్సులో పేదరిక నిర్మూలన, నీటి శుద్ధి, పునరుత్పాదక శక్తి వనరులపై దృష్టి సారించింది. 2012 రియో సదస్సు గ్రీన్ ఎకానమీ, బయోడైవర్సిటీ, సస్టైనబుల్ డెవలప్మెంట్ పై దృష్టిపెట్టింది. 2015 పారిస్ వాతావరణ ఒప్పందం సి.ఒ.పి 21 ప్రకారం గ్లోబల్ వార్మింగ్‌ను రెండు డిగ్రీ సెంటీగ్రేడ్ తక్కువకు నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు అమలు చేయాలనే ఒప్పందం పై 175 దేశాలు సంతకం చేశాయి. 2025 ఎర్త్ డే యొక్క గ్లోబల్ థీమ్ 'మన శక్తి మన గ్రహం'. పునరుత్పాదక శక్తికి మారడానికి, స్థిరమైన భవిష్యత్తు నిర్మించడానికి, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత ఈ థీమ్ లక్ష్యం.

భూ గ్రహం కాలుష్యం కారణంగా గ్లోబల్ వార్మింగ్ రోజురోజుకు పెరుగుతున్నది. గ్రీన్ హౌస్ ఉద్గారాలలో 20%ఆహారోత్పత్తి వ్యర్థాల ద్వారానే ఉత్పన్నమవుతుంది. అరణ్యాలు క్షీణిస్తున్నాయి. నీటికొరత, వాయు కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్లాస్టిక్ పెను విపత్తుగా మారింది. పర్యావరణ సమతుల్యత ప్రమాదంలో పడింది. మంచు కొండలు కరిగి హిమనీనదాలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపు 18 మిలియన్ ఎకరాల అడవులు నాశనం అవుతున్నాయి. ఈ విపత్తు ఎదుర్కోవడానికి ఎర్త్ డే ఆర్గనైజేషన్ 2017లో కానోపి ప్రాజెక్టు స్థాపించి లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది. శరవేగంగా జరుగుతున్న పారిశ్రామికీకరణ, అనియంత్రిత సహజ వనరుల వినియోగం, అటవీ నాశనం వంటి మానవ కార్యకలాపాలు భూమి ఎకోసిస్టంకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు మహా సముద్రాలలో 200 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ పేరుకుపోయింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు కేవలం 9% మాత్రమే ప్లాస్టిక్ రీసైకిల్ చేయబడుతుంది. ప్రపంచ సగటు వ్యక్తి కార్బన్ పాదముద్ర సంవత్సరానికి 5 టన్నులు. దీని పెరుగుదలలో వేగం కారణంగా ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదాలు పెరిగే ప్రభావం ఎక్కువ.

ఇండియా ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌లో సభ్యత్వం పొందింది. సోలార్ ఎనర్జీని ప్రోత్సహిస్తుంది. గ్రీన్ ఎనర్జీలో చైనా ముందు వరుసలో ఉంది. అమెరికా పునరుత్పాదక శక్తిలో అధిక పెట్టుబడులు పెడుతున్నది. 2030 నాటికి భారత్ తన శక్తి అవసరాలలో 50%పునరుత్పాదక వనరుల నుండి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఎర్త్ డే ప్రతి ఒక్కరి బాధ్యత. వృక్షాలే భవిష్యత్తుకు ఆధారం. మానవులతో సహా లక్షలాది జాతులకు మంచినీరు, ఆహారం, ఆక్సిజన్ అందించే ఏకైక నివాసయోగ్యమైనది మన భూగ్రహం. రోజువారి జీవన శైలిలో మార్పు రావాలి. శుభ్రమైన గాలి, భద్రమైన నీరు, ఆరోగ్యకర ఆహారం గల భూమి ఉండాలని కోరుకుంటే ఈ వనరులను రక్షించే ప్రయత్నం చేయాలి. ఎర్త్ డే ఒక విధానంగా కావాలి. థింక్ గ్లోబల్ యాక్ట్ లోకల్, ఎవరీ డే ఎర్త్ డే వంటి నినాదాల స్ఫూర్తితో భూ గ్రహ రక్షణకు ఉద్యమిద్దాం. ప్రకృతి అద్భుతాలను, ఆనందాలను రక్షించుకోవడానికి పిలుపునిద్దాం. ప్రకాశవంతమైన, స్థిరమైన, భవిష్యత్తును సృష్టిద్దాం.

వెంకటరమణ గిలకత్తుల
9866878769

# విప్లవాలకు కొత్త చూపునిచ్చే లెనిన్ అధ్యయన పద్ధతి



డివివియస్ వర్మ
దారి దీపం సంపాదకులు
8500678977

ఏప్రిల్ 22 లెనిన్ జయంతి. విప్లవం లెనిన్ అనేవి విడదీయరాని జంట పదాలు. లెనిన్ పేరు స్ఫురణకువస్తే రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవం మన కళ్ల ముందు కదలాడుతుంది.

1917లో రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవానికి లెనిన్ సారథి. విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించి దానిని అధికారం హస్తగతం చేసుకునేందుకు నడిపించాడు. తొలి కార్మిక వర్గ రాజ్యం ఆవిర్భవించింది. సోషలిస్టు సమాజ నిర్మాణానికి రష్యాలో పునాదులు వేశాడు.

ఈ విప్లవ కార్యాచరణ క్రమంలో లెనిన్ సిద్ధాంతపరమైన అనేక సవాళ్లను ఎదుర్కొన్నాడు. అక్కడ "మార్క్సిస్టులమని" చెప్పుకునేవాళ్లు మార్క్స్ భావజాలానికి వక్రీకరణలు చేశారు. వారు మార్క్సిజాన్ని నియతివాదంగా పిడివాదంగా దిగజార్చారు. ఈ పెడ ధోరణులను లెనిన్ తిప్పి కొట్టాడు.

మార్క్సిజాన్ని ఒక సృజనశీల సిద్ధాంతంగా, కార్యాచరణకు కరదీపికగా మార్క్స్ భావజాలంలోని విప్లవ సారాంశాన్ని నిలబెట్టాడు. రష్యా పరిస్థితులకు అన్వయించే క్రమంలో మార్క్సిజానికి అనేక కొత్త చిగురులు తొడిగాడు.కొత్త మెరుగులు దిద్దాడు.

ఎంతటి సిద్ధాంతమైనా అది ఆచరణలో రుజువు కావాలి. ఒక సిద్ధాంతాన్ని ఆచరణలోకి తేవడానికి నిర్దిష్టమైన ఉపకరణాలను పెంపొందించుకోవాలి. సరిగ్గా లెనిన్ అదే పని చేశాడు.

మార్క్స్ కాలంలో కార్మిక వర్గం కూడా చాలా దేశాలలో వివిధ పార్టీలు, సంస్థలలో సంఘటితమైంది. 1848లో, తర్వాత 1871 పారిస్ కమ్యూన్ తిరుగుబాట్లు జరిగాయి. అక్కడ కార్మికవర్గం తాత్కాలిక విజయంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

వివిధ దేశాలలో కార్మికవర్గ పార్టీలను అంతర్జాతీయంగా వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ఏర్పాటు ద్వారా మార్క్స్ వాటికి దిశానిర్దేశం చేసే ప్రయత్నాలు చేశాడు. లెనిన్ ఈ అనుభవాలను, గుణపాఠాలను ఆకళింపు చేసుకున్నాడు.

మార్క్స్ భావజాలాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక విప్లవకర పార్టీ అవసరాన్ని ప్రకటించాడు. కార్మిక వర్గ అగ్రగామి దళంగా ఆ పార్టీకి రూపు దిద్దాడు. ఆర్థిక పోరాటాల స్థాయి నుండి రాజ్యాధికారాన్ని సాధించే విప్లవ పార్టీ నిర్మాణానికి దారులు వేశాడు. అలాంటి అవసరాన్ని అంతర్జాతీయంగా కార్మికోద్యమం గుర్తించేలా చేశాడు.

ఈ ఆవిష్కరణ కోసం ఆయన 'ఏం చెయ్యాలి' అన్న పుస్తకం రాశాడు. విప్లవ సిద్ధాంతాన్ని విప్లవ కార్యాచరణకు నడిపించే కొత్త తరహా పార్టీకి అంకురార్పణ చేశాడు.

మార్క్స్ కాలంలో జరిగిన కార్మిక వర్గ తిరుగుబాట్లను పెట్టుబడిదారీ వర్గం అణిచివేసింది. పారిస్ కమ్యూన్‌లో కార్మికవర్గం అధికారం పొందిన కొద్ది రోజులలోనే దానిని పెట్టుబడిదారీ వర్గాలు కూలదోశాయి. ఈ అనుభవాల నేపథ్యంలో పలు దేశాలలో కార్మిక వర్గం అధికారం చేపట్టకపోతే అవి విజయం పొందలేవన్న నిర్ధారణకు రావడం సహజం. అలాగే అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే విప్లవాలు జరుగుతాయన్న నిర్ధారణ కూడా చారిత్రక పరిణామం నుంచి చేసిన సూత్రీకరణే. మార్క్స్ తన కాలంలో అనేక దేశాలలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న దశను 'పెట్టుబడి' గ్రంథంలో విశ్లేషించారు. అదే సమయంలో ఆసియా తరహా ఉత్పత్తి విధానం ప్రత్యేకతలను గుర్తించాడు. మార్క్స్ రచనల్లో పిడివాదం కనిపించదు; స్థల కాలాల కు అతీతమైన చారిత్రక నియతివాదం వగైరా రూళ్లకర్ర నియమాలు వుండవు.

మార్క్స్ తర్వాత 40 ఏళ్లలో జరిగిన పరిణామాలను లెనిన్ అధ్యయనం చేశాడు. పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశగా సామ్రాజ్యవాదాన్ని గుర్తించాడు. అది పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమ దశగాను, అది శ్రామిక విప్లవాలకు ప్రారంభ దశ గాను ప్రకటించాడు.

'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ' పుస్తకంలో సామ్రాజ్యవాదంలోని అంతర్గత వైరుధ్యాలు, మార్కెట్ల విస్తరణ కోసం జరిగే యుద్ధాలు అనివార్యతను గుర్తించాడు. సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాపిత వ్యవస్థగా రూపొందినప్పటికీ ఆయా దేశాల అభివృద్ధిలో అసమానతల వల్ల వాటి మధ్య అంతర్గత వైరుధ్యాల వల్ల ఈ సామ్రాజ్యవాద దేశాల గొలుసులో బలహీనమైన లింకులు ఉంటాయని వాటిని ఛేదించడం ద్వారా కార్మిక వర్గం ఒక దేశంలో కూడా రాజ్యాధికారాన్ని పొంది నిలబెట్టుకునే అవకాశాలు వుంటాయని సూత్రీకరించాడు. ఆనాటి రష్యా అలాంటి బలహీనమైన లింకుగా నిర్ధారించి అక్కడ విప్లవం సాధ్యమేనని ప్రకటించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చగలిగితే విప్లవాలు విజయవంతం అవుతాయని ప్రకటించాడు.




అలాగే లెనిన్ మరో రచన 'రాజ్యము–విప్లవము' అన్నది ఇది ప్రపంచ యుద్ధ కాలంలో రాసిన రచన. రెండో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో వున్న పార్టీలు రాజ్యం పట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలి అన్న దానిని వివరించడానికి ప్రధానంగా ఉద్దేశించబడింది.

రెండో ఇంటర్నేషనల్‌లో పార్టీలు విప్లవాలు గురించి మాట్లాడుతూనే తీరా ప్రపంచ యుద్ధం వచ్చే సరికి అవి తమ దేశాల పెట్టుబడిదారీ పాలక వర్గాలను సమర్థించడం ప్రారంభించాయి. ఈ రాజ్యాలు చేస్తున్న యుద్ధాలకు కార్మిక వర్గం ఎందుకు సమర్థించకూడదో వివరించడానికి లెనిన్ ఈ పుస్తకాన్ని రాశారు.

మార్క్స్ ఏంగెల్స్ రాజ్యం గురించి చేసిన విశ్లేషణ ఆధారంగా ఈ పుస్తక రచన సాగినా అది యుద్ధ సమయంలో రాజ్యం పట్ల అనుసరించాల్సిన వైఖరిని స్పష్టం చేయడం కోసం రాశాడు. ఒక లెనిన్ పార్టీ తప్ప అన్నీ తమ దేశాల ప్రభుత్వాలకు సమర్థకులుగా నిలబడితే లెనిన్ దానికి విరుద్ధంగా రష్యాలో పాలకవర్గాన్ని కూలదోసే ప్రత్యామ్నాయాన్ని బోధించాడు.

లెనిన్ వ్యూహం ఎత్తుగడలు కూడా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. 'సోషల్ డెమొక్రసీలో రెండు ఎత్తుగడలు' ఎలా విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలో వివరిస్తుంది. అలాగే ఏప్రిల్ థీసిస్‌లో లెనిన్ రూపొందించిన ఎత్తుగడ విప్లవ సాధనకు మార్గం చేసింది. వాస్తవానికి రష్యాలో ఫిబ్రవరి విప్లవం తర్వాత రెండు తరహాల అధికారాలు ఏర్పడ్డాయి. ఒకటి పై స్థాయిలో అధికారం చెలాయిస్తున్న పెట్టుబడిదారీ వర్గం, మరొకటి పట్టణాల స్థాయిలో కింద అధికారాన్ని కార్మికులు, రైతులు, సైనికుల నాయకత్వంలోని సోవియట్లు కలిగివున్నాయి. అప్పటి సోవియట్లలో మెన్షివిక్కులే అత్యధిక ప్రాబల్యం కలిగి వున్నారు. లెనిన్ పార్టీ బోల్షివిక్‌లు మైనారిటీలో వున్నారు. అయినప్పటికీ అన్ని అధికారాలు సోవియట్లకే అన్న నినాదాన్ని లెనిన్ ప్రకటించాడు. ఎందుకంటే ఈ సోవియట్ల రూపాన్ని కార్మికవర్గ రాజ్యానికి ప్రాతిపదికగా గుర్తించాడు. లెనిన్ ఎత్తుగడ ఫలితంగా సోవియట్లు మెన్షివిక్‌లను వదిలి బోల్షివిక్ పక్షాన చేరాయి. అంతిమంగా ఈ ఎత్తుగడే విప్లవాన్ని సాధించి పెట్టింది.

ఇలా సిద్ధాంత రంగంలో, ఆచరణ రంగంలో లెనిన్ ఆనాటి మార్క్సిజానికి కొత్తచూపును ఇచ్చాడు. దాని భావజాల పరిధిని విస్తరింపజేశాడు. ఈ కొత్త చిగురులు వేయడానికి లెనిన్ అధ్యయన పద్ధతి దోహదపడింది. ఈ అధ్యయన పద్ధతి మీద లెనిన్ ఉద్యమ సహచరి, తర్వాత జీవిత భాగస్వామి అయిన కృపస్కయా ఒక ప్రత్యేక వ్యాసం రాసింది. ఆమె పేర్కొన్న రెండు మూడు ముఖ్య అంశాలను ప్రస్తావించుకుందాం.


లెనిన్ తన కార్యాచరణలో జటిలమైన సమస్యలు ఎదురైనప్పుడు ఆయన మార్క్స్‌ను సంప్రదించేవారు అంటే ఆయన రచనల్ని ఒకటికి రెండుసార్లు చదివేవాడు. మార్క్స్ భావజాలాన్ని సృజనాత్మకమైనదిగా ఆచరణకు కరదీపికగా భావించాడు. పిడివాదాన్ని, ఆర్థిక, చారిత్రక నియతివాదాలను ఆమోదించలేదు. ఇతర మార్క్సిస్టులలాగ మార్క్స్ నుంచి స్థల కాలాదులకు సంబంధం లేని ఉటంకింపులతో నిర్ధారణలకు రావడాన్ని నిరసించాడు.

లెనిన్ తనకు ఎదురైన సమస్య కోసం మార్క్స్ అలాంటి సందర్భంలో చేసిన విశ్లేషణను ఎత్తిరాసుకునేవాడు. మార్క్స్ కాలానికి, తన కాలానికి జరిగిన మార్పులను పరిశీలించేవాడు..దేశం కాలం పరిస్థితులకు వున్న వ్యత్యాసాలను వేరు చేసి తనకు ఎదురైన ప్రత్యేకతలకు మార్క్స్ భావజాలాన్ని అన్వయించడానికి పూనుకునేవాడు. అందుకే ఆయన కొత్త ఆవిష్కరణలు చేయగలిగాడు. స్థల కాలాల ప్రత్యేకతలు పరిగణనలో తీసుకోకుండా చేసే విశ్లేషణ అనుకరణగానే మిగిలిపోతుంది. మార్క్స్ రచనలతో నిరంతర సంభాషణ ద్వారా లెనిన్ తన దేశ కాలపరిస్థితులకు దానిని అన్వయించడంతో సరికొత్త నిర్ధారణలకు రాగలిగాడు. మార్క్సిజాన్ని ఆచరణకు సాధనంగా చేసుకుని విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించగలిగాడు.

ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు రష్యా మార్గం, చైనా మార్గం వంటి అనుకరణలతో విప్లవాలను సాధించలేరు. లెనిన్ తరహా లో తమతమ దేశ, కాల పరిస్థితులకు తగిన స్వతంత్ర మార్గాన్ని రూపొందించుకోవాలి.

వారు తమ దేశంలోని ప్రత్యేకతలను, అభివృద్ధి దశను గుర్తిస్తేనే సరిపోదు. ఆ ప్రత్యేకతలకు కొత్త తరహా పరిష్కారాలు అవసరం అవుతాయి. వాటిని ఆవిష్కరించడం నాయకత్వం నిర్వహించాల్సిన ప్రత్యేక విధి. అప్పుడు ప్రజలను సమీకరించే కొత్త లక్ష్యాలు , కొత్త నినాదాలు పుట్టుకొస్తాయి. ప్రజలను ప్రభావితం చేసి విజయాలను సాధించి పెట్టే కొత్త తరహా ఉద్యమాలకు ద్వారాలు తెరుచుకుంటాయి.

దానికి కొత్తగా వచ్చిన మార్పులకు, ప్రత్యేకతలకు మార్క్సిజాన్ని అన్వయించే కళను అవగాహన చేసుకోవాలి. లెనిన్ అధ్యయన పద్ధతి అందరికీ అలాంటి కొత్త చూపు ఇస్తుంది. లెనిన్ జయంతిని అర్థవంతంగా నిర్వహించుకుందాం.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆరోపణల వేళ.. ఆదేశాలివ్వాలా?

**న్యూఢిల్లీ :** రాష్ట్రాల శాసనసభల్లో రెండుసార్లు పాస్ అయిన బిల్లులను ఆమోదించే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్‌కు సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడంపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, బిజెపి నేతలు స్పందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పులతో న్యాయవ్యవస్థ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని వారు వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనిపై సుప్రీంకోర్టు తాజాగా పరోక్షంగా స్పందించింది. ఓ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అంశాన్ని ప్రస్తావించింది. వక్ఫ్ సవరణ చట్టం నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దాంతో ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ న్యాయవాది విష్ణు శంకర్ జైన్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జస్టిస్ బీఆర్ గవాయ్ ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తాము కార్య నిర్వాహక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నామనే ఆరోపణలు ఎదుర్కొంటున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

## తులం బంగారం అక్షరాలా రూ.లక్ష!

**న్యూఢిల్లీ :** బంగారం ధరలు చుక్కలంటుతున్నాయి. పది గ్రాముల పసిడి ధర రికార్డు స్థాయిలో లక్ష రూపాయలను తాకింది. హైదరాబాద్ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర ఒక దశలో లక్షా పది రూపాయలకు చేరింది. తర్వాత స్వల్పంగా తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర ఇవాళ రూ.16,050 మేర పెరిగి రూ.99,800లకు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటికే పది గ్రాముల పసిడి ధర రూ.20, 850 మేర పెరిగింది. అమెరికాచైనా వాణిజ్య యుద్ధ భయాలు సహా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ క్రమంగా తగ్గుతుండడం వంటి పరిణామాలు బంగారం ధరలు పెరగడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అటు వెండి ధరలు కూడా మండిపోతున్నాయి. కేజీ వెండి ధర ఇవాళ రూ.500 మేర పెరిగి రూ.98,500కు చేరింది. స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగియటంతో బంగారం ధర తగ్గే అవకాశం ఉందని భావించినప్పటికీ ఇంటర్నేషనల్ మార్కెట్లో బంగారం ఔన్సు ధర 3402 డాలర్లకు పైగా పలుకుతుండటంతో పుత్తడి రేటు అమాంతం పెరిగింది. గతేడాది ఏప్రిల్‌లో సుమారు రూ.75 వేలు పలికిన బంగారం దాదాపు ఏడాది కాలంలోనే సుమారు రూ.25వేలు పెరుగుదల నమోదు చేసి ఆల్ టైమ్ రికార్డు సృష్టించటం గమనార్హం.

## ఇస్రో ఖాతాలో మరో ఘనత..

### స్పేడెక్స్ రెండో డాకింగ్ ప్రక్రియ సక్సెస్..

**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో మరో కీలక ముందడుగు పడింది. తొలి ప్రయోగంలో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను అనుసంధానం చేసిన శాస్త్రవేత్తలు.. రెండో డాకింగ్ ప్రక్రియను కూడా సక్సెస్‌ఫుల్ గా పూర్తి చేశారు. ఈ విషయాన్ని ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ఉపగ్రహాల రెండవ డాకింగ్ విజయవంతంగా పూర్తయిందని తెలియజేయడానికి సంతోషంగా ఉందని పేర్కొంటూ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఎక్స్‌లో ఇలా ట్వీట్ చేశారు. 'స్పేస్‌బేస్డ్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ మిషన్‌ను పిఎస్ఎల్‌విసి 60 ద్వారా డిసెంబర్ 30, 2024న ప్రయోగించాం. ఈ మిషన్‌లో భాగంగా ఇస్రో శాస్త్రవేత్తలు జనవరి 16, 2025న అంతరిక్షంలో తొలిసారి ఉపగ్రహాలను విజయవంతంగా డాక్ చేసి సృష్టించారు. అనంతరం మార్చి 13, 2025న ఉదయం 9:20 గంటలకు అన్‌డాక్ చేశాం' అని ఎక్స్ పోస్ట్ ద్వారా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మిషన్ కింద రాబోయే రెండు వారాల్లో మరిన్ని ప్రయోగాలు జరగనున్నట్లు వెల్లడించారు. మార్చి 13న, ఇస్రో తన స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా స్పేస్ డీడాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మన దేశం సొంతంగా అంతరిక్ష నౌకలు డాక్ చేయడానికి వీలు కల్పించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. భూమి నుంచి నావిగేషన్ చేయాల్సిన అవసరం లేకుండా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. చంద్రయాన్4, 2035 కల్లా అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం, మానవ సహిత అంతరిక్ష మిషన్లు వంటి భవిష్యత్ ప్రాజెక్టులకు ఈ సాంకేతికత చాలా అవసరం.

## ఏడుగురు హైకోర్టు జడ్జీల బదిలీకి 'సుప్రీం' సిఫారసు

**న్యూఢిల్లీ :** కర్నాటక నుంచి నలుగురు హైకోర్టు జడ్జిలు సహా ఏడుగురిని బదిలీ చేయాలని సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఏప్రిల్ 15వ తేదీ నుంచి 19వరకు నిర్వహించిన సమావేశాలలో ఈ నిర్ణయం తీసుకుంది. హైకోర్టు స్థాయిలో సమ్మిళిత, వైవిధ్యాన్ని పెంపొందించడం,, పరిపాలనా నాణ్యతను బలోపేతం చేయడంలో భాగంగా సుప్రీంకోర్టు కొలీజియం ఈ నిర్ణయం తీసుకున్నది. హైకోర్టుల జడ్జిలను బదిలీ చేయాలని సిఫారసు చేస్తూ కొలీజియం తీర్మానం చేసిందని చెప్పారు. కొలీజియం చేసిన సిఫారసులలో జస్టిస్ హేమంత్ చందన్ గౌడర్‌ను కర్నాటక హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ క్రిష్ణన్ నటరాజన్‌ను కేరళ హైకోర్టుకు, జస్టిస్ నేరనహల్లి శ్రీనివాసన్ సంజయ్ గౌడను గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ క్రిష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేయాలని కోరారు. వీటికి అదనంగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ పెరుగు శ్రీసుధను కర్నాటకకు, కాసోజు సురేందర్ అలియాస్ కె.సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ కుంభజడల మన్మథరావును కర్నాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కూడా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులో పేర్కొన్నది.

# ఎన్నికల సంఘం రాజీపడింది

### వ్యవస్థలో ఏదో లోపం ఉంది అమెరికాలో రాహుల్‌గాంధీ తీవ్ర వ్యాఖ్యలు

**బోస్టన్ / న్యూఢిల్లీ :** భారత ఎన్నికల కమిషన్ 'రాజీపడింది' అని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని ఉటంకిస్తూ ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. తాను గతంలో కూడా ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని, వ్యవస్థలో ఏదో లోపం ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు.



రాహుల్‌గాంధీ శనివారం అమెరికాకు చేరుకుని ఆదివారం బోస్టన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పెద్దల కంటే ఎక్కువ మంది ఓటు వేశారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సాయంత్రం 5:30 గంటలకు ఓటింగ్ సంఖ్యను తమకు ఇవ్వగా, సాయంత్రం 5:30 నుండి 7:30 గంటల మధ్య 65 లక్షల మంది ఓటర్లు ఓటు వేశారని, ఇది భౌతికంగా అసాధ్యమన్నారు. ఒక ఓటరు ఓటు వేయడానికి దాదాపు మూడు నిమిషాలు పడుతుంది, ఈ లెక్కన లెక్కలు చేస్తే, తెల్లవారుజామున 2 గంటల వరకు ఓటర్లు క్యూలో ఉన్నారని అర్థం, కానీ ఇది జరగలేదన్నారు. ఎన్నికల సంఘాన్ని వీడియోగ్రఫీ కోసం అడిగినప్పుడు, అందుకు వారు నిరాకరించడమే కాకుండా చట్టాన్ని కూడా మార్చారని, తద్వారా ఇప్పుడు వీడియోగ్రఫీని అడగడానికి కూడా మాతమకు అనుమతి లేదని చెప్పారు. ఎన్నికల కమిషన్ రాజీపడిందని స్పష్టం అర్థమవుతోంది, వ్యవస్థలో ఏదో తప్పు ఉందనాన్నారు. ఈ విషయాన్ని తాను చాలా సార్లు చెప్పానన్నారు. గత సంవత్సరం నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలలో బిజెపిశి—వసేన—ఎన్‌సిపి సంకీర్ణ మహాయుతి కూటమి కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) మరియు శివసేన (యుబిటి) మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) కూటమిని ఓడించింది. కాగా, ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బిజెపి ఖండించింది. ఆ పార్టీ ఎంపి, జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్రా, ఎన్నికల కమిషన్‌పై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ చర్యపై రాహుల్ గాంధీ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీలు వాస్తవాల ఆధారంగా పనిచేస్తాయని, నేషనల్ హెరాల్డ్ విషయం ఓపెన్ అండ్ క్లోజ్డ్ కేసు కాబట్టి ఇడి కాంగ్రెస్ నేతలను విడిచిపెట్టదన్నారు. సోనియా, రాహుల్‌గాంధీలు జైలుకు వెళ్తారన్నారు.

విదేశీ గడ్డపై భారత సంస్థలను, భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించినందున మాత్రమే కాకుండా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియ, రాహుల్ దేశానికి కోట్లాది రూపాయలు దోచుకున్న దేశద్రోహులను విమమర్శించారు. ఇదిలా ఉండగా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతరులపై ఇడి ఇటీవల న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని వివిధ సెక్షన్ల కింద ఏప్రిల్ 9న దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఎ1, ఎ2 నిందితులుగా పేర్కొన్నారు.

## రోహిత్ వేముల చట్టం' అమలు చేయండి

### తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులకు రాహుల్ గాంధీ లేఖ

**న్యూఢిల్లీ :** విద్యా వ్యవస్థలో కుల వివక్షకు గురికాకుండా చట్టం చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్టీ పాలిత తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ఇలాంటి చట్టాన్ని తీసుకురావాలని ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా రాహుల్ లేఖ రాసిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖులను 'రోహిత్ వేముల చట్టం' అమలు చేయాలని గాంధీ కోరారు. ప్రతి బిడ్డకు సమాన విద్యను అందించడానికి కాంగ్రెస్ పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి గౌరవం, భద్రత, వివక్ష లేకుండా సమాన అవకాశాన్ని పొందకపోతే మన విద్యా వ్యవస్థ అందరికీ న్యాయంగా ఉండదన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాసిన తరువాత తాను హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లేఖ రాశానన్నారు. రోహిత్ వేముల చట్టం అమలు చేయాలని వారిని అభ్యర్థించినట్లు రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు సమాన విద్యను అందించడానికి, కుల వివక్షను తొలగించడానికి కాంగ్రెస్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ఇద్దరు సిఎంలకు రాసిన లేఖలను రాహుల్ షేర్ చేశారు. అంబేద్కర్ కూడా కలు వివక్షను ఎదుర్కొన్నట్లు ఆ లేఖల్లో ఉటంకించారు. రాజ్యాంగ నిర్మాత పాఠశాలలో కూడా వివక్షను ఎదుర్కొన్నారని, అక్కడ ఆయనను ఒక మూలలో ఒంటరిగా కూర్చోబెట్టారని అంబేద్కర్ చెప్పారని ఆయన ఉదహరించారు. 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎదుర్కొన్న తీరు సిగ్గుచేటు అని, భారతదేశంలోని ఏ పిల్లవాడు కూడా దానిని భరించకూడదని మీరు అంగీకరిస్తారని నాకు తెలుసు. నేటికీ, దళిత, ఆదివాసీ, ఓబిసి (ఇతర వెనుకబడిన తరగతులు) వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు మన విద్యా వ్యవస్థలో ఇటువంటి క్రూరమైన వివక్షను ఎదుర్కోవలసి రావడం సిగ్గుచేటు' అని ఆయన తన లేఖలలో పేర్కొన్నారు.

రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి తెలివైన యువకుల హత్య ఆమోదయోగ్యం కాదని, దీనికి దృఢంగా ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రోహిత్ వేముల, లక్షలాది మంది ఇతరులు అనుభవించిన విధంగా భారతదేశంలోని ఏ బిడ్డ కూడా ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా 'రోహిత్ వేముల చట్టం'ను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాని రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. సుఖుకు కూడా ఈ తరహా లేఖనే రాశారు.



## ఢిల్లీలో పిల్లల అక్రమరవాణా 'చెడు నుంచి అధ్వాన్నం దిశగా వెళ్తోంది':సుప్రీం

### సొంతబిడ్డలను తల్లింద్రులే అమ్మివేయడం 'దురదృష్టకరం' అని బెంచ్ ఆవేదన

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా విషయంలో ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు మండిపడింది. పరిస్థితి 'చెడు నుంచి అత్యంత అధ్వాన్న దిశవైపునకు వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది' అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లల అక్రమ రవాణా రాకెట్‌లో కీలక సూత్రధారిని వెంటనే అరెస్ట్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్దివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఢిల్లీ నగరంలోని ద్వారకా ఏరియాలో పలువురు నవజాత శిశువులు అక్రమ రవాణాకు గురైన కేసును సుప్రీంకోర్టు సుమోటో విచారణగా స్వీకరించింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఢిల్లీ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో పరస్పర చర్చ సందర్భంగా ధర్మాసనం పలు విషయాలను గమనించింది. పిల్లల అక్రమ రవాణా పరిస్థితి 'చెడు నుంచి అత్యంత దారుణ దిశ వైపునకు వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది'అని జస్టిస్ పార్థివాలా అన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన తప్పిపోయిన ముగ్గురు పిల్లల జాడ కనుగొని, గ్యాంగ్ లీడర్ పూజను అరెస్ట్ చేసేంకు చర్యలు చేపట్టాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది. భారతదేశంలో అక్రమ రవాణా వివిధ రూపాలలో జరుగుతూ అన్ని రాష్ట్రలలో వ్యాపిస్తున్నద్న విషయాన్ని అత్యున్నన న్యాయస్థానం ఈ సందర్భంగా గమనించింది.అక్రమ రవాణాదారుల వలయంలో తెలియని అంశాలు చిక్కుకుపోవడంతో సమస్య వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని ధర్మాసనం పేర్కొంది. శిశివుల అక్రమ రవాణాలో తల్లిదంద్రుల ప్రమేయం ఉందని ఆరోపించడాన్ని తప్పుపడుతూ 'ఈ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారనేది మీకు ఎప్పటికీ తెలియదా?!. ఒక ఆడశిశువు విషయంలో ఆమె ఎక్కడికి చేరుతుందనేది మీకు తెలుసు' అని జడ్జి అన్నారు. కొందరు పిల్లలను వారి తల్లిదంద్రులే అమ్ముతున్నారని పోలీసులు ధర్మాసనానికి తెలియజేశారు. 'దురదృష్టవశాత్తు శిశువుల తల్లిదండ్రులు తమ సొంతపిల్లలను అమ్మేసినట్లు కనిపిస్తోంది' అని జస్టిస్ పార్థివాలా ఆ విషయాన్ని అంగీకరించారు.ధర్మాసనంఈ కేసు విచారణను 4వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ కేసు విషయంలో తీసుకున్న చర్యల గురించి తెలియజేయాలని ధర్మాసనం పోలీస్ అధికారిని కోరింది. 'తప్పిపోయిన పిల్లలను మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పక కనుగొనాల్సిందే . సూత్రధారిని అరెస్ట్ చేయాల్సిందే' అని ధర్మాసనం హుకుం జారీ చేసింది.ఈ కేసు విచారణకు ఢిల్లీ పోలీసుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ అర్చనా పథక్ దవే ప్రాతినిథ్యం వహించారు. కాగా పిల్లల అక్రమ రవాణాకు సంబంధించి సుప్రీంకోర్టు అంతర్రాష్ట సమస్యకు సంబంధించిన కేసులో ఒక ప్రాముఖ్యత కలిగిన తీర్పును ఏప్రిల్ 15న వెలువరించింది. ఉచిత, తప్పనిసరి విద్యాహక్కు చట్టం2009లోని నిబంధనలకు అనుగుణంగాఅక్రమ రవాణాకు గురైన పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోవాలని, విద్యకు నిరంతర మద్దతు అందించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది.

# ట్రంప్ వలసవిధానానికి పోప్ వ్యతిరేకం


**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ చర్చ్ ప్రధానాధిపతి, వాటికన్ సిటీ సర్వసార్వభౌమాధికార రాజ్యాధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణించారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. 12 సంవత్సరాలు ఆయన పోప్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాగా డోనాల్డ్ ట్రంప్ అనుసరించిన అక్రమ వలస విధానాన్ని బిషప్ ఫ్రాన్సిస్ వ్యతిరేకించారు. అమెరికా—క్యూబా మధ్య దౌత్యసంబంధాలను పునరుద్ధరించేందుకు ఆయన తనవంతు కృషి చేశారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలసలను ఆయన సమర్థించారు. వలసలకుగల మూలకారణాలను ఆయన సమర్థించారు. వలస ప్రజల రక్షణ నాగరిక సమాం ప్రధానవిధి అని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. ట్రంప్ అనుసరించే పలు విధానాలను ఆయన విమర్శించారు.

రోమన్ క్యాథలికేతర క్రైస్తవ సంఘాలతో ఐక్యతను ఆయన ఆశించి క్రైస్తవమతంకోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపు ఇచ్చారు. రోమన్ క్యాథలిక్స్‌లోని వివిధ విభాగాలలో మహిళలను పూర్తిస్థాయి సభ్యులుగా ఆయన నియమించారు. ఎల్‌జిబిటిక్యూ ప్లస్ వర్గంపట్ల సంపూర్ణ సానుభూతిని ఆయన ప్రకటించారు. వారిపట్ల ఎంతో ప్రేమానురాగాలను ఫ్రాన్సిస్ ప్రదర్శించారు. స్వలింగ సంపర్కులను నేరస్థులుగా చూడకూడదని, వారిపట్ల దయ,కరుణ చూపించాలని కోరారు. మరణశిక్షను రద్దుచేయాలని ఫ్రాన్సిస్ కోరారు. ఈ విషయంలో రోమన్ క్యాథలిక్స్ ముందుపీఠిన ఉంటారని అన్నారు. సిరియాలో పుట్టి పెరిగి రోమ్ బిషప్ బాధ్యతలు చేపట్టిన 8వ శతాబ్దంనాటి పోప్ గ్రిగరీ—3 తర్వాత యూరప్ వెలుపల జన్మించి ఎదిగి రోమ్ బిషప్ స్థాయికి చేరుకున్న మొట్టమొదటి గురువు పోప్ ఫ్రాన్సిస్. మానవత్వానికి ఆయన ప్రతినిధిగా నిలిచారు. నిత్యం అందరికీ దైవకృప ఉండాలని ఆశించారు.

ఆదివారం (ఏప్రిల్ 20)వ తేదీన ఈస్టర్ పవిత్ర పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ ప్రజల్లోకి వచ్చారు. వేలాదిమంది ప్రజల మధ్య గడిపి వారికి ఆశీర్వాదాలు తెలియజేశారు. అటు గాజాలో, ఇటు పాలస్తినాలో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారనీ, తక్షణం యుద్ధ నిర్వాహకులు శాంతికి ప్రాధాన్యం ఇచ్చి యుద్ధాన్ని ఆపాలని, గాజాలో ఆకలిగొన్నవారి ఆకలితీర్చాలని 24 గంటల క్రితమే ఆయన బహిరంగ సందేశం ఇచ్చారు. ఆ తర్వాత అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ దంపతులతో అనధికార సమావేశం నిర్వహించి వారితో ముచ్చటించారు.

### కొత్త పోప్ ఎంపిక ప్రక్రియ

పోప్ ఫ్రాన్సిస్ మరణంతో కొత్త పోప్ ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనట్లయింది. క్రీస్తు ప్రథమ శిష్యులలో మొదటివాడైన సెయింట్ పీటర్స్ వారసత్వ పరంపర పీఠంగా పోప్ పదవిని ఈనాటికీ రోమన్ క్యాథలిక్స్ గౌరవిస్తారు.



పోప్ ఫ్రాన్సిస్ తర మరణం తర్వాత ఖనన ప్రక్రియ ఏ విధంగా ఉండాలన్న విషయంపై తగిన ప్రణాళికలను ఇటీవలే ఆమోదించారు. చాలా నిరాడంబరమైన పద్ధతులను తన అంత్యక్రియలకు ఆయన ఎన్నుకున్నారు. గతంలో సంప్రదాయాల మాదిరిగా చాలా ఎత్తైన ప్రదేశంలో తన భౌతిక కాయాన్ని సెయింట్ పీటర్స్ బాసిల్లకాలో ప్రజల సందర్శనార్థం ఉంచేందుకు ఆయన తిరస్కరించారు. మూత లేని కాఫిన్‌లో ఉండగానే ప్రజల సందర్శనకు ఆయన అనుమతి ఇచ్చారు. ఇప్పుడు అధికారికంగా కాలేజ్ ఆఫ్ కార్డినాల్స్ కొత్త పోప్‌ను ఎన్నుకుంటుంది. ఈ కార్డినాల్స్ కాలేజ్‌లో 252 మంది సీనియర్ సభ్యులు ఉన్నారు. వీరంతా కొత్త పోప్‌ను ఎన్నుకుంటారు. వీరందరినీ పోప్ తన జ్ఞానంతోనే ఎంపికచేసి నియామకాలు చేశారు. ఈ 252 మంది కార్డినాల్స్‌లో 138 మంది కార్డినాల్స్‌కు ఓటింగ్ అర్హత ఉంది. మిగిలిన 14 మందికీ ఓటింగ్ అర్హత లేదు. ఎందుకంటే వారంతా 80 ఏళ్ళు వయసు దాటినవారే. ఐతే కొత్త పోప్ ఎంపిక ప్రక్రియలో జరిగే చర్చల్లో వారు కూడా పాల్గొనే అర్హత ఉంది. గతంలో కొత్త పోప్ ఎంపిక ప్రక్రియకు నెలలు, సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు రహస్య పద్ధతిలో ఓటింగ్ జరుగుతుంది. పొగ గొట్టంలోంచి నల్లటి పొగ వస్తే పోప్ ఎంపిక విఫలమైందని అర్థం. పొగ గొట్టంలోంచి తెల్లటి పొగ వస్తే పోప్ ఎంపిక జరిగిందని సంకేతం. ఈ తెల్లటి పొగ రాగానే కొత్త పోప్ నియామకం జరిగిందని అర్థం కనుక పొగ వచ్చిన ఒక గంట వ్యవధిలో బయట ఎదురు చూసే ప్రజలకు సెయింట్ పీటర్స్ బాల్కనీలో నుండి కొత్త పోప్ దర్శనం ఇస్తారు. వారికి అభివాదాలు తెలియజేసి ఆశీర్వాదాలు అందజేస్తారు.

### ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు

రోమన్ క్యాథలిక్ చర్చ్ ప్రధానాధిపతి, రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్ మరణంపట్ల ప్రపంచవ్యాప్తంగా అనేకమంది సంతాపాలు తెలియజేశారు. ఆయన గుణగణాలను, ఆయన మానవతాదృక్పథాన్ని, కరుణ, ఉదారభావాలను, మానవత్వరక్షణకోసం ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను సమర్థిస్తూ యూరప్, ఆసియాలకు చెందిన అనేక దేశాల అధిపతులు, ప్రముఖులు సంతాపాలు తెలియజేశారు.బ్రిటన్ రాజు ఛార్లెస్, బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, ఇతరఇతర యూరప్ నాయకులు పోప్ మరణంపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# దిగ్భ్రాంతపరిచే చైనా హైడ్రోజన్ అగ్ని బాంబు

### రెండు కేజీల బరువు : రెండు సెకన్లలో 1000 డిగ్రీల సెంటీగ్రేడ్స్ మించిన ఉష్ణోగ్రతతో విధ్వంసం



**బీజింగ్ :** అణుపదార్థంతో సంబంధంలేని ఒక శక్తిమంతమైన కొత్త యుద్ధ ఆయుధాన్ని చైనా పరిశోధకులు విజయవంతంగా సిద్ధం చేశారు. హైడ్రోజన్ ఆధారంగా పనిచేసే ఈ కొత్త బాంబు అణుపదార్థంతో చేసింది కాదు. చైనా ప్రభుత్వ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ (సిఎస్ఎస్‌సి) ఈ హైడ్రోజన్ ఆధారిత బాంబును అభివృద్ధి చేసింది. పేల్చిన తర్వాత గాలిలో మిశ్రమమై 1000 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌ను మించినస్థాయిలో ఈ బాంబు ఉష్ణోగ్రతను సృష్టించి సర్వస్వాన్నీ భస్మీపటలం చేస్తుంది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) చాలా సులభంగా ఎక్కడికైనా మోసుకుపోగల ఈ ఆయుధంతో అనుకున్నచోట కీలకమైన మౌలిక సదుపాయాల వ్యవస్థలను సెకన్ల వ్యవధిలో సర్వనాశనం చేయవచ్చు. ఈ బాంబు బరువు కేవలం రెండు కేజీలు మాత్రమే ఉండటంతో పిఎల్ఎ సైనికులు చాలా సులభంగా నడకదారిలో కూడా తీసుకుపోగలుగుతారు.

ఆధునిక యుద్ధతంత్రంలో ఆ హైడ్రోజన ఆధారిత బాంబు యావత్ యుద్ధ రూపాన్నే మార్చేస్తుందని వారు పేర్కొన్నారు. ఆధునిక యుద్ధతంత్రంలో ఇదొక సరికొత్త ముందు అడుగుగా అభివర్ణించారు. ఈ కొత్త ఆయుధ పరీక్ష విజయవంతమైంది. మెగ్నీషియం ఆధారంగా హైడ్రోజన్ స్టోరేజీతో ఈ బాంబు భారీస్థాయిలో అగ్నిగోళాన్ని సృష్టించి సర్వాన్ని భస్మీపటలం చేస్తుంది. పసుపు రంగులో ఉండే సహజసిద్ధమైన నైట్రోజన్ ట్రినిట్రోటోలియన్ (టిఎన్‌టి) పేలుడు పదార్థం కంటే ఈ హైడ్రోజన్ బాంబుకు 15 రెట్లు ఎక్కువగా ఉష్ణోగ్రతను సృష్టించగల సామర్థ్యం ఉంది. ఇది యుద్ధతంత్రంలో ఒక విప్లవాత్మకమైన ఆయుధం. కేవలం రెండు కేజీలు బరువు ఉండే ఈ ఆయుధం యుద్ధంలో మాత్రం బీభత్సం సృష్టిస్తుంది. దీనిని ఉపయోగిస్తే ఇక అణుబాంబును లేదా సంబంధిత అణుపదార్థాలను ఉపయోగించాల్సిన అవసరం లేదు. మెగ్నీషియం హైడ్రైడ్‌పై ఇది ఆధారపడి పనిచేస్తుంది. ఇది హైడ్రోజన్‌ను లోపల భద్రపరుస్తుంది.

ఇంత తీవ్రమైన ఉష్ణోగ్రత కేవలం రెండు సెకన్ల వ్యవధిలో వస్తుంది. సంప్రదాయబద్ధమైన పేలుడు పదార్థాలకంటే చాలా తీవ్రస్థాయిలో స్థిరమైన విధ్వంసాన్ని ఈ బాంబు సృష్టిస్తుంది. ఈ కొత్త ఆయుధం కేవలం చైనా సైనిక పాటవాన్ని చాటిచెప్పడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చైనా ఇంధన ఆధారిత ఆయుధ నైపుణ్యానికి ఒక చిహ్నంగా మారింది. ఈ బాంబు అనూహ్యమైన ఉష్ణోగ్రతను సృష్టించి విధ్వంసం చేస్తుంది. అనుకున్న చోట కావాలనుకున్నచోట విధ్వంసానికి ఈ బాంబు దోహదం చేస్తుంది. జపాన్‌లో రెండో ప్రపంచయుద్ధకాలంలో జరిగిన తదనంతర పరిణామాల తరహాలో కాకుండా అనుకున్న ప్రదేశంలో మాత్రమే భయంకరమైన అగ్నిశక్తితో విధ్వంసం సృష్టించగలదు. ఈ బాంబులో మెగ్నీషియం హైడ్రైడ్ దే కీలక పాత్ర. ఇటీవలికాలం వరకూ మెగ్నీషియం హైడ్రైడ్‌ను చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే ఉత్పత్తి చేసేవారు. ఎందుకంటే ఇది అత్యంత ప్రభావశీలమైనది. ఐనప్పటికీ కూడా చైనా చాలా భారీస్థాయిలో ఈ మెగ్నీషియం హైడ్రైడ్‌ను ఉత్పత్తి చేసేందుకు పెట్టుబడులు సమకూరుస్తోంది. చైనా షాంగ్జీ రాష్ట్రంలో ఒక కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ప్రతి సంవత్సరం 150 టన్నుల మెగ్నీషియం హైడ్రైడ్‌ను ఉత్పత్తి చేయవచ్చు. డేలియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఫిజిక్స్ సరికొత్తగా ''వన్ పాట్ సింథసిస్'' పద్ధతిలో దీనిని అభివృద్ధి చేసింది. ఈ కొత్తపద్ధతివల్ల మెగ్నీషియం హైడ్రైడ్‌ను చాలా సురక్షితంగా ఆయుధాలలో ఉపయోగించడానికి ఉత్పత్తి చేయగలుగుతారు. ఉత్పత్తిదశలో ఎలాంటి పారిశ్రామిక ప్రమాదాలకు తావులేని రీతిలో ఈ ఉత్పత్తి పద్ధతిని అభివృద్ధి చేశారు. ఐతే ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. కానీ చైనా సైనిక అవసరాలకోసం సామూహికంగా ఉత్పత్తి చేయడానికి ఇదెంతో కీలకం. సైనిక ఆధునీకరణ

### క్లీన్ ఎనర్జీ

ఇప్పుడు చైనా మరింత మెగ్నీషియం హైడ్రైడ్‌ను అదనంగా ఉపయోగించుకోవడానికి తీవ్రంగా గాలిస్తున్నది. జలాంతర్గాముల ఇంధన బ్యాటరీలకు, సుధీర్ఘ ప్రయాణంతో శత్రులక్ష్యాలను దెబ్బతీసే డ్రోన్లకు కూడా ఈ పవర్ సోర్స్‌ను ఉపయోగించేందుకు చైనా సిద్ధపడుతున్నది. ఈ విధంగా ఎలాంటి కాలుష్యం, యుద్ధానంతరం అనేక సంవత్సరాలు అణ్వాయుధ ప్రభావం తరహాలో నష్టం కలగకుండా సరికొత్త యుద్ధ తంత్రాన్ని అవసరం మేరకు అమలు చేసేందుకు క్లీన్ ఎనర్జీ పరిష్కారమార్గంగా ఈ బాంబును వెలుగులోకి తెచ్చింది.

చైనా ప్రభుత్వం చాలా విస్తారంగా తన సైన్యాన్ని, సైనిక వ్యవస్థల ఆధునీకరణ చేసేందుకు, ఆయుధ వ్యవస్థల్లో క్లీన్ ఎనర్జీ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకునేందుకు కృషి చేస్తున్న దశలో ఈ మెగ్నీషియం హైడ్రైడ్ ఆధారిత హైడ్రోజన్ బాంబు వెలుగులోకి వచ్చింది. తన యుద్ధనౌకలను కొత్తతరం ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ వ్యవస్థలతో అత్యాధునికంగా తీర్చిదిద్దే పనిలో చైనా నిమగ్నమై ఉంది. టైప్—055 రెన్హై—క్లాస్ క్రూయిజర్లు వంటి అడ్వాన్స్‌డ్ వ్యవస్థలను సమకూర్చుకుంటున్నది. అదేవిధంగా గగనతల యుద్ధంలో కూడా పర్యావరణహితమైన ప్రొపల్షన్ టెక్నాలజీతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేసుకుంటున్నది. 2023లో చైనా ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా మీథేన్ శక్తితో నడిచే రాకెట్లను అంతరిక్షంలోకి ప్రయోగించింది. ఒక స్థిరమైన, శక్తిమంతమైన సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్న సంకల్పాన్ని ఈ ప్రయోగం చాటి చెప్పింది.

ప్రపంచంలో తాజాగా ఏర్పడిన రాజకీయ, భౌగోళిక పరిణామాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా సైనికరంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సరికొత్త ఆయుధాలతో ముందుకు దూసుకువెళుతున్నది. చైనా,తైవాన్ మధ్య ఉద్రిక్తతలు ఇటీవలికాలంలో అదేపనిగా కొనసాగుతున్నాయి. తైవాన్ చుట్టూ చైనా తన యుద్ధ నౌకల వ్యవస్థలను మోహరించింది. విమానవాహక యుద్ధ నౌకల ద్వారా చైనా యుద్ధ విమానాలు తైవాన్ చుట్టూ విన్యాసాలు చేస్తున్నాయి. ఆ దేశానికి బయట నుండి ఎలాంటి సహాయం అందాలన్నాగానీ అదొక సవాలుగా మారింది. ఈ విధంగా ఉద్రిక్తలు పెరగుతున్న తరుణంలో తైవాన్‌కు అమెరికా ద్వారా ఆయుధాల అమ్మకాలు, ఎగుమతులు కూడా పెరుగుతున్నాయి. అమెరికాకు చెందిన ఉన్నతస్థాయి ప్రభుత్వ నిర్వాహకులు ఆ దేశంలో పర్యటనలు చేయడం పెరిగింది. ఈ నెలలోనే తైవాన్ లక్ష్యంగా చైనా సైనిక విన్యాసాలు పెంచింది. ప్రత్యక్ష కాల్పుల విన్యాసాలు కూడా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. తైవాన్ వ్యవహారాల్లో లేదా చైనా దేశ అంతర్గత వ్యవహారాలలో ఎవరు జోక్యం చేసుకున్నాగానీ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చైనా ఒకవైపు హెచ్చరికలు చేస్తున్నది. తైవాన్‌కు సైనిక సహాయం సమకూరుస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా హెచ్చరికలు జారీ చేస్తున్నది. కానీ అమెరికా ఈ హెచ్చరికలను ఖాతరు చేయడంలేదు. తైవాన్ పట్ల అమెరికా తన చిత్తశుద్ధిని, సైనిక సహాయాన్ని పదేపదే ఉద్ఘాటించి చెబుతున్నది. తైవాన్‌కు మద్దతు కొనసాగిస్తామని మొండిగా చెబుతున్నది. తన మిత్రులతో కలిసి సైనిక విన్యాసాలు కూడా చేస్తున్నది.



# జనరల్

STATE & REGIONAL NEWS

## నకిలీ 500 నోట్లు వస్తున్నాయ్ జాగ్రత్త!

### రిజర్వ్ బ్యాంక్ స్పెల్లింగ్‌లో ఒక్క అక్షరమే తేడా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోకి నకిలీ నోట్లు చలామణిలోకి వచ్చాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోం శాఖ సోమవారం అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా రూ.500 నకిలీ నోట్లను పెద్ద సంఖ్యలో దుండగులు చలామణిలోకి తెచ్చారని తెలిపింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేయడం వల్ల నకిలీ నోట్లను గుర్తించడం కష్టంగా మారిందని పేర్కొంది. అయితే, నకిలీ నోట్లపై ఓ చిన్న తేడాను గుర్తించినట్లు వివరించింది.ప్రతీ నోటుపై విధిగా ఉండే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RESERVE BANK OF INDIA) అనే ఆంగ్ల అక్షరాల్లో ''RESERVE'' అనే పదంలో 'E' బదులుగా 'A' ముద్రించారని వెల్లడించింది. ఈ తేడాతో నకిలీ నోట్లను గుర్తించవచ్చని సూచించింది. ఈ సమాచారాన్ని డిఆర్‌ఐ, ఎఫ్‌ఐయూ, సిబిఐ, ఎన్‌ఐఎ, సెబీలకు కూడా అందించారు.. మీ చేతుల్లోకి వచ్చిన రూ.500ల నోటును జాగ్రత్తగా పరిశీలించి చూశాకే అంగీకరించాలని కేంద్ర హోంశాఖ సూచించింది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది.

## ప్రభుత్వ భూమి అన్యాకాంతం



### అధికారుల నిర్లక్ష్య వైఖరి.. బట్టబయలు చేసిన హైడ్రా

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసిన అధికారులను వెంటనే అరెస్ట్ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. వారం రోజుల క్రితం హైడ్రా అధికారులు శేరిలింగంపల్లి మండలం పరిధిలోని హఫీజ్‌పేట్ డివిజన్‌లో గల సర్వే నెంబర్ 79లోని 39.8 ఎకరాల ప్రభుత్వ భూమి కోర్టు పరిధిలో ఉండగా ప్రైవేట్ వ్యక్తులు యథేచ్ఛగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి పెద్ద, పెద్ద షెడ్లను ఏర్పాటు చేసి కిరాయిలకు ఇచ్చి అనుభవిస్తుంటే రెవెన్యూ అధికారులు ఆర్‌డిఓ అధికారులు, ఎంఆర్‌ఓ ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమి నవాబుల కాలం నుండి వస్తున్న ప్రభుత్వ భూమి అన్యాకాంతం అవ్వడానికి వీలు లేదని వేంటనే ప్రభుత్వం ప్రభుత్వ భూమిని కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణతో పాటు శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు చందు యాదవ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు తుపాకుల రాములు, కొండలయ్య, జెట్టి శ్రీనివాస్, బి.నారాయణ, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' ఇంటర్ ఫలితాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల కానున్నాయి. ఇంటర్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇంటర్ ఫలితాలను విడుదల చేయనున్నారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హాజరుకానున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య తెలిపారు. గత నెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించగా, రాష్ట వ్యాప్తంగా దాదాపు 9.5లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాశారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించారు.

## నకిలీ పత్రాలతో చెలామణి అవుతున్న డాక్టర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నకిలీ పత్రాలను సృష్టించి వైద్యవృత్తిలో చెలామణి అవుతున్న వ్యక్తిని తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టిజిఎంసి) విజిలెన్స్ బృందం గుర్తించింది. విశ్వసనీయ సమాచారం మేరకు టిజిఎంసి కమిటీ సభ్యులు డాక్టర్ కడాలి విష్ణు నేతృత్వంలోని విజిలెన్స్ బృందం ఎం.రాము, ఎం.రాకేష్ హైదరాబాద్, మదీనగూడలోని అంకూర హాస్పిటల్‌లో ఆకస్మీక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ హాస్పిటల్ డిఎంఒగా పనిచేస్తున్న కలపల భరత్‌కుమార్ సర్టిఫికెట్లను పరిశీలించగా, అవి నకిలీ పత్రాలుగా గుర్తించారు. కాగా భరత్‌కుమార్‌పైన మార్చి 25న మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఉన్నట్టు టిజిఎంసి బృందం దృష్టికి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి టిజిఎంసి మరింత సమాచారాన్ని సేకరిస్తోంది. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్‌కు సంబంధించి అన్ని సర్టిఫికెట్లను పరిశీలించాలని,టిజిఎంసి వెబ్‌సైట్‌లో డాక్టర్స్ సమాచారాన్ని పరిశీలించిన తర్వాతనే తమ హాస్పిటల్స్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో నియమించుకోవాలని టిజిఎంసి ఛైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ దండేం లాలయ్య కుమార్ సూచించారు.

## హైదరాబాద్ నెక్సస్‌లో రేసింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేసింగ్ ఔత్సాహికులకు నెక్సస్ హైదరాబాద్ మాల్ గుడ్ న్యూస్ చెప్పింది. తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో టర్బోడెరిఫ్ట్ కార్ రేసింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఎంట్రీ ఫీజ్ రూ.499 ఉంటుందని నిర్ధారించారు.మాల్‌లో ప్రత్యేకంగా రేస్ట్రాక్, ప్లేయర్‌రిఫ్ట్ రేసులో పాల్గొనేవారు పోటి పడుతున్నారు. ఈ రేస్ ఆసక్తికరంగా, సరదాగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## ఎసిబికి చిక్కిన డిప్యూటీ ఇంజనీర్.. ఇద్దరు వర్క్స్ ఇన్స్‌పెక్టర్లు



**ప్రజాపక్షం/నాగారం :** లంచం తీసుకుంటూ ఓ మున్సిపల్ అధికారి ఏసిబి అధికారులకు రెడ్ హ్యాండెండ్‌గా పట్టుబడిన ఘటన నాగారం మున్సిపాలిటీలో సోమవారం చోటు చేసుకుంది.నాగారం మున్సిపాలిటీలో డిప్యూటీ ఇంజనీర్‌గా పని చేస్తున్న సుదర్శనం రఘు ఏసిబి అధికారులకు అడ్డంగా దొరికారు.నాగారం మున్సిపాలిటీలో 11 లక్షల సిసి రోడ్డు పనుల బిల్లులను క్లియర్ చేయుటకు 1 లక్ష 30 వేల రూపాయలు డిమాండ్ చేశారు.దీంతో బాధితుడు ఏసిబిని ఆశ్రయించారు.సోమవారం లక్ష రూపాయలు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.డిఇకి సహకరించిన అవుట్ సోర్సింగ్‌లో వర్క్స్ ఇన్స్‌పెక్టర్లు వి.రాకేష్, వి.సురేష్‌లను అదుపులోకి తీసుకుని నాంపల్లి ఏసిబి కోర్టులో హాజరు పర్చి దర్యాప్తు చేస్తున్నారు.

## భూ సమస్యలకు భూ భారతితో పరిష్కారం : భూమి సునీల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధరణి పోర్టల్ ద్వారా ఉత్పన్నమైన అన్ని భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం లభించనుందని, భూ చట్టాల నిపుణులు, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎం.సునీల్ కుమార్ తెలిపారు. లీఫ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భూమి సునీల్ తార్నాకలోని తన కార్యాలయంలో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి ఆర్ ఓఆర్ 2020 చట్టం లోపాల కారణంగా తరతరాలుగా వారస్వతంగా వచ్చిన భూములతో పాటు దున్నుకుంటున్న అసైన్డ్ భూములపై హక్కులను కోల్పోయి లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారని వారందరికీ భూ భారతి ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా జూన్ 2వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించున్నామని వాటిలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని వెల్లడించారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్‌కు

# ఢిల్లీలో ఘన స్వాగతం



**న్యూఢిల్లీ:** అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌తో ప్రధాన మంత్రి నరేంద్రమోదీఢిల్లీలో సోమవారం సాయంత్రం చర్చలు జరిపారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చల పూర్వరంగంలో జె.డి.వాన్స్–మోదీ మధ్య సంభాషణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రెండు దేశాల వ్యూహాత్మక సంబంధాలను మరింతగా విస్తృతం చేసుకోవాలన్న విషయంపైనే ప్రధానంగా మోదీ–వాన్స్ ఇద్దరూ సంభాషణ చేశారని భావిస్తున్నారు. వాషింగ్టన్ అనుసరిస్తున్న వాణిజ్య విధానం పట్ల భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ చర్చలు జరిగాయి. ఫిబ్రవరిలో మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ట్రంప్‌తో చర్చలు జరిపారు. ఈ ఏడాది చివరినాటికి రెండు దేశాల మధ్యా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పూర్తిచేసేదుకు వీలుగా మొదటిదశ సంప్రదింపులు చేస్తామని ఆనాడు మోదీ–ట్రంప్ ప్రకటించారు. ఈనెల 23 నుండి ఈ సంప్రదింపులు మొదలవుతున్నాయి. జె.డి.వాన్స్‌తో సంభాషణల అనంతరం మోదీ ఆయనకు రాత్రి విందు ఇచ్చారు. భారత సంతతికి చెందిన ఆయన సతీమణి, తెలుగు మహిళ ఉషా చిలుకూరి, ఇతర సీనియర్ అమెరికన్ అధికారులు కూడా విందులో పాల్గొన్నారు. మోదీతో జరిగిన చర్చల్లో విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశీ కార్యదర్శి విక్రమ్ మిశ్రా, అమెరికాలో భారత దౌత్యవేత్త వినయ్ మోహన్ క్వత్రా ఈ విందులో పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా నాలుగు రోజులు భారత్ పర్యటనకు వచ్చిన వాన్స్ సోమవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నప్పుడు ఘన స్వాగతం లభించింది. గడచిన 12 సంవత్సరాలలో భారత్‌లో పర్యటిస్తున్న మొదటి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్. 2013లో జో బైడెన్ అమెరికా ఉపాధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌లో పర్యటించాక మళ్ళీ ఆ దేశ ఉపాధ్యక్షుడు పర్యటనకు రావడం మళ్ళీ ఇదే. భారత్‌పై విధించిన పరస్పర సుంకాల వసూలు అమలును 90 రోజులపాటు ట్రంప్ వాయిదా వేశారు. భారత్‌తో పాటు మొత్తం 60 దేశాలకు ఈ వాయిదా సదుపాయం లభించింది. ఐతే అమెరికా నుండి మరింత చమురు, సహజవాయువు కొనుగోలు చేయాలని, తద్వారా అమెరికా వాణిజ్యలోటును కుదించాలని భారత్‌పై ఒత్తిడి చేస్తున్నది. 2023లో 190 బిలియన్ డాలర్లు వస్తు సేవల వాణిజ్యం చేయడం ద్వారా భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా మారింది. 2023 24 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి 4.99 బిలియన్ డాలర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పారించడంతో అమెరికా మూడవ అతిపెద్ద భాగస్వామిగా ఉంది. బుధవారం నుండీ ప్రారంభమయ్యే ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో మార్కెట్ సదుపాయాలు, సుంకాల విషయంతో పాటు పలు అంశాలపై చర్చలు జరుగుతాయి. ఈ నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జె.డి.వాన్స్ కుటుంబం మంగళవారం రెండో రోజున ఆగ్రా సందర్శిస్తారు. అదేరోజు సాయంత్రం జైపూర్ సందర్శిస్తారు.

### అక్టోబరు నాటికి మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

ఈ ఏడాది సెప్టెంబరు–అక్టోబరు చివరాఖరుకు అమెరికాతో మొదటిదశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం సానుకూలంగా పూర్తిచేస్తామని ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న నిర్మలా సీతారామన్ శాన్‌ఫ్రాన్సిస్కోలో సోమవారంనాడు భారతీయ దయాస్పోరాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగంతో వాణిజ్య సంప్రదింపులు ముమ్మరంగా చేస్తున్నట్లు చెప్పారు. ''అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి చర్చలు జరిపే దేశాలలో భారత్ కూడా ఒకటి, ఈ చర్చల్లో పరస్పర సుంకాల విషయంలో ఉత్తమస్థాయిలో ఒప్పందం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. నిర్ణీత ప్రకారం అమెరికా ఆర్థికమంత్రితో సమావేశమవుతాననీ తాను ఉపాధ్యక్షుడు వాన్స్‌తో మాట్లాడాల్సి ఉన్నప్పటికీ ఆయన భారత్ పర్యటనకు వచ్చారనీ, అక్కడ ప్రధాన మంత్రి మోదీ ఆయనతో సంభాషణలు చేస్తారని చెప్పారు. ఈనెల రెండో తేదీన భారత్‌పై భారీస్థాయిలో సుంకాలను ట్రంప్ ప్రకటించారు. ఐతే ఈ పరస్పర సుంకాల వసూలు అమలును 90 రోజులు వాయిదా వేస్తున్నట్లు ఈనెల తొమ్మిదో తేదీన ట్రంప్ ప్రకటించారు. అంటే జులై 9వ తేదీ నుండీ ఈ 26 శాతం సుంకాలు అమలులోకి వస్తాయి. ఈ లోపు అమెరికాతో ఉత్తమస్థాయిలో సుంకాల తగ్గింపు ఒప్పందం చేసుకోవాలని భారత్ ప్రయత్నాలు చేస్తోంది.

## 'హ్యామ్'తో రాష్ట్ర రహదారులకు మహర్దశ

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం /హైదరాబాద్:** పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రహదారులను గుర్తించి 'హ్యామ్' మోడల్‌లో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణం ప్రతిపాదనల పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హ్యామ్ పద్ధతిలో ఫేజ్1లో 5,189 కి.మీ. రహదారులు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిపిన మంత్రి అందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియలో భాగంగా డీటెయిల్ ఎస్టిమేషన్లను సిద్ధం చేయమని కన్సల్‌టెంట్‌ను ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులు త్వరితగతిన చేపట్టాలని (ఎన్‌హెచ్ఎఐ) అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 'జాతీయ రహదారి ప్రణాళిక 2025–26'కు ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన తర్వాత హ్యామ్ రోడ్లపై సమగ్ర సమీక్ష చేసి క్యాబినెట్ ఆమోదం అనంతరం పనులు ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. పాట్ హోల్స్ లేని, సురక్షితమైన రహదారులు, గ్రామీణ, నగర ప్రాంతాల అనుసంధానం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు.

## తెలంగాణను పిట్టల దొర దోచుకున్నాడు

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను పిట్టల దొర అలియాస్ కెసిఆర్ దోచుకున్నాడని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పేరుపైన 8 లక్షల కోట్లు దోచుకుంది సరిపోలేదా తుపాకీ రాముడు(కెటిఆర్).. మళ్ళీ దోచుకుందామని ప్లాన్ తో అధికారంలోకి రావాలని తుపాకీ రాముడు ఆలోచన చేస్తున్నాడని చామల ఎద్దేవా చేశాడు. రజతోత్సవ సన్నాహక సభ టిఆర్‌కు చేస్తున్నారా..? బిఆర్ఎస్‌కి చేస్తునారా ? అని ఆయన కెటిఆర్‌ను సూటీగా ప్రశ్నించారు. దేశాన్ని దోచుకుందామని టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చింది నిజం కాదా? అని అన్నారు. పార్టీ నుంచి తెలంగాణ పదం తొలగించిన మీకు రజతోత్సవ సభ ఎలా నిర్వహిస్తారు? అని అడిగారు. తెలంగాణను దోచుకున్నందుకు కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ పార్టీ బతికే ఉందా అని అన్నారు. హైటెక్స్ సిటీ కట్టిన చంద్రబాబు.. ఆరోగ్య శ్రీతో వైఎస్ రాజశేఖర్ రెడ్డిని..అంటూ కెటిఆర్ గుర్తు చేస్తున్నారు అయితే ఏం ఉద్ధరించారని కెసిఆర్‌ను ప్రజలు గుర్తు పెట్టుకోవాలి అని అన్నారు. పిట్టల దొర కెసిఆర్ రిటైర్ అయిపోయి ఫాం హౌస్‌కి పరిమిత మయ్యిందని గుర్తు చేశారు. సిగ్గు శరం లేకుండా తుపాకీ రాముడు మళ్ళీ అధికారం కలలు కంటున్నాడని పేర్కొన్నారు. లిక్కర్ కవిత, హ్యాపి రావ్, పిట్టల దొర, అగ్గి పెట్ట హరీష్ రావు తప్ప బిఆర్ఎస్‌లో ఎవరున్నారు అని ప్రశ్నించారు. దొంగల్లా దోచుకున్న సొమ్ముతో రజతోత్సవ సభలు చేస్తున్నారని తెలిపారు. పార్టీలో టిఆర్ఎస్ లేనిది రజతోత్సవ సభలు ఎందుకు అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు పంచే పైసలను తీసుకోండి.. ఆ సొమ్ము తెలంగాణ ప్రజల నుంచి దోచుకుందే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి చూశాక విమర్శలు చేయడానికి తుపాకీ రాముడుకి సిగ్గుండాలన్నారు. దేశం ఆశ్చర్యపోయేలా సన్న బియ్యం పంపిణీ, కెజి టు పిజి విద్య, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ విద్యా సౌకర్యం తమ ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. లక్షన్నర కోట్లలోనే మూసి ప్రక్షాళన, ఫోర్త్ సిటి నిర్మిస్తామన్నారు. బిఆర్ఎస్ హయాంలో లక్షన్నర కోట్లు పెట్టిన కాళేశ్వరం కుప్ప కూలిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రవేశ పెట్టిన ప్రాజెక్టులను బిఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు.

## బడుగు బలహీన వర్గాల

# 'భూ సమస్యలు పరిష్కరిస్తాం'

### రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** బడుగు బలహీన వర్గ ప్రజల భూ సమస్యలు పరిష్కరించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శాస్త్రాగార్డెన్‌లో జరిగిన భూ భారతి చట్టం 2025పై జరిగిన అవగాహన సదస్సుకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణిలో జరిగిన అక్రమాలకు పేద ప్రజలందరు ఇబ్బందులకు గురయ్యారని వాపోయారు. పేద ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వం 2025 భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకువచ్చి ప్రజలకు చుట్టంలాగ శ్రీకారం చుట్టిందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 9లక్షల పై చిలుకు సాదభైనామా దరఖాస్తులు ఆన్‌లైన్లో ఉన్నాయని వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారాం కోసం త్వరలో 6వేల మంది సర్వేర్లు, విఆర్ఓ, విఆర్ఎలను నియమించి శాశ్వతంగా పరిష్కారం చేయనున్నట్లు పేర్కోన్నారు. అనంతరం స్థానిక ఎంఎల్ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగు భూ భారతి చట్టం అవగాహన సదస్సులలో ప్రజలందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా రాష్ట్ర మంత్రిని బొకేతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ ఎం కొదాండరెడ్డి, జిల్లా కల్లెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్, జాయింట్ కలెక్టర్ రవీంద్ర, ఆర్అండ్ బి ఛైర్మన్ ఎం రాంరెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, చల్లా నర్సింహ్మా రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, రెవిన్యూ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గోన్నారు.

## మే 20న జాతీయ సార్వత్రిక సమ్మె

### కేంద్ర కార్మిక సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో అధికార ఎన్‌డిఎ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా పనిచేస్తూ కోట్లాది మంది కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు అగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఎఐయుటిసి జాతీయ నాయకులు వి.ఎస్.బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, సిఐటియు కోశాధికారి ఎం. సాయిబాబా, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.ఎస్.బోస్ మాట్లాడుతూ అధికారంలోని పాలకులు కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారి వారికి ఊడిగం చేస్తూ కార్మికులు అవిశ్రాంత పోరాటాల ద్వారా తమ రక్తాన్ని ఛిందించి సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 4 లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బాల్‌రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులతో పాటు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సాయిబాబా మాట్లాడుతూ కేంద్రం తీసుకువస్తున్న లేబర్ కోడ్లను అమలు చేస్తే కార్మికులకు ఇక ఊరి తాళ్లే నని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, బిడిఎల్ అధ్యక్షులు పి.మురళి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జి.సాంబశివరావులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌కు ఊరట

### రెండు కేసులను కొట్టేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్‌కు సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. రెండు వేర్వేరు కేసులను కొట్టివేసింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ కె.లక్ష్మ ణ్ వేర్వేరు తీర్పులు వెలువరించారు. మేడగడ్డ సందర్శన వివాదంపై మహదేవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో, సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేశారంటూ ఆదిలాబాద్ ఉట్నూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులను కొట్టివేశారు. ఆ కేసులను కొనసాగిస్తే న్యాయప్రక్రియను దుర్వినియోగం చేయడమేనన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లినప్పుడు డ్రోన్ ఎగురవేశారని 2024 జులై 29న మహదేవపూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటిఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్కసుమన్‌లపై కూడా డ్రోన్ ఎగురవేత కేసు నమోదు అయ్యింది. వీటిని కొట్టేయాలంటూ వాళ్లు వేసిన పిటిషన్లను అనుమతిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దర్యాప్తు అధికారి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయలేదన్నారు. అదనపు ఆరోపణ చేస్తూ మెమోను దాఖలు అన్యాయమన్నారు. సాక్షులందరూ ఒకే రకమైన వాంగ్మూలం ఇచ్చారన్నారు. ఏర్‌క్రాఫ్ట్ చట్టం కింద మేడిగడ్డను నిషేధిత ప్రాంతంగా కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయకపోయినా ఆ చట్టం కింద కేసు నమోదు చెల్లదన్నారు. ఏర్‌క్రాఫ్ట్ చట్టంలోని సెక్షన్ 10ఎ ఉల్లంఘనకు సంబంధించి జరిమానా విధించాల్సి ఉందని, జరిమానా విధించే పరిధి కేంద్రానిదని చెప్పారు. కెటిఆర్ పర్యటించిన మూడు రోజులుకు ఇరిగేషన్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారని తప్పపట్టారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేశారని కెటిఆర్‌పై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీసులు పెట్టిన మరో ఎఫ్ఐఆర్‌ను కూడా న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మ ణ్ కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. మూసీ ప్రాజెక్టు పేరుతో రూ.25 వేల కోట్ల నిధులను కాంగ్రెస్ పార్టీకి చేరాయంటూ బంజారాహిల్స్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోను, కిషన్‌బాగ్‌లోనూ కేటీఆర్ ఆరోపణలు చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట దెబ్బతిందంటూ ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు.

## పని చేస్తేనే గుర్తింపు



### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తేనే మంచి గుర్తింపు వస్తుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టిఎఫ్, టిడిఫ్, ఎక్సైజ్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50 మంది సిబ్బందికి సోమవారం క్యాష్ రివార్డులను కమలాసన్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా కేసుల డిటెక్షన్, నిందితులను రికవరీ చేసిన సొమ్మును డిస్పోజల్ చేయడం, నిందితులకు కన్వీక్షన్ పడే విధంగా చార్జీ షీటులు దాఖలు చేయడం, మంచి కేసులను పట్టుకోవడం, ఇతర రాష్ట్రాల్లో కేసుల్లో ఉన్న నిందితులను పట్టుకోవడం చేసినపుడే ప్రతి ఒక్కరికి మంచి పేరు వస్తుందని అన్నారు. ఎక్సైజ్‌శాఖలో ప్రతిభ కనబరిచిన వారికి చేయూత అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వంతో పలుమార్లు మాట్లాడి క్యాష్ రివార్డులకు కావాల్సిన నిధులను తీసుకవచ్చామని అన్నారు. మరింతగా శ్రమించి మంచి కేసులను పట్టుకోవాలని కమలాసన్‌రెడ్డి సూచించారు. సంగారెడ్డిలో వరుసగా నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టడం, సంగీతా సాహు లాంటి గంజాయి డాన్‌తోపాటు ఒరిస్సా నిందితలను పట్టుకొని అరెస్టు చేయడం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌టిఎఫ్ టీం లీడర్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తులశ్రీనివాసరావు, తిరుపతియాదవ్‌లు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్‌లో జన్మించిన చిన్నారికి జీవితకాలం ఉచిత బస్‌పాస్

### కాన్పు చేసిన ఆశా కార్యకర్తకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బస్సులో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి కాన్పుకు సాయం చేసి మానవత్వం చాటుకున్న హైదరాబాద్–2 డిపోనకు చెందిన కండక్టర్ రాజ్ కుమార్, ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ వేణుగోపాల్, ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మను టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్‌లో సోమవారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండి వి.సి.సజ్జనార్ వారిని ఘనంగా సన్మానించారు. ఆర్‌టిసి బస్సులో జన్మించిన చిన్నారికి జీవిత కాలం పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. బస్‌లో కాన్పు చేసిన ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్ పాస్‌ను జారీ చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్– కొల్లాపూర్ రూట్ ఎక్స్ ప్రెస్ బస్సులో సువర్ణ అనే గర్భిణి నాగర్ కర్నూల్‌లో వైద్య పరీక్షలు ముగించుకుని ఈ నెల 15న సొంతూరికి తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యంలో పెద్ద కొత్తపల్లి మం డలం అదిరాల గ్రామ సమీపంలోకి బస్సు రాగానే ఆమెకు ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. ఆ సమయంలో గర్భిణి వెంట ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మ ఉన్నారు. ఈ విషయాన్ని ఆశా కార్యకర్త గుర్తించి కండక్టర్, ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ రాజ్ కుమార్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే అప్రమత్తమై బస్సును పక్కకు ఆపారు. ప్రయాణికులకు అందరినీ కిందకు దింపారు. ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మ ఆమెకు పురుడుపోశారు. ఆడ బిడ్డకు సువర్ణ జన్మనిచ్చారు. 108 అంబులెన్స్ సాయంతో తల్లీబిడ్డను వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## జిమ్ సెంటర్లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/చర్లపల్లి: కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జిమ్ సెంటర్లపై పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని జిమ్‌లపై స్టెరాయిడ్స్, డ్రగ్స్‌ల వాడకం గూర్చి అడిషనల్ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, ఎసిపి మహేష్, సిఐ భాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. యువతకు మాదక ద్రవ్యాల వినియోగం, వాటివల్ల దుష్ప్రభావాల గూర్చి వివరించారు. ఎటువంటి స్టెరాయిడ్స్, డ్రగ్స్ తీసుకోవద్దని వీటివల్ల యువత, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : పిఎసిఎస్ చైర్మన్



ప్రజాపక్షం/దోమ: పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని శివరెడ్డి పల్లి, బొంపల్లి ఖమ్మం నాచారం , మోత్కర్ చకొండయ్యపల్లి, గ్రామల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అదేశాల మేరకు రైతులు మండల పార్టీ అధ్యక్షునితో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగో లు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘువేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శాంతకుమార్, మొగులయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## మల్లారెడ్డిలో క్యాన్సర్ రోగికి అరుదైన చికిత్స

### విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రీతిరెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/దుండిగల్ : ప్రైమరీ పెరిటోనియల్ ఎవింగ్స్ మార్కమాను అనే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 24 సంవత్సరాల గౌతమ్ కుమార్ అనే రోగికి హైపెక్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో మాల్లారెడ్డి నారాయణ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స విజవంతంగా పూర్తి చేశారు. సోమవారం మాల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ఆడిటోరియంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రి వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోగికి రెండులైన్ల కీమోథెరఫీ చికిత్స అనంతరం ప్రైమరీ పేరిటోనియల్ ఎవింగ్స్ సార్కోమాను అనే వ్యాధితో వాదపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇది చాలా అరుదైన ప్రాణాంతక వ్యాధి అన్నారు, సర్జికల్ అంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ హరీష్, బృందం 16 గంటలు చికిత్స చేసి విజయవంతంగా పూర్తి చేసారన్నారు. మాల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ అధునాతన క్యాన్సర్ కేంద్రాల్లో ఒకటి అయినందుకు గర్విస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.నరేంద్ర ప్రకాష్, వైద్య బృందం పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 106 ఫిర్యాదులు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ప్రజావాణిలో వచ్చే అర్జీలను ప్రాధాన్యతా పరంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తమ స్థాయిలో పరిష్కరించలేని వాటి గురించి ధరఖాస్తు దారులతో పాటు సవివరంగా ఉన్నతాధికారులకు తెలియపరుస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఒకసారి వచ్చిన ధరఖాస్తులు మరోసారి రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని డిఆర్‌ఓ హరి ప్రియ ఇతర జిల్లా అధికారులతో కల్సి ప్రజావాణిలో వచ్చిన 106 అర్జీలను స్వీకరించారు. కింది స్థాయిలో పరిష్కారం కాకపోతేనే సుదూర ప్రాంతాల నుండి గంపెడాశతో ప్రజావాణిలో పాల్గొనే జిల్లా ఉన్నతాధికారుల ద్వారా పరిష్కృతమవుతాయని దూరప్రాంతాల నుండి వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం కనపరచకుండా తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



## ధాన్యానికి బోనస్ ఇస్తున్న ప్రజాప్రభుత్వం

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి

ప్రజాపక్షం/కొడంగల్ : రైతే రాజు అని నమ్మిన ప్రజాప్రభుత్వం ఎక్కడా లేని విధంగా వరిధాన్యం కొనుగోలులో బోనస్ ఇస్తున్న రాష్ట్ర సిఎంగా రేవంత్‌రెడ్డి ప్రత్యేకత చాటుకున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం బోంరాస్‌పేట మండల పరిధిలోని కోత్తూర్, వడిచర్ల, తుంకిమెట్ల, బాపల్లి, ఏర్పుమళ్ల, బోంరాస్‌పేట, రేగడిమైలారం, గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరను, బోనస్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్య విక్రయంలో తేమను, తాళును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ధాన్యాన్ని అమ్మాలని అన్నారు. తూనికలలో తేమలను గుర్తించడంలో రైతులను మోసం చేయరాదని కొనుగోలు దారులను హెచ్చరించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి 2,320, సన్నరకానికి అదనంగా 500 బోనస్, సాధారణ రకానికి 2300మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పట్నం అంబయ్యగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటి డైరెక్టర్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ వెంకట్రాములుగౌడ్, పార్టీ యువ నాయకులు సంతోష్‌నాయక్, చందర్‌నాయక్‌లతో పాటు మండల మహిళా సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


## పిడుగు పాటుకు గేదె మృతి



ప్రజాపక్షం/పరిగి రూరల్ : పరిగి మున్సిపల్ పరిధి లోని ఫైర్ స్టేష న్ వెనకాల పొలంలో సోమవారం సాయంత్రం గాలివాన, పిడుగులతో కురిసిన వర్షానికి గంగనోళ్ళ శ్రీనివాస్ రైతుకు చెందిన ఒక గేదె మృతి చెందింది. సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్టు స్థానికులు కుటుంబసభ్యులు తెలిపారు. వివరాల ప్రకారం బంధన్ బ్యాంకులో 15 రోజుల కిందట లక్ష రూపాయల రుణం తీసుకొని గేదెనుకొని పాలు అమ్మి జీవనం కొనసాగిస్తుండేవాడు. ఒక్కసారిగా గేదె మృతి చెందడంతో నష్టం వాటిల్లినట్లు బోరున విలపించారు. ప్రభుత్వం గంగనోళ్ళ శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని అక్కడున్న స్థానికులు కోరారు.

# తూతూ మంత్రంగా అర్జీల స్వీకరణ

***పరిష్కారం కావటం లేదంటూ వాపోతున్న బాధితులు * వసూళ్ల కోసం ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు**



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ప్రతి సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు కింది స్థాయిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి తూతూ మంత్రంగా కొనసాగుతోంది. ప్రజావాణిలో ఇచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని, ఫిర్యాదస్తులకు పరిష్కరించిన వివరాలను తెలియ చేయటంతోపాటు తమ స్థాయిలో పరిష్కారం కాని పక్షంలో దానికి కారణాలను సైతం తెలియ చేయాలంటూ ప్రతి వారం కలెక్టరేట్ ప్రజావాణిలో తమతో పాటు కూర్చొంటున్న జిల్లా స్థాయి ప్రభుత్వ శాఖాధికారులను కలెక్టర్, అదనపు కలెక్టర్లు జారీ చేస్తున్న ఆదేశాలు ఏ ఒక్కరూ పాటించటం లేదని తెలుస్తోంది. దీంతోపాటు ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులన్నింటిని ఆన్‌లైన్ పోర్టల్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్న కలెక్టర్ ఆదేశాలు ఎంతవరకు అమలవుతున్నాయో అనుమానమే. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ప్రభుత్వ శాఖాధికారుల సమక్షంలో నిర్వహించే ప్రజావాణి పరిస్థితే ఈ విధంగా ఉంటోందంటే కింది స్థాయిలోని మున్సిపల్, మండల స్థాయిలో ఏ మేరకు సమస్యల పరిష్కరిస్తున్నారన్న విషయం అనుమానాలు కలిగిస్తోంది. కిందిస్థాయిలో తమ ఫిర్యాదులకు పరిష్కారానికి నోచుకోలేని ఫిర్యాదస్తులు కలెక్టర్ కార్యాలయంలోనైనా ఓ కొలిక్కి వస్తుందన్న గంపెడాశతో అనేక మంది మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి తరలి వస్తున్నారు. అయినప్పటికి తమ అర్జీలకు ఎలాంటి పరిష్కారం లభించటం లేదని, కనీసం తమకు ఎలాంటి జవాబు సైతం ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి వారం ప్రజావాణిలో వస్తున్న అర్జీల సంఖ్య అయితే పౌర సమాచార శాఖ ద్వారా మీడియాకు తెలియ చేస్తున్నారే తప్ప ఇంత వరకు ఎన్ని ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి, ఎన్నిపెండింగ్ లో ఉన్నాయన్న విషయాన్ని సైతం ఎక్కడా బయటకు పొక్కకుండా చూస్తున్నారు. మీడియా ప్రతినిధులు ఈ విషయమై ప్రశ్నించినా ప్రజావాణి ఫిర్యాదులు ఏ స్థాయిలో పరిష్కారమయ్యాయన్న విషయాలను మాత్రం తెలియచేయటానికి ముందు కు రాకపోవటం గమనార్హం. మొదట్లో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినా రానురాను వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోవటానికి కారణం ఫిర్యాదులను అధికారులు పట్టించుకోక పోవటమే అని తెలుస్తోంది. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి ఎలాగైనా తమ సమస్యను పరిష్కరించుకోవాలని నాలుగైదు సార్లు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా నేటికీ ఫలితం లేదని పలువురు వాపోతున్నారు. మల్లాపూర్‌లోని గోకుల్‌నగర్ సర్వే నంబరు 96, 97లోని తమ స్థలానికి సర్వే చేసి సరిహద్దులు మార్కింగ్ చేయాలంటూ జనవరి మాసంలో ఆరవ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీ సమర్పించినా ఇంతవరకు దానికి అతీగతీ లేకపోదని మల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఎ.సుబ్బారావు వాపోయా డు.

**సమయానికి అధికారులు రారు....**

జిల్లాలోని దూరప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో తమ అర్జీ సమర్పించేందుకు వస్తే సమయానికి అధికారులు ప్రారంభించకుండా నింపాదిగా వస్తున్నారని, ఈ కారణంగా తాము అధికారులకోసం ఎదురు చూపులు చూడాల్సి వస్తోందని సోమవారం ఇక్కడికి వచ్చిన పలువురు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి 11 గంటలు దాటితే కానీ ప్రారంభం కావటం లేదని, కొన్ని సందర్భాల్లో 12సైతం దాటిపోతోందని పలువురు తెలిపా రు.

**వసూళ్ల కోసం ప్రజావాణిలో ఫిర్యాదులు**

ప్రభుత్వ అధికారులతో కల్సి ప్రజల పిర్యాదులు స్వీకరించాల్సిన కొంతమంది ప్రజా ప్రతినిధులు నేరుగానో వారి అనుచరుల ద్వారానో ఫిర్యాదులు ఇప్పించి ఆ తర్వాత వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని జిహెచ్‌ఎంసి సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో భవనాలు అనుమతులు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్నారంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేయటం, ఆ తర్వాత నిర్మాణాలు చేస్తున్న వారినుండి వసూళ్లకు పాల్పడుతున్నారని బహిరంగంగానే పలువురు ఆరోపిస్తున్నారు. ఓ సర్కిల్ కార్యాలయంలో అయితే కార్పొరేటర్ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో స్వయంగా ఫిర్యాదులు చేస్తుండటం గమనార్హం.



## కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములు పరిరక్షించాలి

### సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమా మహేష్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: సర్వే నంబర్ 354లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆయన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గాజులరామారం సర్వే నంబర్ 307, 326, 342, 329లలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాదారులు కబ్జా చేయడం ఆపకపోవడంతో మళ్ళీ ఒకసారి తాజాగా కబ్జాదారులు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. సర్వే నంబర్ 354లో ఉన్న 13 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ రేకుల షీట్లు వేసి కబ్జా చేశారన్నారు. ఈ కబ్జాలపై ఇప్పటికి అనేక కథనాలు వచ్చినప్పటికి రెవెన్యూ అధికారులు వాటిపైన స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే ప్రభుత్వ భూములను కాపాడాలని, లేకపోతే వచ్చే వారం లోపు ఈ ఆంశంపై జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కి సిపిఐ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో ఆర్ఐ కరిముల్లా స్పందిస్తూ వారికి నోటీసులు పంపించామని, అది ప్రభుత్వ భూమిని వారి దగ్గర ఏమైనా కాగితాలు ఉంటే తీసుకురమ్మని చెప్పామని, ఖచ్చితంగా ప్రభుత్వ భూములను కాపాడుతామని సిపిఐ నాయకత్వానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జంబు, ప్రభాకర్, వెంకటేష్, ఆదిత్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చీటింగ్ కేసు నమోదు

### పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ డిమాండ్

ప్రజాపక్షం/తాండూరు: దొంగ ర్యాంకులతో విద్యార్థులను మోసం చేస్తున్న శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తాండూరు విద్యాశాఖాధికారి వెంకటయ్యగౌడ్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీ చైతన్య, నారాయణ కార్పరేట్ కాలేజీలలో వచ్చిన జెఇ మెయిన్ ఎగ్జామ్స్‌లలో వచ్చిన ర్యాంకులను, ఒక విద్యార్థి రెండు కాలేజీల్లో చదివి ర్యాంకు సాధించినట్లు తప్పుడు ప్రకటనలు ఇస్తూ వాటిని తమ బ్రాంచ్‌ల పాఠశాలలు ఎక్కడైతే ఉన్నయో అవే తప్పుడు ర్యాంకులను చూపిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, ఇలాంటి విద్యా సంస్థలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని ఆ వినతిపత్రంలో డిమాండ్ చేశారు. వీటిపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎక్కడో వచ్చిన తప్పుడు ర్యాంకులను చూపిస్తున్న స్థానిక పాఠశాలలో ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. తప్పుడు ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి కోట్లాది రూపాయుల కొల్లగొడుతున్నారని, అట్టి కార్పోరేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల సాధనకు టిఎస్‌యుటిఎఫ్ నిరంతర కృషి

### టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : టిఎస్‌యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు నిరంతరం పనిచేస్తుందని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎం.భ్యాలా సంస్కరణ సభ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒకరం అనే లక్ష్యంతో ఏర్పడిన సంక్షేమ నిధి టిఎస్‌యుటిఎఫ్ ఎఫ్‌డబ్ల్యుఎఫ్ ద్వారా ఇప్పటివరకు సుమారు 38 మంది ఎఫ్‌డబ్ల్యుఎఫ్ సభ్యులు మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఆరు లక్షలు ప్రతి కుటుంబానికి ఇచ్చి వారికి అండగా టిఎస్‌యుటిఎఫ్ సంఘం ఉన్నదన్నారు. ఓట్ ప్రధాన సంపాదకులు పి.మాణిక్ రెడ్డి మాట్లాడుతూ టిఎస్‌యుటిఎఫ్ సంఘం ఎల్లప్పుడు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అందుబాటులో ఉండే సంఘం అని అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి విజయ కుమారి మాట్లాడుతూ ఈ ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కార్యక్రమం చాలామంచి కార్యక్రమం అన్నారు. టిఎస్‌యుటిఎఫ్ ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమిని కుమారి, జిహెచ్‌ఎంలు ప్రభాకర్, వెంకట రాములు, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధన్ రెడ్డి, కోశాధికారి గొడుగు శ్రీనివాస్, కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, సుధాకర్, మండల అధ్యక్షులు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, బాలానగర్ అధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఉపయోగం

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/మోమిన్‌పేట్: వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి తావు నీయకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిదని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టంలో లావాదేవీలు, రిజిస్టేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు చేర్పులు సాదాబైనామాలు వంటి సేవలు సులభతరం అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టు తిరుగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. అసైన్మెంట్, సాదాబైనామాలు, పాసుపుస్తకాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఆర్‌ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. జున్ 2 నుండి నూతన చట్టం భూ భారతి పోర్టల్ ద్వారా భూ సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని సందర్శించి చేపట్టిన మరమ్మతుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి , ఎంపీడిఓ విజయలక్ష్మి , మార్కెట్ కమిటి చైర్మన్ మనోహర్‌రెడ్డి పిఎసిఎం చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గోన్నారు.



వికారాబాద్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ ప్రాంతలనుండి 140 ఫిర్యాదులు స్వీకరించడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదును పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను అదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# సంబరంగా లంకాదహనం

### హాజరైన సీనియర్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు పట్టణంలో వెలసిన భావిగి భద్రేశ్వర స్వామి జాతర మహోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టాలైన రథోత్సవం, లంకాదహనం సంబరంగా ముగిశాయి. సోమవారం తెల్లవారు జామున నిర్వహించిన లంకాదహనం వేడుకలు అట్టహాసంగా జరిగాయి. లంకాదహన వేడుకలు ఆదివారం రాత్రి 11గంటలకు ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారు జామున ప్రధాన ఘట్టం ముగిసింది. దేవాలయ కమిటి చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఈఒ శేఖర్‌గౌడ్‌ల ఆధ్వర్యాన స్వామివారి పల్లకి సేవను, ఊరేగింపును అత్యంత భక్తి శ్రద్దల మధ్యన నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవ తాండూరు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఇట్టి ఉత్సవాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్టిఒఎల్ సిఈఒ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు స్వామివారి కి ఆయన దర్శించుకునిప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనవస్త్ర కట్ట వద్దకు చేరుకొగా నే అక్కడ ఏర్పాటు చేసిన లంకాదహనం వేడుకలను బుయ్యని శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా లంకాదహనం వేడుకలను ప్రారంభించారు. జాతర ఉత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టాలైన రథోత్సవం, లంకాదహనం వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, వీరశైవ సమాజం సభ్యులు, యువదళ్ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గోన్నారు.



## తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన బిఆర్ఎస్ : కెపి వివేకానంద

ప్రజాపక్షం/నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ ఒక్కటే అని శాసనసభ బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ యందమూరి ఎంక్లేవ్ కాలనీలో ఈ నెల 27న వరంగల్‌లో జరిగే పార్టీ సభకు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకోకుండా అడుగడుగునా వివక్షణకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని స్వరాష్ట్ర సాధన ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మిన ఏకైక నాయకుడు కెసిఆర్ అన్నారు. 2001 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన పార్టీ బిఆర్ఎస్ అని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ రాష్ట్రంగా మార్చిన నాయకుడు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అని, ఇంతటి ఘనతను సాధించిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి బలాన్ని చాటాలని సూచించారు. వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభకు తరలివెళ్లేందుకు నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ్ రాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాల్‌రాజ్, కుమార్, ఇబ్రహీం ఖాన్, సాయి, ఇమామ్, ఆంజనేయులు, దుర్గా, ఊర్మిళ, తదితరులు పాల్గొన్నా రు.

**ఛలో వరంగల్ వాల్ పోస్టర్ విడుదల**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు సంబంధించిన ఛలో వరంగల్ వాల్ పోస్టర్‌ని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విడుదల చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున రావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్, నరెందర్ రెడ్డి, ఎల్లాగౌడ్, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/కొందుర్గు:** పోషకాలతో కూడిన ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెక్కలోనిగూడ అంగన్‌వాడి కేంద్రంలో పోషక వారోత్సవాల్లో భాగంగా పోషక అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక పదార్థాలను ప్రదర్శించారు. 7 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రసాన కార్యక్రమాన్ని, 3 సంవత్సరాలు నిండినవారికి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని, 5 సంవత్సరాల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

## లగచర్ల రైతులపై రెండు ఎఫ్ఐఆర్‌లు కొట్టివేత

### ఒకే ఎఫ్ఐఆర్ ఉంచాలన్న హైకోర్టు

**హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణ సందర్భంగా అధికారులపై రైతులు దాడి చేశారనే అభియోగాలపై బొమ్రాస్‌పేట పోలీసులు నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లను హైకోర్టు కొట్టేసింది. తొలుత బొమ్రాస్‌పేట పోలీసులు పెట్టిన ఎఫ్ఐఆర్ (నెం.153) కిందనే కేసు విచారణ చేయాలంది. ఒక ఎఫ్ఐఆర్‌పైనే దర్యాప్తు కొనసాగించాలంది.. మరో రెండు ఎఫ్ఆఐర్‌లు 154, 155 చెల్లవని జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పు చెప్పారు. ఒకే సంఘటనకు సంబంధించి వేర్వేరు కేసులు నమోదు చేయడం సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకమని, అందుకే తొలి ఎఫ్ఐఆర్‌ను మాత్రమే అనుమతిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన రెండు ఎఫ్ఐఆర్‌ల కింద ఎవరివైనా వాంగ్మూలాలను రికార్డు చేసుంటే వాటిని తొలి ఎఫ్ఐఆర్‌లో పరిగణనలోకి తీసుకోవచ్చునని చెప్పారు.

## ఆర్థిక నిర్ణయాలు తీసుకోవద్దు

**హైదరాబాద్ :** ఆర్థిక అభియోగాల నేపథ్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు తీసుకోరాదని హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్టాఫ్ వేతనాలు, రోజువారీ ఖర్చులు చేసుకునేందుకు అనుమతిచ్చింది. హెచ్‌సీఏ మేనేజింగ్ కమిటీ ఆర్థిక అవినీతిపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వేసిన పిటిషన్‌ను జస్టిస్.భాస్కర్‌రెడ్డి సోమవారం విచారించారు. మేనేజింగ్ కమిటీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని, అర్హతలు లేకపోయినా వాస్తవాలను గోప్యంగా ఉంచి ఎన్నికల్లో పోటీ చేసిన కమిటీ అక్రమాలను అడ్డుకోవాలని పిటిషనర్ వాదన. ప్రస్తుతం మేనేజింగ్ కమిటీ ఇటీవల ఎన్నిక అయ్యిందని, గత మేనేజింగ్ కమిటీపై అభియోగాలని హెచ్‌సిఎ వాదన. దీనిపై హైకోర్టు.. మేనేజింగ్ కమిటీపై ఆరోపణలు తీవ్రమైనవి కాబట్టి ఆర్థిక నిర్ణయాలు తీసుకోరాదని ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. విచారణను జూన్ 16కు వాయిదా వేసింది.

## ఓం శ్రీసాయిరామ్ ఫైనాన్స్ నిర్వాహకులపై చర్యలకు డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు బాధిత కుటుంబాల నుంచి అధిక వడ్డీ ఆశ చూపి రూ.200 కోట్లు వసూలు చేసి తిరిగివ్వకుండా బెదిరింపులకు దిగుతున్న ఓం శ్రీసాయి రామ్ ఫైనాన్స్ నిర్వాహకులపై ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రజాగాయకురాలు విమలక్క కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి వారు మాట్లాడారు. పేదల డబ్బులపై ఆశ పెంచుకొన్న నాగర్‌కర్నూల్ జిల్లా ప్రాజెక్టు పరిధి గ్రామాలలోని అగ్రకులాలకు చెందిన ఇట్యాల సాయిబాబా, ధనుంజయ్, బాలేశ్వర్, నాగం బుచ్చిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు అధిక వడ్డీ ఇస్తామని అమాయక బాధితులను నమ్మబలికారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని అమాయక బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బిసి నేతలు సూర్య ప్రకాశ్‌రావు, సూర్యారావు, జర్నలిస్టు రఘు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు

### ప్రభుత్వానికి ఎన్‌సిఎ విజ్ఞప్తి




**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని నేషనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎన్‌సిఎ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.శ్రీనివాసగౌడ్, ప్రధానకార్యదర్శి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాజెక్టులలో పని పూర్తి చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులకు రాకపోవడంతో వారి వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి మన్నె, సంయుక్త కార్యదర్శి రాజేశ్ బోయ, కోశాధికారి శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట:** ఎఐసిసి పిలుపు మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండ మున్సిపాలిటీలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం సోమవారం మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మెరుగు జితేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కస్తూరి నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షన ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ , నాయకులు రామకృష్ణారెడ్డి, యాలాల నరేష్ , లక్ష్మీనారాయణ,ముత్యాలు, పురుషోత్తం ,తాజుద్దీన్, శ్రీరాములు, కిరణ్ ,కస్తూరి సతీష్, షేక్ హాజీ,కుమార్, బాల్‌రెడ్డి ,లక్ష్మి శ్రీ ఎర్రోళ్ల రాజు ,రవికాంత్ ,పాపం రమేష్, రవికాంత్ ,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు

### హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని రెడ్డి కాలనీలో 15 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## డ్రైనేజీ, మంచినీటి సమస్యకు పరిష్కారం

### జలమండలి జిఎంను కోరిన కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హయత్ నగర్ శివారు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని హయత్ నగర్ డివిజన కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి సోమవారం జలమండలి అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ శివారు కాలనీల్లో ఉన్న ప్రజలు డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నారని, మంచి నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసివారి సమస్యలకు పరిష్కారం చేయాలని సూచించారు. ఈ మేరకు జల మండలి మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దశల వారి సమస్యలను పరిష్కారం చేస్తామని తెలిపారు.

## హైదరాబాద్ 'స్థానిక' ఎమ్మెల్సీ పోలింగ్ ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఈ ఎన్నికలో ఓటర్లయిన ఎక్స్‌అఫీషియో సభ్యుల కోసం ఒక పోలింగ్ కేంద్రం, కార్పొరేటర్ల కోసం మరో కేంద్రం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యుల పోలింగ్ కేంద్రం ఒకటో నెంబరు బిల్డింగ్ మెయింటనెన్స్ రూమ్‌లో కార్పొరేటర్ల పోలింగ్ కేంద్రం రెండో నెంబరు, లైబ్రరీ రూమ్‌లో ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్ ఫేస్ టు ఫేస్ హాల్లో ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ఒక్కోటి చొప్పున ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి టీమ్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ విధుల కోసం ఒక్కో టీమ్‌లో నలుగురు అధికారులు చొప్పున మూడు బృందాలను నియమించారు. శుక్రవారం 25వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. ఫస్ట్ ఫ్లోర్‌లోని పన్వర్‌హాల్‌లో ఫలితం వెల్లడయ్యేంత వరకు లెక్కింపు నిర్వహిస్తారు. లెక్కింపు సందర్భంగా మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌లతో కూడిన బృందాన్ని నియమించినట్లు అనురాగ్ జయంతి చెప్పారు.

### రసవత్తరంగా మారిన రాజకీయం..

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నిక రసవత్తరంగా మారింది. ఎన్నికల్లో ఓటర్ల (కార్పొరేటర్లు, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి, ఎంపిలు) బలం ఎంఐఎంకే ఎక్కువగా ఉన్నందున ఆ పార్టీ అభ్యర్థి గెలవడం నల్లేరు మీద నడకేనని విశ్లేషకులు అంచనగా ఉంది. దీనితో మిగతా పార్టీలేవీ కూడా తమ అభ్యర్థిని కూడా బరిలో దింపకుండా ఎన్నిక ఏకగ్రీవమే అవుతుందని అందరూ భావించారు. నామినేషన్ల చివరి రోజున ఊహించని విధంగా బిజెపి కూడా తమ అభ్యర్థిని బరిలో దింపడంతో పోలింగ్ అనివార్యమైంది. జిహెచ్‌ఎంసిలో 25 అసెంబ్లీ నియోజకవర్గాలు, 150 వార్డులున్నప్పటికీ, ఈ స్థానిక' ఎన్నికల్లో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, 81 కార్పొరేటర్ల డివిజన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో పాటు ఈ స్థానికసంస్థలో ఓటేసేందుకు ఎంపిక చేసుకున్న ఎంఎల్‌సిలు, ఎంపిలు సైతం ఉన్నారు. ఈ ఎన్నికకు సంబంధించి ఓటర్లుగా బిజెపి నుంచి తాజాగా ఒక రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఇద్దరు ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు చేరారు. తాజా సమాచారం మేరకు అన్ని పార్టీల కంటే ఎంఐఎంకే ఎక్కువ బలం ఉంది. ఆపార్టీకి చెందిన ఓటర్లు 49 మంది ఉన్నారు. ఇక తర్వాతి స్థానాల్లో బిజెపి, బిఆర్ఎస్‌లు ఉన్నాయి. మారుతున్న రాజకీయ పరిస్థితులతో ఎంఐఎంతో పోరాడి గెలిచేందుకు తాము ఇతర పార్టీల కార్పొరేటర్ల మద్దతు కూడగట్టగలమనే ధీమాలో బిజెపి ఉన్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి కార్పొరేటర్లు, ఎంఎల్‌ఎల ఎన్నికలప్పుడు ఒక పార్టీలో ఉండి ఇప్పుడు వేరే పార్టీలో చేరిన వారు కూడా ఉన్నారు. వారిలో ఎంతమంది ఇప్పుడు తాముంటున్న పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తారో చెప్పలేని పరిస్థితి. దాంతో కాంగ్రెస్ మద్దతిచ్చే ఎంఐఎంకు ఎందరు ఓటు వేస్తారో కూడా చెప్పలేమంటున్నారు. కార్పొరేటర్ ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్‌ను ఇద్దరు కార్పొరేటర్లు మాత్రమే గెలిచినప్పటికీ, వారీ ఎన్నికలో ఓటర్లు కూడా కారు. కార్పొరేటర్లలో బిఆర్ఎస్ నుంచి వచ్చిన కార్పొరేటర్లే కాంగ్రెస్ ఓటర్లుగా ఉన్నారు. ఈ ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటించిన విషయం తెల్సిందే. బిఆర్ఎస్ కార్పొరేటర్లు ఓటింగ్‌లో పాల్గొనకుంటే పరోక్షంగా ఎంఐఎంకే అనుకూలంగా మారే పరిస్థితి నెలకొంది.

**విశ్వసనీయంగా తెలిసిన తాజా సమాచారం మేరకు ఆయా పార్టీల బలాబలాలు..**

| పార్టీ | కార్పొరేటర్లు | ఎంఎల్ఏలు | ఎంఎల్‌సిలు | ఎంపిలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| కాంగ్రెస్ | 7 | 2 | 4 | 1 | 14 |
| బిఆర్ఎస్ | 15 | 5 | 1 | 3 | 24 |
| ఎంఐఎం | 40 | 7 | 1 | 1 | 49 |
| బిజెపి | 19 | 1 | 1 | 4 | 25 |
| **మొత్తం** | **81** | **15** | **7** | **9** | **112** |

## 'ప్రజావాణి' ఫిర్యాదులకు పరిష్కారం

### జిహెచ్ఎంసి కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి అధికారులకు సూచించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలన చేసి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు మళ్లీ మళ్లీ రాకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, ఎస్. పంకజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి రావు, అదనపు చీఫ్ సిటీప్లానర్లు వివిధ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఇంజినీరింగ్ నిత్య నూతనం

### డాక్టర్ రామేశ్వర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజినీరింగ్ సబ్జెక్టు నిత్య నూతనమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు అన్నారు. జిహెచ్‌ఎంసిలో నూతనంగా నియామకమై వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు మొదటి బ్యాచ్‌కు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కాలేజ్‌లోని ఎన్విరాన్ మెంట్ డివిజన్, సెంటర్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమంలో జిహెచ్ ఎంసి గవర్నెన్స్, ఆపరేషనల్ ఫ్రేమ్‌వర్క్, స్ట్రక్చర్, రెగ్యులేషన్స్, మున్సిపల్ బడ్జెటింగ్, ఫైనాన్సియల్ మేనేజిమెంట్, అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్ మెంట్, అర్బన్ ప్లానింగ్ డెవలప్ మెంట్, పర్సనాలిటీ డెవలప్ మెంట్ తదితర అంశాల్లో సీనియర్ అధికారుల ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రావు మాట్లాడుతూ అంతులేని ఈ టెక్నాలజీ వెనుక అపారమైన మేధస్సు కలిగిన ఇంజనీర్లు ఉన్నారన్నారు. సివిల్ ఇంజినీరింగ్ ఒక్కటే కాదని, ఏరో స్పేస్ ఇంజనీరింగ్, మెరైన్, మెకానికల్, మైనింగ్, ప్రొడక్షన్, కంప్యూటర్, ఎలెక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ లాంటి సుమారు 15 రకాల ఇంజినీరింగ్ సబ్జెక్ట్స్‌ల్లో ఏ సబ్జెక్టు చూసినా అంతులేని ప్రగతిని చూస్తున్నామన్నారు. సమావేశంలో సీనియర్ ఫ్యాకల్టీలు కె.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నరేష్, నాగమల్లేశ్వర రావు, బ్యాచ్ 1 చెందిన 30 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 68 ఫిర్యాదులు

### రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డిలతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ఇక కార్యాలయాల చుట్టూ తిరగొద్దు

### భూ భారతి అవగాహన సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** భూ సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం దొరుకుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం భూభారతి చట్టంపై మహేశ్వరంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కొత్త చట్టం భూ భారతి ద్వారా కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సిన అవసరం ఉండబోదన్నారు. ఈ చట్టంపై రైతులందరూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. గతంలో ఆర్ఒఆర్ అప్డేషన్ చేసే అవకాశం లేదని, భూ భారతిలో అప్డేట్ చేసే అవకాశం ఉందని, మొఖా మీద ఉన్న రైతు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే సవరణ చేసే అవకాశం ఉందని వివరించారు. సక్సేషన్, మ్యుటేషన్ కోసం దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో తహసీల్దారు విచారణ చేసి మ్యుటేషన్ చేయాలని, లేకపోతే 31వ రోజు ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ అవుతుందన్నారు. అంతేకాకుండా ఎంజాయ్ మెంట్ సర్వే విషయంలో గతంలో అసైన్మెంట్ భూములు వివాదాలు ఉంటే వాటికి ధరణిలో పరిష్కారం లేదని, ప్రస్తుతం భూ భారతిలో టైటిల్ ఫ్లో చార్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాని ద్వారా మళ్ళీ సవరణ చేసి అసలు హక్కుదారులకు పట్టా ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. భూ భారతి చట్టం ద్వారా 90 శాతం రైతుల భూ సమస్యలను పరిష్కారం ఇక్కడే జరుగుతుందని, కేవలం 10 శాతం మాత్రమే ఆర్డిఓ,కలెక్టర్ స్థాయిలో ఉంటాయని చెప్పారు. మొఖా మీద ఉన్న వారి పేర్లను ఖాతాలో ఎక్కించడం జరుగుతుందని,అన్ సైన్డ్ ఖాతాలు ఉంటే గతంలో ఉన్న పట్టా పాస్ బుక్ ఆధారంగా చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.రైతులు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన చట్టానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి,మహేశ్వరం తహసీల్దార్ సైదులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు,ప్రజా ప్రతినిధులు,అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో కొందుర్గు మండలాన్ని అభివృద్ధి చేస్తా



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కొందుర్గు:** కొందుర్గు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పెద్ది చంద్రశేఖర్, పెద్ది సూర్యనారాయణ, పెద్ది జగదీశ్వర్‌లు తమ తల్లిదండ్రులు పెద్ది లక్ష్మీ నర్సమ్మ, రాంచంద్రయ్యల జ్ఞాపకార్థం వారి స్వంత భూమిని గ్రంథాలయ భవనం నిర్మాణం కోసం ఇవ్వగా, సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి, శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూముల రేట్లు ఎక్కువైన సమయంలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం భూమిని విరాళంగా అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. 1కోటి 20లక్షలతో గ్రంథాలయ భవనాన్ని అన్ని హంగులతో నిర్మాణం చేయడం జరుగుతుందని, గ్రంథాలయానికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, వైస్ చైర్మెన్ డోలి రవీందర్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గుప్త, వేణు గోపాల్ గౌడ్, సుదర్శన్ గౌడ్, సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

## 'సిఆర్' ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### అగస్త్య ఆగ్రో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లంపాటి మురళి, రిటైర్డ్ సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/శేరిలింగంపల్లి :** చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలు అభినందనీయమని అగస్త్య ఆగ్రో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లంపాటి మురళి, రిటైర్డ్ సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వరరావు అన్నారు. చంద్ర రాజేశ్వర రావు(సిఆర్)ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న హోమ్ ఫర్ ఏజ్డ్‌లో మల్లంపాటి సోదరుల ఆర్థిక సహాయంతో ఆశ్రమవాసుల సౌకర్యార్థం సిమెంట్ రోడ్డు నిర్మించారు. సోమవారం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, మల్లంపాటి సోదరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లంపాటి సోదరులు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలలో పాలుపంచుకోవడం సంతృప్తినిచ్చిందని చెప్పారు. భవిష్యత్ కార్యకలాపాలకు తమవంతు సహాయ, సహకారాలు అందజేస్తామని చెప్పారు. చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ తరపున గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డిలు మల్లంపాటి మురళి, మల్లంపాటి వెంకటేశ్వరరావులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ ట్రెజరర్ వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలి క్లినిక్ డైరెక్టర్ డా.కునంనేని రజనీ, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోసబట్ల కల్పన, సభ్యులు వి.లలిత, ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, వృద్ధాశ్రమ కమిటీ మెంబర్స్ ఎన్.రాజేంద్ర రావు, టి.తాన్యా, డాక్టర్ గోపీచంద్, సీనియర్ పాత్రికేయులు ఎబికె ప్రసాద్, మిసిమి మాస పత్రిక ఎడిటర్ వల్లభనేని అశ్విని కుమార్, ఆశ్రమ వాసులు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు బకాయిలివ్వాలి

### వ్య.కా.సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు వెంటనే బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లేడ్‌చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో చౌదరిగూడ కార్మిక సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా 700 రూపాయల కూలీ ఇవ్వాలని, కూలీలు పనిచేస్తున్న ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం, టెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా వి.భీమయ్య, అధ్యక్షుడిగా కె లింగం, ఉపాధ్యక్షులుగా కె రాంచంద్రయ్య, యాదమ్మ, కార్యదర్శిగా ఎం కృష్ణ, సహాయ కార్యదర్శిగా కృష్ణయ్య, సురేష్, కోశాధికారిగా పి బాలు, కార్యవర్గ సభ్యులుగా మరో ఏడు మందిని ఎన్నుకున్నారు. మహాసభలో వి భీమయ్య, జి వెంకటేష్, బాల్‌రాజ్, జంగయ్య, నర్సమ్మ, సునిత, వీరేశం, పాపయ్య పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి : సిపిఐ

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తు సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటమ్మకు వినతి పత్రం అందచేశారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలో ముకునూర్ గ్రామంలో గత ఆరు నెలల నుండి ఉపాధి కూలీలు వేసవిలో ఎండలకు కూలీ పనులు చేస్తున్నా నేటికి బిల్లులు చెల్లించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీలు పనులు చేసే ప్రాంతంలో కనీస సదుపాయాలు కల్పించి,రెండు వందల రోజులు పని కల్పించి,కూలీలకు ఇందిరమ్మ ఇళ్ళు వ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహ్మా,ఎస్ లక్ష్మయ్య,కుమార్,శోభ కూలీలు పాల్గొన్నారు.

ఫోకస్


# యువతరంగం

## స్వయంకృషితో వెలిగిన భాస్కరుడు

హోటల్ క్లీనర్ నుంచి వ్యాపారవేత్తగా ఎదిగిన కర్నాటక హీరో కెఆర్ భాస్కర్ ప్రస్థానం యువతకు ఆదర్శం. జీవితంలో ఎదురయ్యే సమస్యలను స్వయం కృషితో ఎదిరించి, ఎదగవచ్చని నిరూపించిన భాస్కర్ 12 ఏళ్ల వయసులో బెంగళూరులోని ఒక హోటల్‌లో క్లీనర్‌గా కెరీర్ ప్రారంభించాడు. తరువాత అతను నృత్య బోధకుడిగా పనిచేశాడు. కొంతకాలం పాన్ షాప్ నడిపించాడు. పకోడీలు, బోండాలు వంటి చిరుతిళ్లు అమ్మాడు. కానీ, అతని ప్రయత్నాలు ఫలించలేదు. జీవితం స్థిరపడలేదు. అయితే, వ్యాపారవేత్తగా ఎదగాలన్న పట్టుదలను మాత్రం భాస్కర్ ఏనాడూ కోల్పోలేదు. కొత్తకొత్త ప్రయత్నాలు కొనసాగించాడు. చివరికి 23 ఏళ్ల వయసులో తన తల్లి తయారు చేసే సాంప్రదాయ వంటకం 'పురాన్‌ఫొలిన్' (బొబ్బట్లు)ను తయారు చేసి అమ్మడం ప్రారంభించాడు. ఈ తీపి వంటకం రుచి అందరినీ ఆకట్టుకుంది. దీనితో చిన్న ఫుట్‌పాత్ స్టాల్‌తో ప్రారంభమైన భాస్కర్ వ్యాపారం పుంజుకుంది. డిమాండ్ పెరగడంతో, సైకిల్‌పై తిరుగుతూ 'పురాన్‌ఫొలిన్'తోపాటు మరికొన్ని వంటకాలను స్థానిక దుకాణాలను సరఫరా చేయడం మొదలుపెట్టాడు. అంకిత భావంతో పని చేస్తున్న కారణంగా, క్రమంగా ప్రజాదరణ పెరిగింది. ఒక టీవీ చానెల్ నిర్వహించిన వంటకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం అతనికి దక్కింది. అప్పటి వరకూ పేరు లేకుండా, కేవలం తినుబండారాలను పాలిథిన్ కవర్లలో అమ్ముతున్న భాస్కర్‌కు బ్రాండింగ్‌పై దృష్టిపెట్టాలని టీవీకు హాజరైన పలువురుర ప్రముఖులు సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని సలహా ఇచ్చారు. వారి సూచనలను పాటించిన భాస్కర్ తన పేరుమీదే సొంత బ్రాండ్ 'భాస్కర్స్ మానే హోలిగే'ను స్థాపించాడు. ఈ బ్రాండ్ వేగంగా విస్తరించింది, దాదాపు ప్రతి ఎనిమిది నెలలకు ఒక కొత్త స్టోర్‌ను తెరుస్తూ అతను వ్యాపారంలో దూసుకెళ్లాడు. కర్నాటక అంతటా 17 అవుట్‌లెట్‌లు, 10 కంటే ఎక్కువ ఫ్రాంచైజీలను ఏర్పాటు చేశాడు. ఈ వ్యాపారం రూ. 18 కోట్ల వార్షిక అమ్మకాలను సాధించింది, నికర లాభం రూ. 3.6 కోట్లు. తన వ్యాపార పరిధిని మరింత విస్తృతం చేసుకోవాలన్న ఉద్దేశంతో, విట్టల్ శెట్టి, సౌరభ్ చౌదరిలను భాగస్వాములుగా చేర్చుకున్నాడు. మహారాష్ట్రలో 'భాస్కర్స్ పురాన్‌పోలి ఘర్'ను ప్రవేశపెట్టాడు. 2021, జనవరిలో మొదటి అవుట్‌లెట్ థానేలో ప్రారంభమైంది, తరువాత పూణే, కండివాలి, కళ్యాణ్‌లలో బ్రాంచీలు తెరుచుకున్నాయి. భాస్కర్ నెలకొల్పిన సంస్థలు ఎలాంటి ప్రిజర్వేటివ్స్‌ను ఉపయోగించకుండా బొబ్బట్లుసహా 24 రకాల స్వీట్లను తయారు చేస్తున్నాయి. అంతేగాక, 400 కంటే ఎక్కువ స్నాక్స్‌ను అంబాటులోకి తెచ్చాయి. భాస్కర్ కార్య దీక్షకు, అంకిత భావానికి, స్వయం కృషికి అతని ఎదుగుదలే నిదర్శనం. అతని ప్రయాణం యువతకు అనుసరణీయం.






**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## యుజిసి నిబంధనలకు చెల్లుచీటీ!

ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఇచ్చే సమయంలో యుజిసి కొన్ని కఠిన నిర్ణయాలు తూచా తప్పకుండా పాటించాలి. లేకుంటే ఇంకోసారి ఆ విశ్వ విద్యాలయాలకు గుర్తింపు రద్దు చేస్తారు. కానీ ఇలాంటి ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడు ప్రో వైస్ ఛాన్సలర్, ఛాన్సలర్, బోర్డు మెంబర్లు అందరు గతంలో యుజిసి లేదా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత పదవులు నిర్వహించిన వారే. ప్రైవేటు విశ్వవిద్యాలయాల వెబ్సైట్ పరిశీలిస్తే ప్రతి ప్రైవేటు విశ్వవిద్యాలయంలో యుజిసి, ఎఐసిటిఈ, న్యాక్, ఎన్‌బిఎలో డైరెక్టర్లు, సలహాదారులు, పేరెన్నిక కలిగిన విశ్వవిద్యాలయాలలో ఉపకులపతిగా పనిచేసిన వారు ఉంటున్నారు. వీరందరూ రిటైర్ అయిన తరువాత తమ కుటుంబంతో గడుపుతుంటారు తప్ప అక్కడకు వెళ్ళేది కేవలం రెండు నెలలకు ఒకసారేనన్న విమర్శలున్నాయి. వీరంతా మా బలమని ఈ విశ్వవిద్యాలయాలు విర్రవీగు తుంటాయి. వారికైతే ప్రభుత్వ మరియు యూజీసీ వివిధ విభాగాలలో పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి నందిని పందిగా సులభంగా మార్చవచ్చు. కంచె చేను మేస్తే కాపు ఏమి చేయగలరు. పేరున్న కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తున్నారు. వీటికి దాదాపు ఒక్క హైదరాబాద్ నగరంలో సుమారు 25000 నుంచి 30000 మంది దాకా విద్యార్థులు హాజరవుతున్నారు. ఒకవైపు ప్రైవేటు విద్యను, సాంకేతిక విద్యను కట్టడి చేసాము, ప్రభుత్వ విద్య బలోపేతం చేసాము అని చెబుతున్న ప్రభుత్వం ఇప్పుడు ఏమి చేయలేని అచేతన స్థితిలో ఉంది. కొన్ని ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలు విద్యకు సంబంధం లేని బ్రోకర్లను కన్సల్టెన్సీలు ఆశ్రయించి అక్రిడేషన్ పొందుతున్నారు. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో నియామకాలు లేకపోవడం, గవర్నమెంట్ యూనివర్సిటీల్లో కీలక విభాగాలు మూసివేతకు గురికావడం, రీసర్చ్ గ్రాంట్లు లేకపోవడం, అధికారంలో ఉన్న పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు, డొనేషన్ ఇచ్చిన ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కోట్లు గుమ్మరిస్తున్నారు. మేజర్, మైనర్ ప్రాజెక్టులు, సెమినార్ గ్రాంట్లు అన్నీ ఒక వర్గానికే చేరుతున్నాయి. డబ్బు ఇస్తే ఏదైనా సాధ్యపడుతుంది. పరిశోధన అటకెక్కింది, రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్టులు సక్రమంగా నిర్వహించరు. ఉపకులపతుల నియామకాల్లో కాలయాపన, విశ్వవిద్యాలయాలలో చేరే సంఖ్య నామమాత్రంగా ఉంటుంది. ఏమాత్రం వసతులు లేని ఇరుకు గదుల్లో ఉన్న ప్రయివేటు యూనివర్సిటీలలో పట్టుమని పది ఎకరాల స్థలం ఉండదు కానీ వేలల్లో విద్యార్థులు ఉంటున్నారు. జనవరి నుంచి సామాజిక మాధ్యమాల ద్వారా కోట్లు ఖర్చు చేసి ప్రకటనలు ఇచ్చి విద్యార్థుల దగ్గర నుంచి లక్షలు వసూలు చేస్తున్నారు. ఫీజు నియంత్రణ ఉండదు, క్లాస్ నియంత్రణ ఉండదు. డబ్బు కడితే ఎప్పుడు కావాలన్నా, ఏ కోర్సు చేరాలన్నా సీటు దొరుకుతుంది. ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే చాలా మంది అధ్యాపకులు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో సీటు రాక దాదాపు ఐదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రయివేటు యూనివర్సిటీలలో పీహెచ్డీ చేరుతున్నారు. అక్కడ వసతులు ఉండదు, రీసర్చ్ సూపర్వైజర్లు తరచూ మారుతుంటారు, ఎందులో పిహెచ్‌డి చేశారో తెలియదు. సన్ రైజ్, బెస్ట్, జైపూర్ నేషనల్ యూనివర్సిటీ, శ్రీ సాయి, సత్యసాయి, జంబనియా, ట్రైబ్రేవాలా, శ్రీ వెంకటేశ్వర గగ్రోల, శిక్ష ఓ అనుసంధాన్, మగధ, బుందేల్ ఖండ గోండ్వానా, జంబర్వాల్ ఇలా చాలా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఎకరం భూమి ఉండదు కానీ అగ్రికల్చర్ యూనివర్సిటీ నడుపుతున్నారు. ఒక్క చెట్టు ఉండదు కానీ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఏరో స్పేస్ టెక్నాలజీ, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కోర్సులు నడిపిస్తున్నారు. వ్యవస్థలో కుక్క తోక ఆడించాలి కానీ తోక కుక్కను ఆడిస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా అటానమస్ ఇచ్చి అకడమిక్స్ ను నీరుగార్చారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం లేదు కేవలం న్యాక్, ఎన్బీఏ క్రైటీరియా పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు పట్టించుకోకపోతే రాబోయే రెండు మూడు సంవత్సరాలలో శాశ్వతంగా మూసివేసే ప్రమాదముంది. ఇటువంటి అనైతిక పద్ధతులతో మన ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క సమగ్రతను దెబ్బతీస్తాయి. ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి విద్యా నైపుణ్యం ప్రమాణాలు నిలబెట్టడానికి త్వరితగత చర్యలు అత్యవసరం.



## మంచి నిర్ణయం

శర వేగంతో విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ)పై చైనా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ఈ రంగంలో నిష్ణాతులను తయారు చేయాలన్న ఉద్దేశంతో, ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి దేశంలోని అన్ని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఎఐ విద్యను తప్పనిసరి చేసింది. ప్రతి విద్యా సంవత్సరానికి కనీసం ఎనిమిది గంటల బోధన ఉంటుంది, ప్రాథమిక భావనలు, ఆచరణాత్మక ఉపయోగాలు, అధునాతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టడానికి గ్రేడ్ స్థాయిని బట్టి ఈ సబ్జెక్ట్‌ను రూపొందిస్తారు. ఈ చర్య బీజింగ్ యొక్క ప్రపంచ ఎఐ లీడర్‌గా తనను తాను నిలబెట్టుకునే విస్తృత వ్యూహంలో భాగం. 2025లో జాతీయ ఎఐ విద్యా ఏకీకరణ కోసం విధానాలు, లక్ష్యాలను వివరిస్తూ ఒక శ్వేతపత్రాన్ని ప్రచురించాలని యోచిస్తోంది. ఈ చొరవ కాలిఫోర్నియా యొక్క అల్ పాఠ్యాంశ చట్టం, ఇటలీ తరగతి గది అల్ ప్రయోగాలు వంటి ప్రపంచ ప్రయత్నాలకు అనుగుణంగా ఉంటుంది. ఎఐ ఆధారిత భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న సాంకేతిక అవగాహన గల తరాన్ని నిర్మించాలనే చైనా యొక్క ఉత్సాహాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మొత్తం మీద పరిస్థితులను గమనించి చైనా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంది. ఎఐలో చిన్నతనం నుంచే శిక్షణ ఇప్పించడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించడం ఖాయంగా కనిపిస్తున్నది.



## ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇంటి స్థలాలివ్వండి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ భువనగిరి పట్టణ మూడవ మహాసభ జిల్లా పార్టీ కార్యాలయంలో బద్దం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ భువనగిరి పట్టణ, మండల పరిధిలో ప్రభుత్వ మిగులు భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆ భూములు పేదల ఇంటి నివేషణ స్థలాలకు కేటాయింపులు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరినీ అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఎట్టి పరిస్థితులలోనూ ఆ భూములను వదలమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కేటాయింపులు ఇచ్చేంతవరకు పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. భువనగిరి పట్టణం మండలంలో అర్హుల జాబితాలోని అర్జీలను పరిశీలించి స్థలాలను కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ ఈనెల 28న భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ముట్టడి దిగ్బంధనం చేస్తామన్నారు. మహాసభలో పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు చొప్పరి సత్తయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, నాయకులు దాసరి లక్ష్మయ్య, చింతల పెంటయ్య, సొప్పరి సత్తయ్య, ఎండి బాబా, దాసరి మారయా, కోరే సామెల్ పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని, తద్వారా పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ప్రతి ప్రాంతంలో డివిజన్ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి పల్లెలో, పట్టణాలలో కార్మికులు, కార్యకర్తలు కార్మిక దినోత్సవమైన మేడేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కెవిఎన్ మూర్తి, జడ వెంకన్న, కృష్ణ, సైదులు, మస్తాన్, మల్లయ్య, ప్రసాద్, సత్యవతి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు గాలికి వదిలేసిన కేంద్రం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

గ్యాస్ ధరల పెంపు, వక్ఫ్ చట్టం రద్దుకు సిపిఐ ధర్నాలు




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటినా వాటిని నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. హిందువులు, ముస్లింల పేరుతో ప్రజలను విడగొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకుని వచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను, సిబిఐ, ఇడి వంటి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని, మాట వినని ప్రతిపక్ష పార్టీ నాయకులపై వాటిని ఉసిగొల్పుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల యెల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, ఊటుకూరి రాములు, వేల్పుల సారంగపాణి, నేదునూరి వెంకటరాజం, మునిగల భిక్షపతి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, మంచాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ ప్రతినిధి :** నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ సమితి ఆధ్వర్యంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేకల రవి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేసే విధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డివిరిచే విధంగా ఉందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసి పేద కుటుంబాలకు 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ కార్డు ద్వారా అందించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ వరంగల్ సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, గుండె భద్రి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓర్సు రాజు, ల్యాదల్ల శరత్, తాళ్ళపల్లి జాన్ పాల్, యండి అక్బర్ పాషా, దస్రు, నాయకులు జన్ను రాజు, కుమార్, రాజేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ ప్రతినిధి :** గ్యాస్ అధిక ధరలు అరికట్టాలని, వక్ఫ్ చట్టం సవరణ రద్దు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ అధిక ధరలు అరికట్టాలని, వక్ఫ్ సవరణ చట్టం బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు ముస్లీం కమిటీ బాధ్యులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్ సారథిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, ముస్లీం కమిటీ బాధ్యులు ఎండి ఇక్బాల్, ఫరీద్, రియాజ్, ఆషీఫ్, ఇబ్రహిం, ఇస్మాయిల్, రహీముద్దీన్‌చాంద్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, చొప్పరి శేఖర్, సారిక, శ్రీను, జంపాల వెంకన్న, ఎండి ఫాతిమా, వెలుగు శ్రావణ్, తూటి వెంకటరెడ్డి, అవోక్, ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, చీర వెంకన్న పాల్గొన్నారు.





## బిజెపి కార్పొరేట్ విధానాలపై పోరాటం

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కుల రాజుగౌడ్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్రంలో మూడో సారీ అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తుందని, ఈ విధానాలపై పోరాటం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కుల రాజుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం రామనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సారంగపాణి, రాజుగౌడ్ మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లను చట్టం చేసి అమల్లోకి తీసుకువచ్చేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధం అయిందని, దీనికి వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలను అణిచి వేస్తూ కార్మిక హక్కులను కాల రాస్తుందని వారు విమర్శించారు. 2025 –26 బడ్జెట్లో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేటాయింపులు చేసిందన్నారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టి, సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్ గుత్తా సంస్థలకు పెట్టుబడుదారులకు వేలకోట్ల రూపాయలు రాయితీలు ప్రకటించిందన్నారు.ఉపాధి నిరుద్యోగము అధిక ధరలు ఆకలి అసమానులతో ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకుండా ఈ సమస్యలను మరింత తీవ్ర రూపం దాల్చే విధంగా ఆర్థిక విధానాలను విచక్షనా రహితంగా అమలు చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు వెనుక కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు కలిసి మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని దానిని జయప్రదం చేయడం కోసం ఈనెల 27న కాకతీయ యూనివర్సిటీలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు నున్న అప్పారావు, ఎఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ రావు, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్యాంసుందర్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు మైముదాలు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టీ.ఉప్పలయ్య, కార్మిక సంఘాల నాయకులు పుల్ల అశోక్, ఎన్.రజిత, గుంటి రాజేందర్, ఆర్ కుమార్, మంద మల్లేశం, డి.భాను నాయక్, ఆర్.దుర్గాప్రసాద్, ఏ.మల్లయ్య ఆర్ వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## 29న యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** అఖిల భారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) యాదాద్రి భువనగిరిజిల్లా 2వ మహాసభల కరపత్రాన్ని యాదగిరిగుట్టలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్ మాట్లాడుతూ యాదగిరిగుట్టలోని లక్కీ ఫంక్షన్ హాల్ లో జరిగే జిల్లా మహాసభలకు యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, రావుల శీను, శెట్టి నరసింహ, కంబాల సత్యం, సంగి అరవింద్, సుమంత్, శ్రీను పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## జెఇఇ 2025 మెయిన్స్‌లో శ్రీచైతన్య మొదటి ర్యాంక్

ప్రజాపక్షం/ మక్తల్ : ట్రిపుల్ ఐటి జెఇఇ 2025మెన్స్ ఫలితాలలో హైదరాబాద్ శ్రీచైతన్య విద్యార్థులు ఆల్ ఇండియా లెవెల్లో ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకుతో పాటు 1,9,10 ర్యాంకులను సాధించారని మక్తల్ శాఖ ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపినారు. ఈ విజయోత్సవ సంబరాలలో అజీఎమ్ భాస్కర్ రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉత్సవపరిచినారు. ఈ విజయోత్సవ సంబరాలలో మక్తల్ శాఖ ప్రిన్సిపల్ రామకృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘు బాబు, పాఠశాల డీన్ రఘు, ప్రైమరీ ఇంచార్జ్ జ్యోతి, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ అర్చన, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.



## తడిసిన ధాన్యం పరిశీలన



ప్రజాపక్షం/అడ్డాకుల : అడ్డాకుల మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యంను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి దేవరకద్ర శాసన సభ్యుడు జి.మధుసూదన్ రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. అడ్డాకుల మండలం లో ఏర్పాటు చేసిన పి. సి.ఎస్ కొనుగోలు కేంద్రంలో అకాల వర్షాలకు కురిసిన తడిసిన ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్, శాసన సభ్యుడు మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని వారికి భారోసా కల్పించారు.

## జడ్చర్లలో హోటల్ తనిఖీ



ప్రజాపక్షం/ జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని తాజ్ ఫుడ్ కోర్టు ఇతర ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మిల్క్ డైరీ యూనిట్స్‌ను ఫుడ్ ఇన్స్పెక్టర్ మనోజ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో, వినియోగించే చికెట్ బిర్యానిల నాణ్యతలను చెక్ చేయడం జరిగింది. అలాగే శుభ్రత ప్రమాణాలు చట్టపరంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేయడం జరిగింది. చికెన్ నాణ్యత కోసం స్టేట్ ఫుడ్ లాబరేటరికి పంపించడం జరిగింది. అలాగే డైరీ యూనిట్స్‌ను కూడా పాల నాణ్యత కోసం తనిఖీ చేయడం జరిగింది. వీగిలో లాబ్ రిపోర్ట్ ఆధారంగా కల్తీ నిర్దారణ జరిగితే క్రిమినల్ చర్యలు చట్ట ప్రకారం తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## మత్తు పదార్థాల నిర్మూలన...
## పోలీస్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/ నారాయణపేట్ : సోమవారం రోజు కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో అకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని డిఎస్‌పి నల్లపు లింగయ్య తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి, అక్రమ రవాణా జరగకుండా కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో అకడ్బందీగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా కిరాణాషాపులలో, అనుమానంగా ఉన్న పంట పొలాలో, పన్ షాప్‌లలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలు, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గో ప్యంగా ఉంచడం జరుతది అని డీఎస్పీ తెలిపారు. ఎఎస్ఐ ఆంజనేయులు, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్‌విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

## పట్టపగలే కిరాణా షాప్‌లో చోరీ

ప్రజాపక్షం / వీపనగండ్ల: గ్రామంలో నిఘా నేత్రాలు ఉన్న పట్టపగలే కిరాణా షాపులో చోరీ జరిగిన ఘటన మండలంలోని బొల్లారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాయి ప్రకాశ్ శెట్టి అనే వ్యాపారి బొల్లారం లోని ప్రదాన రోడ్డు వద్ద గాంధీ విగ్రహం పక్కన కిరాణా దుకాణం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇంటి వద్ద గృహ నిర్మాణ పనులు చేస్తుండటంతో కిరాణం దుకాణాన్ని 11 గంటలకు మూసి ఇంటి వద్దకు వెల్లినట్లు బాధితుడు తెలిపారు. మధ్యాహ్నం మూడుగంటల సమయంలో కిరాణా షాప్ తెరుచుకొని ఉందని దొంగలు పడినట్లు షాప్ పక్కన ఉన్న గృహస్తులు సమాచారం ఇవ్వడంతో దుకాణానికి వచ్చి చూడగా షాపులో ఉన్న సుమారు పది వేల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెల్లినట్లు దుకాణ యజమాని సాయి ప్రకాశ్ తెలిపారు. చోరీ ఘటన గురించి వీపనగండ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## విద్యతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాపక్షం/బిజినేపల్లి : విద్యార్థులు చిన్నప్పటినుంచి ఉన్నత విద్యాభ్యాసంతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంఇఒ రఘునాథశర్మ అన్నారు. మండలకేంద్రంలోని ఎంజెఆర్‌ఫంక్షన్‌హాలులో సోమవారం మాస్టర్‌మైండ్ హైస్కూల్ వార్షికోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను అతిథులను అలరించాయి. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుంచే లక్ష్యం నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నతస్థాయికి చేరుకుంటారని సూచించారు. విద్యతోపాటు క్రీడలు, సామాజికస్పృహ, పెద్దలపట్ల గౌరవం, ఉత్తమ మానవసంబంధాలు కొనసాగిస్తే సమాజంలో మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. ఎప్పటికప్పుడు సమాజ పోకడలను తెలుసుకొని విద్యార్థిదశలోనే క్రమశిక్షణతో మెలిగితే ఉత్తమ పౌరుడిగా సంతోషకరమైన జీవితాన్ని సాగించవచ్చని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్‌హైస్కూల్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ భానుప్రకాష్‌రెడ్డి, సత్తార్, వహీద్, బాలాజి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాపక్షం / వనపర్తి :పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన మిద్దెగొల్ల సాయమ్మ ఆదివారం వడదెబ్బతో మృతి చెందింది. గ్రామ మాజీ జడ్‌టిసి రమేష్ గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాలలు అర్పించారు. స్థానిక తహసీల్దార్ సరస్వతితో మాట్లాడి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ,వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీజడ్‌టిసి రమేష్ గౌడ్ , గ్రామ అధ్యక్షులు బాలరాజు, మల్లేష్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ప్రజాపక్షం / వనపర్తి :వరి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఆదివారం సాయంత్రం కురిసిన ఆకాల వర్షానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆయన సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దమందడి మండలం బలిజిపల్లిలో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని, వనపర్తి మండలం అంకుర్ లో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యం గురించి ఎవ్వరు అధైర్య పడరాదని కొనుగోలు కేంద్రాలలోని చివరిగింజ వరకు కొంటామని ఆయన అన్నదాతలకు భరోసా కల్పించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసు మిల్లర్లు తీసుకోకుండా సతాయిస్తే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని అన్నదాతలకు అక్కడే తన సెల్ ఫోన్ నంబర్ను ఎమ్మెల్యే రాసించారు. కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తే తనకు చిన్న మెసెజ్ పంపిన వెంటనే స్పందిస్తామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్ , వనపర్తి జిల్లా ఎంపిపి కిచ్చారెడ్డి, పెద్దమందడి వనపర్తి మండలాల తహసీల్దార్లు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 92 ఫిర్యాదులు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయంలో సముదాయ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 ఫిర్యాదుల అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో పాటు, జిల్లా పరిషద్ సీఈవో వెంకట్ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మేడే వాల్‌పోస్టర్లు విడుదల




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మణాచారిభవనంలో ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో మేడే వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ జనరల్‌కాన్ ఫెడరేషన్‌ఆఫ్‌లేబర్ 1895లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైందన్నారు. 1905లో ట్రేడ్‌అండ్‌లేబర్ యూనియన్‌గా ఏర్పడింది. అమెరికన్ ఆఫ్ లేబర్‌గా కార్మికసంఘాలు ఏకమై, 1945లో ప్రారంభమైన వరల్డ్‌ఫెడరేషన్ ఆఫ్‌ట్రేడ్ యూనియన్‌గా ఏర్పడింది. అమెరికానగరం హేమార్కేట్లో 1886లో మే1న సమ్మెచేయాలని ప్రపంచకార్మికసంఘాల సమాఖ్య సోషలిస్టు కార్మిక సంఘాల సమ్మె మే మార్కెట్లో భారీప్రదర్శన 8గంటల పనికై కదంతొక్కారన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, పబ్లిక్‌సెక్టార్ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శంకర్, ఎఐటియూసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటస్వామి, హమాలిసంఘం జిల్లా నాయకులు గొర్లసత్యం, భవననిర్మాణ కార్మికులు తాతయ్య, దాంగట్లశ్రీను, పద్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

## రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలంలో ఆదివారం ఈదురుగాలులతోకూడిన భారీవర్షానికి కిందపడ్డ మొక్కజొన్న, వరిపైరును మాజీఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, మాజీ రైతుబంధు మండల అధ్యక్షుడు నెల్లికంటిమహేశ్వర్‌రెడ్డి, సురభిశేఖర్‌రావు, మాజీ ఎంపిటిసిలు చిర్ణంబాలస్వామి, తిరుపతిరెడ్డిలతో కలిసి పరిశీలించి నష్టపోయిన రైతులందరికి ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. మండలంలోని లట్టుపల్లిలో అకాలవర్షానికి కల్లాలో ఆరబోసిన వరిధాన్యం పూర్తిగా తడవడంతో సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం బేషరతుగా కొనుగోలుచేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్‌చేశారు. లట్టుపల్లి, మహాదేవునిపేట, బిజినేపల్లి తదితర గ్రామాల్లో నేలకు ఒరిగిన వరి, మొక్కజొన్నపంటలను సందర్శించి రైతులకు మనోధైర్యం కల్పించి ప్రభుత్వం ఆదుకునేలా పోరాటం చేస్తామని భరోసా కల్పించారు. మహాదేవునిపేట గ్రామంలోకూలిన రెండు కోళ్లఫారాలను, మామిడికాయలురాలిన తోట యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. వారివెంట బిఆర్‌ఎస్ నాయకులు జంగం వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

## ఆందోళనవద్దు ప్రతిగింజనూ కొంటాం

### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తమ ప్రభుత్వం రైతులపక్షపాతి అని జిల్లా అధికారులతో చర్చించి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళుచేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డులో తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే తమప్రభుత్వం కొనుగోలుకేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. అకాలవర్షంవల్ల రైతులకు ఇబ్బందులు కలిగాయని వాటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో ఎక్కడ రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.కొనుగోలు కేంద్రాలలో కొనుగోలుచేసినవాటికి వెంటనే బిల్లులు చెల్లించేలా కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం రైతులపక్షపాతి కాబట్టి ఇచ్చిన హామీమేరకు సన్నవడ్లకు రూ.500బోనస్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం



ప్రజాపక్షం/ నారాయణపేట : భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పేట' లో 3వ మెగా జాబ్ మేళా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ నారామణపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన డాక్టర్।।కె. రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట కూరగాయల మార్కెట్ రోడ్డులో ఉన్న ఎస్. ఆర్. గార్డెన్స్‌లో మే 3వ తేదీ శనివారం ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను నారాయణపేటలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు, ఉపాధి లేక అనేక మంది యువతీ యువకులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుసుకుని వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నారాయణపేట జిల్లాలో ఉన్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని రాజ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ఫౌండేషన్ సభ్యులు దగ్గం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ గౌడ్, రుద్రారెడ్డి, హనుమంతు, వై. సంతోష్, శివరాజ్, ఎం. సంతోష్, నరేష్ గౌడ్, ప్రవీణ్, విజయ్, రాజు ఉన్నారు.

## ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ప్రజాపక్షం / పెబ్బేరు: రైతులు పండించిన యాసంగి ధాన్యం కొనుగోలు చేయుటకు పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు గుమ్మడం, తిప్పాయపల్లి, చిన్న గుమ్మడం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలులో అధికారులు ఇర్లక్ష్యం వహించరాదని తెలియజేశారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, సేదతీరెందుకు నీడ సౌకర్యం, గన్ని బ్యాగుల సౌకర్యం ఉండేలా చూడాలని తేమ నిర్ధారణ విషయంలో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేయకూడదని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్య విక్రమించిన అన్నదాతలకు అందుకు సంబంధించిన డబ్బులను వారి ఖాతాల్లో వెంటనే జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోళ్ల విషయంలో రైతులు ఆందోళన చెందరాదని చివరి గింజ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యాన్ని కొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, శ్రీరంగాపురం సింగల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, యుగంధర్ రెడ్డి, మండల యువజన నాయకుడు రాజేష్ , యుగంధర్ రెడ్డి, వీరస్వామి నాయుడు, రణధీర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రాఘవేందర్ , నిరంజన్ , మార్కెట్ డైరెక్టర్ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగు పాటుకు గొర్రెలు మృతి

### బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి : ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఆకాల వర్షం తాకిడి పడ్డ పిడుగుపాటుకు గోపాల్‌పేట మండలం చాకల్ పల్లి, లక్ష్మీ దేవిపల్లి గ్రామాలకు చెందిన, విశ్వనాథం, బోయ రాములుకు చెందిన 25గొర్రెలు మృతి చెందాయి. ఈ క్రమంలో సోమవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి లక్ష్మి దేవిపల్లి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనలో బాధిత కుటుంబ సభ్యురాలు అయిన సరోజ సైతం గాయపడిందని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమెకు వైద్యచికిత్స అందించేందుకు తనవంతు సహయ సహకారాలు అందిస్తానని ఆమెను వెంటనే వనపర్తి జిల్లా ఆసుపత్రిలో చేర్పించి తగు వైద్యం అందించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. గొర్రెలు మృతి చెందడం చాలా బాధకరమని , సంబంధించి ప్రభుత్వం తరపున సహకార సహకారాలు అందేలా చూస్తామని, ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారులను తహసీల్దార్‌ని ఆయన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహయ సహకారాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సత్య శీలారెడ్డి, కోటిరెడ్డి, భరత్‌రెడ్డి, సురేందర్‌గౌడ్ , అధికారులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాధితులకు తక్షణ సహయంగా ఆయన రూ. 20వేలు అందించారు.


## రైతుల నుంచి ప్రతిగింజా కొంటాం

### ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి



ప్రజాపక్షం/బిజినేపల్లి: రైతులు పండించిన ప్రతిగింజను కొనుగోలుచేసి మద్దతు ధరచెల్లిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఐకెపి, పిఏసిఎస్ వరి కొనుగోలుకేంద్రాల్లో విక్రయించుకొని మద్దతుధరతోపాటు ప్రభుత్వం అందిస్తున్న క్వింటాల్‌కు రూ.500బోనస్ లబ్ధిపొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో కొర్రిలు పెట్టకుండా సేకరించాలని ఐకెపి, పిఏసిఎస్ కేంద్రాల ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం అకాలవర్షాలకు తడిసిన ధాన్యాన్ని , నేలకు ఒరిగిన వరి, మొక్కజొన్నపంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఆయనవెంట పిఏసిఎస్ చైర్మన్ బాలరాజుగౌడ్, ఐకెపి ఎపిఎం విజయ, సిసి ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, కృష్ణయ్య, గోవిందునాయక్, పిఏసిఎస్ మాజీచైర్మన్ వెంకటస్వామి, ఈశ్వర్, అమృత్‌రెడ్డి, తిరుపతయ్య, నజీర్, పుల్యానాయక్, పాండునాయక్, దాసర్లసైదులు పాల్గొన్నారు.

## అకాలవర్షంతో మొక్కజొన్నకు నష్టం



ప్రజాపక్షం/ఊర్కొండ : కిసాన్‌మోర్చా రాష్ట్రశాఖ పిలుపుమేరకు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం మాధారం గ్రామంలో అదేవిధంగా గుడిగానిపల్లి గ్రామంలో అకాలవర్షానికి మొక్కజొన్న పంట, వరికొనుగోలు కేంద్రాలను పరిశీలించి పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేస్తూ రైతుపంట నష్టం కింద ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డ సొంతజిల్లా రైతులను తక్షణమే ఆదుకోవాలన్నారు. అకాలవర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు పాపన్నగౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కిసాన్‌మోర్చా రాష్ట్రకార్యదర్శి గోవర్దన్‌గౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యులు తుమ్మేటివెంకట్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఆనంద్‌గౌడ్, పరుషరాములు, వెంకటేష్, మహేష్, తిరుపతిరెడ్డి,బ్రహ్మాచారి, బిజెపికిసాన్‌మోర్చా నాయకులు,రైతులు పాల్గొన్నారు.

## ఉషూ మార్షల్ ఆర్ట్స్‌లో జడ్చర్ల మాస్టర్ తాజుద్దీన్ ప్రతిభ




ప్రజాపక్షం/జడ్చర్ల: తెలంగాణ రాష్ట్ర సాథయిలో నిర్వహించిన ఉషూ జడ్జింగ్ సెమినార్లో ఉత్తీర్ణత సాధించిన మాస్టర్ తాజుద్దీన్ ఆదివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు భవిష్య ఇంటర్నేషనల్ స్కూల్ దేవకమ్మ తోట హస్తినాపురం రంగారెడ్డి డిస్ట్రిక్ట్ నిర్వహించిన జడ్జిగ్ సెమినార్లో జడ్చర్ల మహబూబ్‌నగర్ జిల్లా నుండి హాజరై ఉషూ మార్షల్ ఆర్ట్స్ లో ఉత్తీర్ణత సాధించడం జరిగింది. అమేచూర్ ఉషూ రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ్ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్ భవ్య స్కూల్స్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి రంగారెడ్డి డిస్టిక్ ప్రెసిడెంట్ జావిద్ ఖాన్, రాష్ట్ర కమిటీ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడం పట్ల మాస్టర్ తాజుద్దీన్ కె ఎఫ్ఎస్ సీనియర్ అండ్ జూనియర్ అన్స్రక్టర్స్ అభినందనలు తెలియజేయడం జరిగింది.

## ప్రజావాణికి 35 అర్జీలు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వర పరిష్కారంకోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు



**ప్రజాపక్షం/మునగాల:** మునగాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలలో రైతులకు ఇబ్బంది లేకుండా కాంటాలు వేయాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా సీరియల్ ప్రకారం ధాన్యంను కాంటాలు వేయాలన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు మ్యాచర్ వచ్చిన ధాన్యంను కాటాలు వేయించాలన్నారు. కొను గోలు కేంద్రంలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని పలువురు రైతులు కోరారు. సంచుల కొరత ఏమైనా ఉంటే తనదృష్టికి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలే సామ్యేలు, ఓరుగంటి రవి, గంధం సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజానాట్య మండలి కళాకారుడి ప్రతిభ

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ప్రజానాట్య మండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపనబోయిన వెంకటేశ్వర్లు నెల 18న మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన పాటల పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ బహుమతి సాధించి పలువురి మన్ననలు పొందారు. తెలంగాణ సాంస్కృతీక కళా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్రరావు,అధ్యక్షులు పరిమి రామానందం,ప్రధానకార్యదర్శి పులి కృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి వందలాది మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచినారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో తన ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన గోపనబోయిన వెంకటేశ్వర్లును సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా ప్రధానకార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,కెవిఎన్ మూర్తి,యల్లావుల రాములులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## బాధితులకు తక్షణమే న్యాయం



**ప్రజాపక్షం /నల్లగొండ:** బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పని చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని అన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం

అదనపు కలెక్టర్ పి రాంబాబు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 93 ఫిర్యాదులు అందగా వాటిలో భూ సమస్యలపై 38 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం (బ్రౌస్) భారతి రంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ సొసైటి వారు జిల్లాలో 700 మంది టిబి రోగులకు న్యూట్రిషియన్ ఫుడ్ 3వేల ప్యాకెట్లను అందజేశారు. జెడ్‌పి సిఈఓ వివి అప్పారావు, వివిధ శాఖల అధికారులు సతీష్ కుమార్, నరసింహారావు, కిషన్, శంకర్, శ్రీధర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, శర్మ, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.
**జిల్లా పోలీస్ కార్యాలయంలో:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా ప్రతి అం శాన్ని చట్ట పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు

## నీటి సంపులో పడి వివాహిత అనుమానాస్పద మృతి

భర్త వేధింపుల వల్లే జరిగిందంటున్న తల్లిదండ్రులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** నీటి సంపులో పడి వివాహిత మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మంగళగిరికి చెందిన నాగమణి అనే మహిళను పుట్టపాక గ్రామానికి చెందిన మల్లికార్జున్‌కు ఇచ్చి 2020లో వివాహం జరిపించారు. వివాహం జరిగిన నాటినుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరిలోనే బంగారం తయారీ పనులు చేసుకుంటూ వీరు ఇరువురు నివాసం ఉంటున్నారు. ఇటీవల పుటపాక లోని మృతురాలు జంజన నాగమణి(25) భర్త స్వగ్రామంలో నూతన ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు వచ్చారు. సోమవారం ఉదయం ప్రస్తుతం పుట్టపాకలో నివాసం ఉంటున్న ఇంటి వద్ద నుంచి మృతురాలి భర్త నూతనంగా నిర్మించే ఇంటి వద్దకు పనులు పర్యవేక్షించేందుకు వెళ్లాడు. మృతురాలి మామ బట్టలు అమ్మేందుకు వెళ్లగా ఇంట్లో తన అత్తతో కలిసి ఉన్నది. తన భర్తతో కలిసి గుడికి వెళ్తానని మృతురాలు తన అత్తకు తెలపడంతో నూతనంగా నిర్మించే ఇంటి వద్ద ఉన్న కుమారుడ్ని ఇంటికి పంపేందుకు ఆమె కూడా ఇంట్లో నుండి వెళ్లిపోయింది. ఈ సమయంలో ఇంటి వద్దకు వచ్చిన మృతురాలి భర్త అప్పటికే నీటి సంపులో పడి తన భార్య మృతి చెందిన విషయాన్ని గుర్తించాడు. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు తెలపడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వేధింపులతోనే మృతి. తమ కూతురును తరచూ వేధించడంతోనే మృతి చెందిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తన కూతురు మృతికి కారణమైన ఆమె భర్త మల్లికార్జున్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగమణి మృతి పై పలు అనుమానాలు ఉండడంతో స్థానిక ఎస్సు జగన్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ మృతదేహానికి నలగొండ జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఫోరెన్సిక్ నిపుణునితో పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

# భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా చందంపేట



భూ భారతి ద్వారా అందరికీ మేలు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
రెవెన్యూ అధికారుల తీరుపై మంత్రి 'సీరియస్'

**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం భూ భారతి ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నల్గొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక ఎంఎల్‌ఏ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలంగాణ భూ భారతి 2025 చట్టం పై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చందంపేట మండలంలో రెవెన్యూ అధికారులు పనితీరు మార్చుకోవాలని ఆయన సిరియస్ అయ్యారు. గత పాలనలో పేద ప్రజలకు న్యాయం జరగలేదని, రెవెన్యూ అధికారులు పింక్ కలర్ పార్టీ నాయకులు ఏది చెప్తే అది చేయడంతో పేద ప్రజలకు అన్యాయం జరిగిందని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రతి ఒక్కటి ఆలోచన చేసి అందరికి న్యాయం చేసే విధంగా భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరగాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెలాఖరు నాటికి పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందని జూన్ 2 నుండి పైలెట్ మండలాలలో వ్యవసాయ భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటామని మే 01 నుండి అన్ని జిల్లాల్లో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోనున్నామని అత్యంత వెనుకబడిన చందంపేట మండలాన్ని కూడా దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ చెప్పినట్లుగా పైలెట్ మండలంగా తీసుకునే విషయంపై ఆలోచన చేస్తామని జూన్ 2 నుండి ప్రతి గ్రామానికి తహశీల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారని రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతుల భూముల సర్వే కోసం 6వేల మంది లైసెన్స్డ్ సర్వేలను నియమించనున్నామని ప్రతి గ్రామానికి ఒక గ్రామ పరిపాలన అధికారి చొప్పున 10695 మందిని వచ్చే నెల మొదటి వారం నుండి పంపించనున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి ద్వారా అందరికి న్యాయం చేస్తూ పేద రైతుల ప్రజల కన్నీళ్లు తుడుస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, మార్కెట్ చైర్మన్ జమునమాధవరెడ్డి, జిల్లా ఎస్పి శరత్‌చంద్రపవార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు ఎస్పి మౌనిక, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, బద్య, సర్వయ్య, ఆర్డివో రమాణారెడ్డి, ఎంఆర్‌వో గోవర్ధన్‌రెడ్డి, ఎంపిడివో లక్ష్మి, సిఐ సురేష్, ఎస్‌ఐ సతీష్ నాయకులు పాల్గొన్నారు.

### సాగు చేసుకున్న భూములకు పట్టాలు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చందంపేట మండలం భూ భారతి చట్టం 2025పై చందంపేట మండల పరిధిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంఎల్‌సి సత్యం మాట్లాడుతూ గత పాలనలో ధరణిలో అనేక సమస్యలు ఉండేవని రైతులు సాగు చేసుకుంటున్న భూములను అప్పటి అధికార పార్టీ నాయకులు, అప్పటి అధికారులు పేద రైతులను ఇబ్బందులకు గురిచేశారని అలాగే చందంపేట మండలంలో కొన్ని గ్రామాలు ధరణిలో బ్లాక్ చేయడం జరిగిందని వీటన్నింటిని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. డి ఫారెస్ట్ భూములు పరిష్కరించే దిశగా ఆలోచించాలని నల్గొండ జిల్లాలో మండలాలకు సర్వేయర్లను నియమించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి భూమి ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని సాగు చేసుకుంటున్న వారికి హక్కు కల్పించాలని భూ భారతి చట్టం వల్ల రైతులకు లాభం జరుగుతుందని ఆయన ఆశించారు. గత ప్రభుత్వంలో మండలాల చుట్టూ తిరిగి రైతులు ఎంతో ఎంతో ఇబ్బంది పడ్డారని రైతుల బాధలు కొన్ని గ్రామాలకు వెళ్లి తెలుసుకున్నామన్నారు.




# భూ భారతి చట్టం రైతులకు చుట్టం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకు చుట్టం లాంటిదని అది కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కల్పించిన ఒక వరమని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం బొమ్మలరామారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన భూ భారతి చట్టం పై రైతులతో జరిగిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి భూభారతి చట్టం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ భూ భారతి చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆయన తెలిపారు. ( ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారిని నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలో అందుతాయని రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు ప్రజలకు అన్ని సేవలు అందించేలా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బొమ్మలరామారం మండల కేంద్రంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి బొమ్మలరామారం తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాజా త్రివిక్రమం, ఆర్ఐ వెంకట్ రెడ్డి, నరేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ సంధ్యా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పావని, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్ పాల్గొన్నారు.



**తండాలో సన్నబియ్యం భోజనం చేసిన బీర్ల**

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మోతీరామ్ తండా గ్రామంలో బాణోత్ మంగ్య రుక్కి గిరిజన కుటుంబంతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న రేషన్ సన్న బియ్యంతో వండిన భోజనాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబంతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.



## మేడే గోడ పత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కార్మికుల హక్కుల పరిరక్షణకు బలమైన ఉద్యమాలు జరపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయ్యద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం లైట్ మోటార్స్ వెహికల్స్ కార్మికులతో కలిసి మేడే ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించి వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా కారిమకులు సాధించుకున్న హక్కులను పాలక ప్రభుత్వాలు హరించి వేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పి కొట్టేందుకు రాజీలేని పోరాటాలు సాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివిటి బోనస్, పెన్షన్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. హమాలీ ఆటో వర్కర్స్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలన్నారు. అదేవిధంగా 30వేల సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా, 60 సంవత్సరాలు పైబడిన ప్రతి కార్మికునికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వల్లంపట్ల వెంకన్న, లైట్ మోటార్స్ వెహికిల్స్ కార్మికులు వెంకన్న, గోప జానయ్య, చోటు, షఫి, శ్రీనివాసరాజు, ఎర్రబోయిన శ్రీను, హాజీ, రఫి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండి మణెమ్మ అన్నారు. సోమవారం నకిరేకల్ మండలంలోని మండలాపురం లో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడే రామకృష్ణ ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు కె.బాలాజీ, పి.రమేష్ , పి.దశరథ, విద్యార్థులు , గ్రామ పెద్దలు కలిసి గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మ అదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీమతి దండి మణెమ్మ మాట్లాడుతూ విశాలమైన ఆట స్థలం, ఆకర్షణీయమైన తరగతి గదులు, ప్రతి తరగతి గదిలో ఫ్యాను,డ్యూయల్ డెస్క్ లు, పచ్చని చెట్లు కలిగిన ఆహ్లాదకరమైన వాతావరణం , ఇంగ్లీష్ మీడియం ఉన్న మన మండలాపురం స్కూల్‌లో మన గ్రామ పిల్లలు ఉండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ లు దండి నాగేశ్వరరావు, గుడుకుంట్ల లచ్చువమ్మ శంభయ్య , తంగెళ్ళ రామిరెడ్డి, ఏర్పుల మల్లమ్మ సైదులు, గ్రామ యవ్వకులు దండి అంజయ్య, తీగల బక్కయ్య, తీగల మహేశ్, తీగల రమేష్, కొత్తపల్లి నరసింహ, కిషోర్ పాల్గొన్నారు.




# జూన్ 2 నుండి ఆన్‌లైన్‌లో భూభారతి చట్టం పోర్టల్

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/అనంతగిరి:** రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూ భారతిచట్టమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో గల గోదాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకవచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం 2025) పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకవచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం ద్వారా దొరుకుతుందని జూన్ 2 నుండి ఆన్‌లైన్‌లో భూభారతి చట్టం పోర్టల్ పనిచేస్తుందని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏదైనా సమస్య పరిష్కారినికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలో మ్యూటేషన్లు ఆటోమెటిక్‌గా అవుతాయని, 30 రోజుల్లో మ్యుటేషన్ కాకపోతే 31వ రోజు ఆటోమెటిగ్గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలోని అంశాలను సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఫిర్యాదులను సమర్పించి పరిష్కరించుకోవచ్చని, ఒక వేళ రైతులకు ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కోదాడ ఆర్డీవో సూర్యానారయణ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని సెక్షన్లు వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ హిమబిందు, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిప్యూటి తహసిల్దార్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి చుండూరు వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసి కొణతం ఉమా శ్రీనివాసరెడ్డి, నాయకులు బుర్ర పుల్లారెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, ఈదుల కృష్ణయ్య పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రాక గోస : చంద్రశేఖర్



**పజాపక్షం/భువనగిరి రూరల్:** ఫీల్డ్ అసిస్టెంట్లకు గత మూడు నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు గురవుతున్నారని ఐఎన్‌టియుసి స్టేట్ జనరల్ సెక్రెటరీ ఆర్ధి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ రాష్ట్ర కమిటి ఐఎన్‌టియుసి అనుబంధం పిలుపుమేరకు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు బబ్బూరి శంకర్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో రాయిగిర్ కమాన్ నుండి కలెక్టరేట్ వరకు ఫీల్ అసిస్టెంట్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి జగన్మోహన్ రెడ్డి, డిఆర్డిఓ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి స్టేట్ జనరల్ సెక్రెటరీ ఆర్ధి చంద్రశేఖర్ మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం రూ.25 వేల జీతం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు హెల్త్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ విధి నిర్వహణలో మరణిస్తే 15 లక్షల ఎక్స్ గ్రేషియ ప్రకటించాలని కోరారు. అలాగే 4779 జిఓ ప్రకారం తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీలకు సంవత్సరానికీ 150 రోజుల పని దినాలు కల్పించి కూలీ రేటు రూ.400 ఇవ్వాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంకల సిద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరగోని రమేష్, కోశాధికారి జెర్రిపోతుల ఉపేందర్, నరేందర్, రామచందర్, బింగి నర్సింహా, రవి వెంకటేష్, సుధాకర్, కూమార్, శ్రీను రజిత సునీత, వాణి లక్ష్మి వివిధ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలంలోని వడపర్తి, బిఎన్ తిమ్మాపురం, హన్మాపురం గ్రామాల్లో ఏఐసీసీ, పీసీసీ, డీసీసీ పిలుపు మేరకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బొజ్జ సంధ్యారెడ్డి ఆదేశాలతో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమాన్ని భువనగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, అహింస, శాంతి సిద్ధాంతాలను అలవర్చుకోవాలని, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను, ఆశయాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, భువనగిరి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం శివానంద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పులిగిల్ల బాలయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు, మండల నాయకులు కోట మహేందర్, గ్రామశాఖ అధ్యక్షులు జిన్న సత్తయ్య, పిన్నం శ్రీశైలం, తుమ్మేటి వెంకటేష్, ఉడత ధనకోటి, ఎర్ర మహేష్, ముదుగుల ఆనంద్, సిలువెరి శ్రీను, శానూర్ పాల్గొన్నారు.

# క్రీడ

## గిల్‌కు చేజారిన.. శతకం!

తగ్గేదేలే అంటూ కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేసిన ఓపెనర్లు గిల్, సాయి



టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు తగ్గేదేలే అంటున్నారు. నిలకడగ ఆడుతూ భారీ స్కోర్లతో విరుచుకుపడుతున్నారు. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేశారు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(90), సాయి సుదర్శన్(52). తమ జోడీ ఎంతో పవర్‌ఫుల్ అని చాటుతూ అదిరే అరంభం ఇచ్చారు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన గిల్ సెంచరీని చేజార్చుకోగా.. ఆఖర్లో జోస్ బట్లర్(41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. కుర్రాడు షారుఖ్ ఖాన్(11 నాటౌట్)సైతం చెలరేగగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో3 వికెట్లు కోల్పోయి 198రన్స్ కొట్టింది. సొంతమైదానంలో చెలరేగి పోయే కోల్‌కతా బ్యాటర్లు ఛేదనలో ఏం చేస్తారో చూడాలి. టాస్ ఓడిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (90 : 55 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లు), సాయి సుదర్శన్(52 :36 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్ )లు బలమైన పునాది వేశారు. కోల్‌కతా బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీలతో చెలరేగారు. పవర్ ప్లే తర్వాత జోరు పెంచిన గిల్ 34 బంతుల్లోనే అర్ధ శతకం బాదేయగా.. హర్షిత్ రానా బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన సాయి సైతం ఫిఫ్టీకి చేరువయ్యాడు. వీళ్లిద్దరి మెరుపులతో గుజరాత్ స్కోర్ 100 దాటేసింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని విడదీసేందుకు కోల్‌కతా కెప్టెన్ అజింక్యా రహానే బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. అయితే.. ఎట్టకేలకు రస్సెల్ విజయవంతమయ్యాడు. డేంజరస్ సుదర్శన్ ఔటయ్యాక జోస్ బట్లర్(41 నాటౌట్) జతగా గిల్ రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదిన అతడు రెండో వికెట్‌కు 58 రన్స్ జోడించాడు. సెంచరీకి చేరువైన గిల్.. వైభవ్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడి రింకూ చేతికి చిక్కాడు. ఆ తర్వాత వచ్చిన రాహుల్ తెవాటియా(0)ను హర్షిత్ పెవిలియన్ పంపాడు. వైభవ్ వేసిన 20వ ఓవర్లో బట్లర్ రెండు ఫోర్లు కొట్టగా షారుఖ్ ఖాన్(11 నాటౌట్) ఐదో బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో, గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 రన్స్ చేసింది.

## చరిత్ర సృష్టించిన కశ్మీర్ కండలవీరుడు..




జమ్మూ కశ్మీర్ వెయిట్ లిఫ్టర్ ముమిన్ దార్ చరిత్ర సృష్టించాడు. 'అత్యంత బలశాలిగా' రికార్డు నెలకొల్పాడు. తమ ప్రాంతంలో జరిగిన పవర్ లిఫ్టింగ్, డెడ్‌లిఫ్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో ముమిన్ ఏకంగా 663.5 కిలోల బరువులు ఎత్తి ఔరా అనిపించాడు. దాంతో, జమ్ముకశ్మీర్‌లోని స్ట్రాంగెస్ట్ మ్యాన్‌గా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించాడీ 23 ఏళ్ల లిఫ్టర్. సీనియర్, జూనియర్.. రెండు విభాగాల్లో పోటీ పడిన ముమిన్ రికార్డు స్థాయిలో బరువులెత్తాడు. మొదట స్క్వాట్ పొజిషన్‌లో 241 కిలోలు ఎత్తిన ముమిన్.. బెంచ్ ప్రెస్‌లో 172.5 కిలోల్ని అలవోకగా మోశాడు. ఆ తర్వాత కీలమైన డెడ్‌లిఫ్ట్‌లోనూ ఏమాత్రం తొణకకుండా 250 కిలోల బరువు మోసిన అతడు మొత్తంగా 663.5 కిలోలతో సరికొత్త చరిత్ర లిఖించాడు. తాను సాధించిన ఈ ఘనత పట్ల సంతోషం వ్యక్తం చేసిన ముమిన్.. టైటిల్ గెలుపొందడం గర్వంగా ఉందని చెప్పాడు. 'వెయిట్ లిఫ్టింగ్‌లో రికార్డు నెలకొల్పడం సంతోషంగా ఉంది. జమ్ముకశ్మీర్‌లోనే స్ట్రాంగెస్ట్ మ్యాన్‌గా పేరొందడం నిజంగా నాకెంతో గర్వకారణం. నాతో పాటు చీనాబ్ లోయ వాసులంతా గర్వపడే క్షణమిది. ఈ టైటిల్ విజయం వెనక కొన్నేళ్ల శ్రమ దాగి ఉంది. ఈ స్థాయికి రావడానికి ఎన్నో త్యాగాలు చేశాను. ఈ విజయాన్ని మా ప్రాంతంలోని యువతకు అంకితం చేస్తున్నా. నన్ను స్ఫూర్తిగా తీసుకొని వాళ్లు తమ అభిరుచుల్లో రాణించాలని కోరుకుంటున్నా' అని వెల్లడించాడీ పవర్ లిఫ్టర్.

## పాకిస్థాన్ కెప్టెన్‌కు 'గోల్డ్ ఐ ఫోన్' గిఫ్ట్

పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోని కరాచీ కింగ్స్ తమ క్రికెటర్లకు హెయిర్ డ్రయ్యర్, ట్రిమ్మర్‌లను కానుకలుగా ఇవ్వడం చూశాం. అయితే.. లాహోర్ క్యాలండర్స్ మాత్రం ఓ అడుగు ముందుకేసి తమ కెప్టెన్ షాహీన్ అఫ్రిదికి బంగారు ఐ ఫోన్‌ను గిఫ్ట్‌గా అందించింది. దాంతో, అఫ్రిదితో పాటు క్యాలండర్స్ జట్టు ఆటగాళ్లు ఆశ్చర్యానికి గురయ్యారు. కెప్టెన్‌గా, పేసర్‌గా రాణిస్తూ లాహోర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు అఫ్రిది. దాంతో, అతడి కోసం ప్రత్యేకంగా 24 క్యారట్ల బంగారంతో ఐ ఫోన్ 16 ప్రోను తయారు చేయించింది యాజమాన్యం. ఈస్టర్ సంబర్భంగా మైదానంలో అతడిని ఆశ్చర్యపరుస్తూ ఈ స్పెషల్ గిఫ్ట్‌ను అందించింది. అఫ్రిది ఫోన్ ఉన్న బాక్స్‌ను ఓపెన్ చేయగానే పక్కనే ఉన్న ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్ షాకయ్యాడు. 'అమ్మో.. ఇంత ఖరీదైన గిఫ్టా' అనినోరెళ్లబెట్టాడు. ఊహించని గిఫ్ట్‌తో అవాక్కైన అఫ్రిది.. తన స్పెషల్ గిఫ్ట్‌ను అభిమానులకు చూపిస్తూ మురిసిపోయాడు. అయితే.. తమ అందరినీ వదిలేసి కెప్టెన్‌కు మాత్రమే గిఫ్ట్ ఇవ్వడం సమంజసం కాదని పేసర్ హ్యారిస్ రవుఫ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. లాహోర్ క్యాలండర్స్ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఈ వీడియో నెట్టింట వైరలవుతోంది.



# రీల్

## నటన నా రక్తంలోనే ఉంది

– రంభ



సీనియర్ హీరోయిన్ రంభ 1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. అయితే, రంభ సినిమాలకు దూరమై 15 ఏళ్లు అయిపోయాయి. ప్రస్తుతం ఓ టీవీ రియాలిటీ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. కాగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రంభ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. వివాహం అనంతరం కెనడాలో స్థిరపడినట్లు ఆమె చెప్పుకొచ్చింది. రంభ ఇంకా మాట్లాడుతూ.. 'నా పిల్లలకు ఒక వయసు వచ్చేవరకూ తల్లిగా పూర్తి బాధ్యత తీసుకున్నాను. వారిని దగ్గరుండి చూసుకున్నాను. ఇప్పుడు మా బాబుకు 6 ఏళ్లు. కుమార్తెలకు 14, 10 ఏళ్లు వచ్చాయి. వాళ్ల కోసమే నేను ఇన్నేళ్లు సినిమాలకు దూరమయ్యాను' అని రంభ చెప్పింది. రంభ ఇంకా మాట్లాడుతూ.. 'నాకు సినిమాలపై ఉన్న ఆసక్తి నా భర్తకు తెలుసు. ఆయన ప్రోత్సాహంతోనే ఈ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరించేందుకు అంగీకరించాను. ఈ షో కోసం నన్ను సంప్రదించినప్పుడు ఇందులో భాగం కావాలా, వద్దా అని ఆలోచించాను. నా కుటుంబం నన్ను పోత్సహించింది. నాకు సినిమాలపై మరోసారి ఆసక్తి కలిగింది. 15 ఏళ్లు దూరమైనప్పటికీ నటన నా రక్తంలోనే ఉంది. నాతో పాటు ఇండస్ట్రీకి వచ్చిన ఎంతోమంది నేటికీ నటిస్తూనే ఉన్నారు. అందుకే నేను కూడా మరోసారి వెండితెరపై కనిపించాలని నిర్ణయించుకున్నాను' అంటూ రంభ తెలిపింది.



## ఉజ్జయినీ మహాకాళేశ్వర్ సేవలో యష్

కన్నడ స్టార్ హీరో యష్ ప్రధాన పాత్రలో 'రామాయణ' మూవీని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు పార్ట్‌లుగా రామాయణ చిత్రం తెరకెక్కనుండగా, ఈ మూవీకి నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ రాముడిగా.. సాయిపల్లవి సీతమ్మగా నటిస్తున్నారు. ఇందులో రావణుని పాత్రలో యశ్ కనిపించనున్నారు. అయతే సోమవారం ఉదయం ఉజ్జయినీ మహాకాళేశ్వర్‌ను దర్శించుకున్నారు కన్నడ స్టార్ హీరో యష్. స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన త్వరలోనే ఆయన 'రామాయణ పార్ట్ 1 మూవీ సెట్‌లో అడుగుపెట్టబోతున్నట్టు తెలుస్తుంది.

## మరో రికార్డు నెలకొల్పిన అజిత్



ప్రముఖ నటుడు అజిత్ ప్రొఫెషనల్ రేసర్ అనే సంగతి తెలిసిందే. సినిమా షూటింగ్స్ లేక పోతే రేసింగ్ బైక్స్, కార్లతోనే కాలక్షేపం చేస్తుంటారాయన. తన టీమ్‌తో కలిసి అజిత్ తాజాగా మరో ఘనత సాధించారు. బెల్జియంలో నిర్వహించిన స్పా ఫ్రాన్‌కోర్‌ఛాంప్స్ సర్క్యూట్‌లో ఆయన టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ టీమ్ ఆనందం వ్యక్తం చేసింది. సినిమా అయినా, స్పోర్ట్స్ అయినా అజిత్ ఉన్న చోట పాజిటివ్ ఎనర్జీ ఉంటుందని కొనియాడింది. టాలీవుడ్‌కు చెందిన సినీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అజిత్‌కు శుభాకాంక్షలు తెలిపింది. ఇదొక అద్భుతమైన విజయమని, అజిత్ గర్వపడేలా చేశారని పేర్కొంది. పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు అజిత్‌కు విషెస్ తెలియజేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్‌లో అజిత్ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ పోటీల్లో అజిత్ టీమ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటలీలో ఇటీవల జరిగిన 12హెచ్ రేస్‌లోనూ మూడో స్థానం దక్కించుకుంది.

## డేటింగ్‌లో వారిద్దరూ?



తన అందం, అభినయంతో తొలి సినిమాతోనే అందరికీ అభిమాన నటిగా మారారు భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో ఆమె పేరు ట్రెండింగ్ అవుతోంది. దీనికి కారణం యంగ్ హీరో రామ్ పోతినేనితో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారం కావడమే. వీరిద్దరూ కలిసి ఓ సినిమాలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కినప్పటి నుంచి వీరిద్దరిపై రూమర్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా వీరిద్దరూ షేర్ చేసిన ఫొటోల్లో బ్యాక్‌గ్రౌండ్ ఒకేలా ఉండడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆ ఫొటోలు చూసిన నెటిజన్లు 'ఒకే గదిలో ఫొటో దిగారా' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరొక నెటిజన్ ఇంకాస్త వివరంగా 'మీ చేతికి ఉంగరం ఉంది. అది ఎవరు తొడిగారు?' అని అడిగారు. దీనికి భాగ్యశ్రీ స్పందిస్తూ.. 'అది నేనే కొనుక్కున్నాను' అని రిప్లై పెట్టారు. ప్రస్తుతం వారి ఫొటోలతో పాటు ఆమె రిప్లై కూడా ఆసక్తిగా మారింది.




## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



ప్రజాపక్షం/కౌడిపల్లి : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృతి చెంది ఆరుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని వెంకట్రావు పేట గేటు సమీపాన మెదక్ నర్సాపూర్ ప్రధాన రహదారి రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది వివరాల్లోకెళ్తే హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కుబ్దుల్లాపూర్ మండలం సూరారం వాస్తవ్యులు పిల్లలతో సహా తొమ్మిది మంది కారులో ప్రయాణిస్తూ మెదక్ వైపు వెళ్తుండగా రైలాపూర్ గ్రామానికి చెందిన హరీష్ రెడ్డి రైలాపూర్ నుండి నర్సాపూర్ వైపు వెళుతుండగా వెంకట్రావు పేట గేటు సమీపన అతివేగంతో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సూరారం కు చెందిన మహమ్మద్ అలీ 45, అజీమా బేగం 40, మహమ్మద్ గౌస్ తో పాటు మనుమడు ఏడాది బిడ్డ కూడా మృతి చెందారు. మిగిలిన ఆరుగురు సహనా బేగం, ఇరాన్ షాహిష్, హలీమా, మహమ్మద్, చిన్నారులు నీలాఫర్ (ఆరు నెలలు) జూనెర (నాలుగు నెలలు) తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. షిఫ్టు డిజైర్ కార్ లో ఉన్న హరీష్ రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డిఎస్‌పి వెంకట్ రెడ్డి, సిఐ జాన్ రెడ్డి, ఎస్సై రంజిత్ రెడ్డి సందర్శించారు. ప్రమాద విషయమై ఆరా తీశారు ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమైందని చెప్పారు నేషనల్ హైవే 765d డివైడర్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఎనిమిది లక్షల రూపాయలతో సేఫ్టీ హోల్డర్లు మూలమలుపుల వద్ద ఏర్పాటు చేశామన్నారు కానీ ప్రమాదం జరిగిన చోటు నేరుగా ఉండటంతో అతివేగంతో అజాగ్రత్తతోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు.
ప్రయాణికులు ముఖ్యంగా వేగాన్ని నియంత్రించుకొని గమ్యాలను చేరుకోవాలన్నారు. దర్యాప్తు చేసి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మృతుడి తమ్ముడు మహమ్మద్ అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు.







## బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతోంది: బల్మూరి

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి నాయకులు తమ రాజకీయ లబ్దికోసం ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో ప్రశాంతమైన హైదరాబాద్ నగరంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో మత విద్వేషాలు పెంచేందుకు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిగా ఈటెల రాజేందర్ హైదరాబాద్ అభివృద్ధికి కనీసం ఏమి చేయకపోగా, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఓటర్ల కాదని, వాళ్లంతా పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులు, ఎక్స్ అఫిషియో ఓటర్లు మాత్రమే ఓటు వేస్తారు అలాంటి అప్పుడు ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చకొట్టడం దుర్మార్గమన్నారు. 2016లో 4మంది వున్న కార్పొరేటర్లను 2020లో ప్రజలు 48మంది కార్పొరేటర్లను గెలిపించారు.రెండు సార్లు కేంద్ర మంత్రిగా వున్నా కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని, నగర అభివృద్ధిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు.బలం లేకపోవడంతోనే కాంగ్రెస్ ఎన్నికలో పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com